
గురువారం 23-2-2023



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM


పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 159

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ప్రతీకార పోరుకు సై..
టి20 మహిళల ప్రపంచకప్‌లో
నేడు ఆసీస్‌తో భారత్ సెమీస్ - 12లో



ఐదు నెలల్లో అతిపెద్ద పతనం
61 వేల దిగువకు సెన్సెక్స్.
928 పాయింట్ల నష్టం - 13లో



ఢిల్లీ మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్

ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన షెల్లీ ఒబెరాయ్ ఎన్నికయ్యారు. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై షెల్లీ 34 ఓట్ల తేడాతో గెలుపొందారు.

వివరాలు 6లో ▸



మార్గమధ్యంలో ఆయిల్ లీకేజీ

అమెరికాలోని నెవార్క్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిరిండియా విమానంలో ఇంజన్ నుంచి ఆయిల్ లీక్ అయ్యింది. దీంతో స్టాక్‌హోమ్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్ చేశారు.

వివరాలు 6లో ▸

ఈనాడు 'కొట్టు' కథ

రెండేళ్ల కిందటి ఫొటోలతో.. 'పట్టాభినీ కొట్టారు' అంటూ బ్యానర్ స్టోరీ

- గన్నవరం ఘటనలోనే పోలీసులు కొట్టినట్లుగా నమ్మించడానికి ప్రయత్నం
- 2021 ఫిబ్రవరి 3న తనపై దాడి జరిగిందంటూ పట్టాభి హైడ్రామా
- గుర్తు తెలియని వారు దాడి చేశారంటూ పార్టీలో సానుభూతి కోసం ఎత్తుగడ
- అప్పట్లో దాన్ని ప్రభుత్వ వైఫల్యమంటూ రెచ్చిపోయిన బాబు, రామోజీ
- పేజీల కొద్దీ కథనాలు వండేసిన 'ఈనాడు'... ఇప్పుడూ అదే తీరు
- అలనాటి ఫొటోలతో... అదే తరహా కథనాలతో రెచ్చిపోయిన రామోజీ
- పట్టాభి భార్య ఆవేదన...చంద్రబాబు ఆగ్రహం అంటూ రాద్ధాంతం
- ఐపీసీ కాదు వైసీపీ అమలవుతోందంటూ విషం చిమ్మిన 'ఈనాడు'
- ప్రజల మధ్య విద్వేషమే లక్ష్యంగా 'ఎల్లో గ్యాంగ్' బరితెగింపు
- అవి పాత ఫొటోలని నిర్ధరించి.. ఉతికి ఆరేసిన సోషల్ మీడియా యాక్టివిస్టులు
- 'ఈనాడు' అబద్ధాల పుట్ట అని మరోసారి రుజువైన తీరు
- పట్టాభిని పోలీసులు కొట్టలేదని వైద్య పరీక్షల్లో నిర్ధారణ



టీడీపీ నేత పట్టాభిని కొట్టారంటూ రెండేళ్ల కిందటి ఫొటోలను తీసుకొచ్చి మంగళవారమే జరిగినట్టుగా ప్రచురించిన 'ఈనాడు'

సాక్షి, అమరావతి:

'ఈనాడు' పత్రిక ఎందుకింతలా దిగజారిపోతోంది? ఒక పార్టీపై బురద జల్లడానికి.. ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చడానికి... పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయటానికి... ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి రెండేళ్ల కిందటి ఫొటోలు ఇవ్వాళ్టివేనని అబద్ధాలు చెబుతూ ప్రచురించే స్థాయికి ఎందుకు పడిపోయింది? అసలిలాంటి పత్రికను ఎవరైనా నమ్మొచ్చా? చంద్రబాబును అధికార పీఠంపైకి తేవటం కోసం ఈ రాష్ట్రాన్ని ఏం చేసినా ఫర్వాలేదనుకునే రామోజీరావు మనస్తత్వాన్ని క్షమించవచ్చా?

'పట్టాభినీ కొట్టారు' అంటూ పతాక స్థాయిలో వేసిన శీర్షికలోనే కాదు... ఆ వార్తలో ప్రతి అక్షరం అబద్ధాలతో కూడిన కాలకూట విషమే. అసలు పట్టాభిని కొట్టనే లేదని పోలీసులు కోర్టులో చెబితే... దాన్ని వైద్యాధికారులు సైతం ధ్రువీకరిస్తే... కొట్టారంటూ 'ఈనాడు'లో వార్తలేంటి? పైపెచ్చు... 'తీవ్రంగా కొట్టారు. అరచేతిపైనా, కాళ్లపైనా థర్డ్ డిగ్రీ ప్రయోగించార'ంటూ దుర్మార్గపు రాతలేంటి? ఆ రాతలన్నీ నిజమని నమ్మించటానికి వాటికి రుజువులుగా ఎప్పుడో రెండేళ్ల కిందట '2021 ఫిబ్రవరి 3న' తన పత్రికలోనే వేసిన ఫొటోలను మళ్లీ ఇప్పుడు వేసేసిన దౌర్భాగ్యపు పరిస్థితేంటి? అంటే... మీ దృష్టిలో మీ పాఠకులంతా వెర్రివాళ్లా రామోజీరావు గారూ? మీరు ఏం రాసినా నమ్మేస్తారనే భ్రమల్లోనే ఇంకా బతుకుతున్నారా? అదంతా ఒక చరిత్ర అని... 'సాక్షి' రాకముందు కొన్నాళ్లపాటు తెలుగు పత్రికా రంగం ఎదుర్కొన్న సంధికాలమని ఇప్పటికీ తెలియటం లేదా? 'సాక్షి' ఆవిర్భవించిన నాటి నుంచీ మీ ఏకఛత్రాధిపత్యానికి కాలం చెల్లిందని... వార్తలకు రెండోవైపున ఏమున్నదో కూడా జనం చూస్తున్నారని మరిచిపోయారా? ఇంటర్నెట్ వేదికగా వ్యక్తులే శక్తిమంతమైన మీడియాగా మారుతున్న ఈ రోజుల్లోనూ మీరు పచ్చి అబద్ధాలను పోగేస్తే

మిగతా 2వ పేజీలో ▶

పట్టాభిని కొట్టామనడం

అవాస్తవం

- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు: కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా

3లో

టీడీపీ నేత పట్టాభికి 14 రోజుల రిమాండ్

- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ధ్రువీకరణ
- మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు

3లో

కన్నాను ఓడించడం

గ్యారెంటీ



- ఆయన్ని టీడీపీలోకి తీసుకోవడం చంద్రబాబుకు తప్ప ఎవరికీ ఇష్టంలేదు
- నన్ను, బాబును కన్నా ఎన్ని మాటలు అన్నారో.. అలాంటి వ్యక్తిని దగ్గరకు తీసుకుంటారా?
- పార్టీకి అవసరమంట.. నరసరావుపేటలో ఎన్ని ఓట్లు వచ్చాయో తెలియదా?
- నేనిక బాబు వద్దకు వెళ్లను
- ఏ స్టేట్‌మెంటూ ఇవ్వొద్దని అచ్చెన్నాయుడు చెప్పారు
- కుండబద్దలుకొట్టిన టీడీపీ నేత రాయపాటి సాంబశివరావు

- వివరాలు 10లో



న్యాయవాదులకు చెక్కు అందజేస్తున్న సీఎం జగన్

మన లక్ష్యం.. పేదలకు 'న్యాయం'

న్యాయవాదులకు అండగా 'వైఎస్సార్ లా నేస్తం': సీఎం జగన్

- ఇక ఆరు నెలలకు ఒకసారి, సంవత్సరానికి రెండు దఫాలు ఆర్థిక సాయం
- మూడున్నరేళ్లలో 4,248 మంది లాయర్లను ప్రతినెలా ఆదుకున్నాం
- రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు
- కోవిడ్ సమయంలో దాదాపు రూ.25 కోట్ల మేర లాయర్లకు మేలు జరిగింది
- వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ లా నేస్తం అమలు.. పథకంతో 2,011 మందికి రూ.1,00,55,000 మేర సాయం
- బటన్ నొక్కి నేరుగా ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

2లో



పెళ్లి చేసుకోకుండా పిల్లలు కావాలనుకోవడం తప్పనుకుంటా సార్!

జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సాదర స్వాగతం



రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి కుటుంబ సభ్యులతో చేరుకున్న జస్టిస్ నజీర్‌ను సీఎం సత్కరించారు.

2లో

దూసుకొచ్చిన

మృత్యువు

- పార్వతీపురం మన్యం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొట్టిన లారీ.. ఐదుగురు మృత్యువాత

- వివరాలు 10లో

నూతన పద్ధతిలో ఆర్మీ రిక్రూట్‌మెంట్

10లో

- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు, ప్రాథమిక పరీక్ష
- మార్చి 15 వరకు దరఖాస్తులకు గడువు

ఏపీ నుంచే నేరుగా

హజ్ యాత్ర

5లో

గవర్నర్‌కు సీఎం జగన్ ఆత్మీయ వీడ్కోలు

సీఎంకు, రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన గవర్నర్ విశ్వభూషణ్



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



గవర్నర్ పాదాలకు నమస్కరిస్తున్న సీఎం

సాక్షి, అమరావతి/విమానాశ్రయం(గన్నవరం): ఛత్తీస్‌గఢ్ గవర్నర్‌గా బదిలీపై వెళ్తున్న విశ్వభూషణ్ హరిచందన్‌కు సీఎం వైఎస్ జగన్ బుధవారం గన్నవరం విమానాశ్రయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. అంతకుముందు విజయవాడ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న విశ్వభూషణ్ హరిచందన్, సుప్రవ హరిచందన్ దంపతులను సీఎం జగన్ సాదరంగా సత్కరించారు. తన విధి నిర్వహణలో సహకరించిన సీఎంకు, రాష్ట్ర ప్రజలకు హరిచందన్ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనకు పోలీసు బలగాలు గౌరవ వందనం సమర్పించాయి. గవర్నర్ దంపతులను సీఎం జగన్ ప్రత్యేక విమానం వరకు తోడ్కొని వెళ్లారు. విశ్వభూషణ్ పాదాలకు సీఎం జగన్ నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. మండలి చైర్మన్ మోషేన్‌రాజు, మంత్రి జోగి రమేశ్, సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, గవర్నర్‌కు వీడ్కోలు పలికారు.

జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సాదర స్వాగతం

- స్వాగతం పలికిన సీఎం జగన్
- గన్నవరం విమానాశ్రయంలో ప్రత్యేక స్వాగత కార్యక్రమం



జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): రాష్ట్ర నూతన గవర్నర్‌గా నియమితులైన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాదర స్వాగతం పలికారు. జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి 8.15 గంటలకు ఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జస్టిస్ అబ్దుల్ నజీర్‌ను సీఎం జగన్ శాలువాతో సత్కరించారు. అనంతరం ఇంటర్నేషనల్ టెర్మినల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక వద్దకు జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం జగన్ చేరుకున్నారు. అక్కడ శాసన మండలి చైర్మన్ మోషేన్ రాజు, మంత్రి జోగి రమేశ్, ప్రభుత్వప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రేవు ముత్యాలరాజు, కృష్ణా జిల్లా కలెక్టర్ పి. రంజిత్‌బాషా, ఎస్పీ పి. జాషువా, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రానా, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు న్యాయమూర్తులు జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలికారు. అనంతరం విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకున్న జస్టిస్ అబ్దుల్ నజీర్, ఆయన కుటుంబ సభ్యులకు గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

మావోయిస్టు కీలకనేత రైనో అరెస్ట్



శ్రీనుబాబు (ఫైల్)

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మావోయిస్టు పార్టీ ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు (డీసీఎం) జనుమూరి శ్రీనుబాబు అలియాస్ సునీల్ అలియాస్ రైనోను ఏవోబీలో అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సీలేరు పోలీసు స్టేషన్ పరిధి, ఆంధ్ర, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు, పోలీసులకు జరిగిన ఎదురుకాల్పుల సమయంలో రైనోను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. రైనో ఏవోబీ టెక్నికల్ టీమ్‌లో, సీఆర్‌సీ 3వ కంపెనీలో కమాండర్‌గా, మావోయిస్టు నేత ఆర్‌కేకు ప్రొటెక్షన్ స్క్వాడ్ కమాండర్‌గా, ఏవోబీలో మిలిటరీ ప్లటూన్ కమాండర్‌గా వివిధ హోదాల్లో పనిచేశాడని తెలిపారు. 2018లో అప్పటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేల హత్యకేసులోనూ రైనో ప్రధాన నిందితుడని పేర్కొన్నారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టుగా పోలీసుశాఖ రికార్డుల్లో ఉన్నాడని తెలిపారు. అరెస్టయిన శ్రీనుబాబు అలియాస్ రైనోపై ప్రభుత్వం రూ.5 లక్షల రివార్డును గతంలో ప్రకటించిందని పేర్కొన్నారు. రైనోను న్యాయస్థానంలో హాజరుపరిచామని ఎస్పీ తెలిపారు.

పాత ఫొటోలతో అవే అబద్ధాలు

టీడీపీ రౌడీయిజం, ఎల్లో మీడియా టెర్రరిజం ఆర్డీఎక్స్ కంటే డేంజర్: సజ్జల

- ఎమ్మెల్సీ అభ్యర్థులుగా 11 మంది బీసీల ఎంపికపై దేశమంతా చర్చిస్తుంటే తప్పుదోవ పట్టించే కుట్రలు
- 2021లో కిందపడటం వల్ల పట్టాభికి గాయాలు
- గన్నవరంలో పోలీసులు కొట్టినట్లు పాత ఫొటోలతో తప్పుడు కథనాలు
- విశ్వసనీయత ఎప్పుడో కోల్పోయిన ఈనాడును ప్రజలంతా స్వచ్ఛందంగా బహిష్కరించాలి



సాక్షి, అమరావతి: పట్టాభికి గాయాలంటూ రెండేళ్ల నాటి పాత ఫొటోలతో పాఠకులను తప్పుదోవ పట్టించడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నించిన ఈనాడును ప్రజలంతా స్వచ్ఛందంగా బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విపరీత ధోరణులు, రౌడీయిజానికి వికృత మనస్తత్వం కలిగిన ఎల్లో మీడియా టెర్రరిజం తోడవటం ఆర్డీఎక్స్ బాంబు కంటే ప్రమాదకరమని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వికృత ఆలోచనలున్న టీడీపీ, ఎల్లో మీడియా రోజూ సవాళ్లు విసురుతూ రాష్ట్రంలో ఏదో జరిగిపోతోందనే ఆందోళన రేకెత్తించే దుస్సాహసానికి ఒడిగట్టాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. 18 ఎమ్మెల్సీ స్థానాలకుగానూ వైఎస్సార్‌సీపీ తరఫున 11 స్థానాల్లో బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పిస్తూ సీఎం జగన్ తీసుకున్న చారిత్రక నిర్ణయంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే పక్కదోవ పట్టించేందుకు చంద్రబాబు కుట్ర పన్నారని మండిపడ్డారు. అందులో భాగంగానే ఆయన పెంచి పోషిస్తున్న, మదమెక్కిన పట్టాభిని గన్నవరానికి పంపారని స్పష్టం చేశారు. పోలీసులపై దాడులకు పురిగొల్పి శాంతి భద్రతల సమస్య సృష్టించేందుకు యత్నించారని ధ్వజమెత్తారు.

అవే పాత అబద్ధాలతో..

విశ్వసనీయతను 'ఈనాడు' ఎప్పుడో కోల్పోయిందని సజ్జల స్పష్టం చేశారు. ప్రపంచాన్ని తానే శాసించగలననే విపరీత ఆలోచనలున్న రామోజీరావు ఈ క్రమంలో మరో అడుగు ముందుకేశారని చెప్పారు. 2021లో కిందపడటం వల్ల పట్టాభికి దెబ్బలు తగిలితే ఇప్పుడు పోలీసులు కొట్టడం వల్లే ఆ గాయాలైనట్లు పాత ఫొటోలతో బుధవారం 'ఈనాడు'లో తప్పుడు కథనాన్ని అచ్చేసి ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్ర చేశారని మండిపడ్డారు. అవే పాత అబద్ధాలతో కొత్త అబద్ధాలను సృష్టించే యత్నంలో దొరికిపోయిన ఈనాడును ప్రజలంతా స్వచ్ఛందంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ నుంచి లాక్కున్న టీడీపీలో చంద్రబాబు నేతృత్వంలోని రౌడీమూకలు, అబద్ధాల కోరులే మిగిలారని చెప్పారు. ఆ పార్టీని భూస్థాపితం చేయడం ద్వారా ఆ శక్తులకు చరమగీతం పాడాలని సూచించారు.

- మీడియా ద్వారా రిమోట్‌తో వ్యవస్థలను మేనేజ్ చేయవచ్చనే వికృత ఆలోచనతో రామోజీరావు 'ఈనాడు'ను స్థాపించారు. ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను హననం చేస్తూ చంద్రబాబు పన్నే కుట్రలకు వంత పాడుతున్నారు. గత 44 నెలలుగా సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలతో సుపరిపాలన అందిస్తుంటే ప్రజల్లో చర్చ జరగకుండా అడ్డుకునేందుకు ఎప్పటికప్పుడు కుట్రలు చేస్తూనే ఉన్నారు.
- గన్నవరంతో పట్టాభికి ఏం సంబంధం? చంద్రబాబు కనుసైగ మేరకు గన్నవరానికి వెళ్లిన పట్టాభి వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి, పోలీసులపై దాడులు చేసి అరాచకం సృష్టించారు. ఈ ఘటనకు ముమ్మాటికీ టీడీపీదే బాధ్యత.
- చంద్రబాబు అధికారంలో ఉండగా ఏబీ వెంకటేశ్వరరావు ద్వారా పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేసి ఆర్కే రోజా, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ముస్తాఫాపై దాడులకు పాల్పడ్డారు. సత్తెనపల్లి ఎంపీపీ ఎన్నికల్లో ఎంపీటీసీలను కిడ్నాప్ చేసేందుకు నాడు

కోడెల శివప్రసాద్ నేతృత్వంలో దాడులకు బరి తెగించారు. పత్తికొండ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ చెరుకులపాడు నారాయణరెడ్డిని వెంటాడి హత్య చేయించారు. విశాఖలో నాడు వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిన కొద్ది నిముషాల్లోనే వైఎస్సార్‌సీపీ అభిమానులతోనే దాడి చేయించుకుని ఉంటారని నాటి డీజీపీతో బలవంతంగా మాట్లాడించారు. పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడమంటే అదీ.

- ప్రజలకు భద్రత కల్పించాలనే లక్ష్యంతోనే జీవో 1 తెచ్చాం. ఇరుకు సందుల్లో సభలతో అమాయకుల ప్రాణాలను చంద్రబాబు బలి తీసుకున్నారు.
- చంద్రబాబు నేతృత్వంలోని టీడీపీలో ఉగ్రవాద ఆలోచనలున్నాయి. ధర్మ యుద్ధానికి, రాజమార్గానికి దూరంగా అడ్డదారిలో వెళ్లడమే వారి విధానం.

ఆప్టిక్ కేబుల్స్.. ఆశాదీపం!



- భూకంపాలను ముందుగానే గుర్తించే అవకాశం
- అండర్ గ్రౌండ్ కేబుల్స్ ద్వారా సమాచార సేకరణ
- ప్రాథమిక స్థాయిలో పరిశోధనలు
- పి – తరంగాలు ఏర్పడిన వెంటనే సమాచారం
- గూగుల్ షేక్ అలెర్ట్ ద్వారా మొబైల్‌కు ముందస్తు హెచ్చరికలు
- ప్రాణనష్టం తగ్గించేలా రూపొందుతున్న డాస్ వ్యవస్థ
- పరిశోధనలు చేస్తున్న జర్మన్ రీసెర్చ్ సెంటర్

తుపాను వస్తుందని, చేపల వేటకు వెళ్లొద్దని రెండు వారాల ముందే హెచ్చరికలు జారీ అవుతున్నాయి.

అగ్ని పర్వతం బద్దలవుతుందని వారం ముందే సమాచారం వస్తోంది.

పిడుగులు ఎక్కడ పడతాయో మొబైల్ ఫోన్లకు సమాచారం అందుతోంది.

కానీ..
క్షణాల్లో భారీ విధ్వంసం సృష్టించే భూకంపాలను ముందుగా పసిగట్టలేకపోతున్నాం. ఇప్పుడు దీనిపైనే శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. ముందస్తుగా భూకంపాల తీవ్రతను తెలుసుకొని, ప్రాణ నష్టాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టారు.

కె.జి. రాఘవేంద్రారెడ్డి
(సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

ప్రస్తుతం సిస్మోమీటర్ ద్వారా కేవలం కొన్ని సెకన్ల ముందు మాత్రమే భూకంపాలను తెలుసుకుంటున్నాం. అప్పటికే ఘోరం జరిగిపోతోంది. తుర్కియే, సిరియాల్లో ఇటీవల సంభవించిన తీవ్ర భూకంపం దెబ్బకు వేలాది మంది చనిపోయారు. రిక్టర్ స్కేలుపై దీని తీవ్రత 7.8గా నమోదైంది. ఇలా భారీ నష్టం జరగకుండా ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ ద్వారా భూకంపాల తీవ్రతని కొన్ని గంటల ముందుగానే తెలుసుకొనేలా చేస్తున్న ప్రయోగాలు ప్రాథమిక దశలో ఉన్నాయి. జర్మన్ రీసెర్చ్ సెంటర్ (జియోసైన్సెస్) చేస్తున్న ఈ ప్రయోగం విజయవంతమైతే భూకంపాల వల్ల కలిగే భారీ ప్రాణ నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుంది.

ఏమిటీ ప్రయోగం!

ప్రపంచంలో ఏటా 20 వేలకు పైగా భూకంపాలు నమోదవుతున్నాయి. సగటున రోజుకు 50 ప్రకంపనలు, వస్తుంటాయి. వీటి సమాచారాన్ని సిస్మోమీటర్ ద్వారా తీసుకుంటున్నారు. భూకంప తీవ్రతని రిక్టర్ స్కేల్‌పై కొలుస్తున్నారు. ఇప్పుడు కేబుల్స్ ద్వారా భూకంపాల తీవ్రత సమాచారాన్ని ముందుగానే సేకరించేందుకు డిస్ట్రిబ్యూటెడ్ ఎకౌస్టిక్ సెన్సింగ్ (డాస్) వ్యవస్థని శాస్త్రవేత్తలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం టెలికమ్యూనికేషన్స్ కోసం భూమి లోపల ఏర్పాటు చేస్తున్న ఈ ఆప్టిక్ కేబుల్స్‌కు అత్యంత సూక్ష్మాతి సూక్ష్మమైన కదలికలను గుర్తించే సామర్థ్యం ఉందని, వీటి ద్వారా భూమి లోపల సంభవించే భూకంప తరంగాలను, అగ్నిపర్వత విస్ఫోటనాలను ముందుగానే గుర్తించొచ్చనేది పరిశోధకుల ఆలోచన. ''ఈ కేబుల్స్‌ను నిరంతరం గమనించి, వాటి ద్వారా వచ్చే సమాచారాన్ని క్రోడీకరిస్తే భూకంప తీవ్రతను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది'' అని జర్మన్ రీసెర్చ్ సెంటర్(జియోసైన్సెస్)లో పనిచేసే జియోసైంటిస్ట్ ఫిలిప్ జోసెట్ వివరించారు.

ఎలా సాధ్యమవుతుంది?

తొలుత డాస్ ద్వారా ఇటలీలోని ఎట్నా అగ్నిపర్వతం కార్యకలాపాల్ని పరిశీలించారు. పర్వతం బద్దలయ్యేందుకు కొంత ముందుగా వచ్చే ప్రారంభ కంపనల సమాచారాన్ని ఇది చేరవేసింది. ఇదే తరహాలో భూకంపాలు జరిగినప్పుడు భూ అంతర్భాగంలో జరిగే ప్రాథమిక కదలికల్ని గుర్తించవచ్చు. అంటే.. సెకనుకు 3.7 మైళ్ల వేగంతో ప్రయాణించే ప్రాథమిక భూకంప ప్రకంపనాలు (పి-తరంగాలు) నమోదైన వెంటనే కేబుల్ వ్యవస్థ ద్వారా సమాచారం అందుతుంది. ఈ పి-తరంగాల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగదు. ఆ తర్వాత సెకనుకు 2.5 మైళ్ల వేగంతో వచ్చే సెకండరీ తరంగాలు (ఎస్-వేవ్స్) వల్ల ప్రాణ, ఆస్తి నష్టం ఎక్కువగా ఉంటుంది. మొదటి తరంగాల సమాచారం స్టేషన్ల నుంచి రాగానే.. వాటి తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 4.5 కంటే ఎక్కువగా ఉన్నట్లు గుర్తిస్తే భారీ ప్రమాదం సంభవిస్తుందని పసిగడతారు. వెంటనే ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేస్తారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మొబైల్స్‌కు మెసేజ్‌లు పంపిస్తారు. మాగ్నిట్యూడ్ 4.5 కంటే ఎక్కువ ఉంటే గూగుల్ షేక్ అలెర్ట్ ద్వారా హెచ్చరికలు పంపే వ్యవస్థని రూపొందించారు. దీనికి గూగుల్‌తో భాగస్వామ్యమైనట్లు జర్మన్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు చెబుతున్నారు.

తుర్కియే, సిరియాకంటే ముందు వచ్చిన అతి పెద్ద 10 భూకంపాలు

- మొదటిది దక్షిణ అమెరికాలోని చిలీలో 1960 మే 22న వచ్చింది. ఇదే అతి తీవ్రమైనది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 9.5గా నమోదైంది. దీని వల్ల దూసుకొచ్చిన తరంగాలు దాదాపు భూమి మొత్తం ప్రయాణించాయి. 1,655 మంది మరణించగా 3 వేల మంది క్షతగాత్రులయ్యారు. 550 మిలియన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా.
- 1964 మార్చి 28న అలస్కాలో 9.2 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీనిని గుడ్ ఫ్రైడే భూకంపం అని కూడా పిలుస్తారు. 131 మంది చనిపోయారు.
- 2004 డిసెంబర్ 26న సుమత్రా దీవుల్లో 9.1 తీవ్రతతో సంభవించిన భూకంపం సునామీగా మారింది. ఇది 14 దేశాలపై ప్రభావం చూపింది. 2,27,900 మంది మృత్యువాత పడ్డారు.
- 2011 మార్చి 11న జపాన్‌లోని సెండాయ్‌లో 9.0 తీవ్రతతో భూకంపం వచ్చిన అనంతరం సునామీ కూడా సంభవించింది. 10 వేల మందికి పైగా విగత జీవులయ్యారు.
- 1952 నవంబర్ 4న రష్యాలోని కంచట్కా (హవాయి దీవులు)లో 9.0 తీవ్రతతో సంభవించిన భూకంపంలో 10 లక్షల అమెరికన్ డాలర్ల ఆస్తినష్టం సంభవించింది.
- 2010 ఫిబ్రవరి 27న చిలీలోని బయోబియో ప్రాంతంలో వచ్చిన భూకంపం తీవ్రత 8.8గా నమోదైంది. ఈ ప్రమాదంలో 600 మంది చనిపోయారు.
- 1906 జనవరి 31న ఈక్వెడార్ ఆఫ్ కోస్ట్‌లో 8.8 తీవ్రతతో భూకంపం, దాని వెంటే వచ్చిన సునామీ కారణంగా 500 మంది మృత్యువాత పడ్డారు.
- 1965 ఏప్రిల్ 2న అలస్కాలోని రాట్ ఐలాండ్‌లో సంభవించిన భూకంపం తీవ్రత 8.7గా నమోదైంది.
- 2005 మార్చి 28న ఇండోనేషియాలోని సుమత్రా దీవుల్లో 8.6 తీవ్రతతో సంభవించిన భూకంపం, సునామీ కారణంగా 1,313 మంది మృత్యువాత పడగా, 500 మంది గాయపడ్డారు.

మన లక్ష్యం.. పేదలకు 'న్యాయం'

సాక్షి, అమరావతి: న్యాయవాదులకు అండగా ఉండేందుకు 'వైఎస్సార్ లా నేస్తం' తీసుకొచ్చామని, పథకం ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు వృత్తి జీవితంలో పేదలకు సాయపడాలని సీఎం వైఎస్ జగన్ కోరారు. పథకంలో కొద్ది మార్పులు చేసి ఆర్నెళ్లకు ఒకసారి, ఏడాదికి 2 దఫాలు చొప్పున ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. 'వైఎస్సార్ లా నేస్తం' ద్వారా మూడేళ్లలో దాదాపు 4,,248 మంది లాయర్లను ప్రతి నెలా ఆదుకున్నామని వెల్లడించారు. రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయడంతోపాటు కోవిడ్ సమయంలో దాదాపు రూ.25 కోట్ల మేర లాయర్లకు ప్రయోజనం చేకూర్చినట్లు వివరించారు. పేదవాడి పట్ల న్యాయవాదులు అంకితభావం చూపాలని కోరారు. వరుసగా నాలుగో ఏడాది వైఎస్సార్ లా నేస్తం పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2,011 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాల్లో రూ.1,00,55,000 మేర ఆర్థికసాయాన్ని సీఎం జగన్ బుధవారం క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి జమ చేశారు. సీఎం ఏమన్నారంటే..

వృత్తిలో ఊతమిచ్చేందుకు...

దేవుడి దయతో గత మూడు సంవత్సరాలుగా మంచి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. న్యాయవాదులకు ప్రభుత్వం తోడుగా ఉందన్న సంకేతాన్ని గట్టిగా చెప్పేందుకు ఈరోజు ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నా. న్యాయవాది వృత్తిని ఎంచుకున్నవారు మన రాజ్యాంగాన్ని, చట్టాలను క్షుణ్నంగా చదువుకుని న్యాయవాదులుగా స్థిరపడే క్రమంలో తొలి మూడేళ్లు ఎలాంటి ఇబ్బందులు ఉంటాయో పాదయాత్ర సందర్భంగా చాలాసార్లు నా దృష్టికి తెచ్చారు. వారంతా సొంత కాళ్ల మీద నిలబడే ఒక గొప్ప పథకం ఇది. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమం న్యాయవాదులుగా స్థిరపడేందుకు దోహదం చేస్తుంది. ప్రభుత్వం వారికి తోడుగా నిలవడం వల్ల డబ్బులు లేని పేదవాడికి సాయం చేయగలుగుతారనే విశ్వాసం ఉంది. ప్రభుత్వం తమకు తోడుగా నిలిచినట్లుగానే, తాము కూడా పేదలకు సాయపడాలనే తలంపు వారి మనసులో మెదలాలన్నదే మా ఆరాటం. చదువు పూర్తి చేసుకుని న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన తరువాత తొలి మూడేళ్లు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం తోడుగా ఉందనే భరోసా ఇవ్వడం కోసం లా నేస్తం పథకాన్ని తీసుకొచ్చాం. ఇది వారికి వృత్తిలో ఊతమివ్వడంతో పాటు స్థిరపడేందుకు దోహదం చేస్తుంది.

మూడున్నరేళ్లలో 4,248 మందికి లబ్ధి..

ఈ పథకం ద్వారా మూడున్నరేళ్లలో దాదాపు 4,248 మంది లాయర్లను ప్రతి నెలా ఆదుకున్నాం. రూ.35.40 కోట్లు సహాయంగా అందించాం. ఈరోజు 2011 మంది అర్హులైన జూనియర్ న్యాయవాదులు పథకంలో కొనసాగుతున్నారు. వీరికి ఇవాళ దాదాపు రూ.కోటికి పైగా జమ చేస్తున్నాం. ఒకేసారి పెద్ద అమౌంట్ ఇస్తే వారి అవసరాలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో పథకంలో కొద్ది మార్పులు చేసి ఆర్నెళ్లకు ఒకసారి, ఏడాదికి 2 సార్లు అందచేస్తున్నాం.

రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్...

న్యాయవాదుల సంక్షేమం కోసం మరో గొప్ప అడుగు వేసి రూ.100 కోట్లతో లాయర్ల కార్పస్ ఫండ్ నెలకొల్పాం. కోవిడ్ సమయంలో కార్పస్ ఫండ్ ద్వారా దాదాపు రూ.25 కోట్ల మేర మంచి చేయగలిగాం. అడ్వొకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీలు సభ్యులుగా ఉంటూ అడ్వకేట్ వెల్ఫేర్ ట్రస్ట్ నిర్వహిస్తున్నారు. ఇందుకోసం లా సెక్రటరీకి నేరుగా దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో లా సెక్రటరీ మెయిల్ ఐడీకి కూడా దరఖాస్తు చేయవచ్చు. sec& law@ap. gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక లా నేస్తం పథకానికి సంబంధించి కూడా పారదర్శకంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. ysrlawnestham.ap.gov.in వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసుకోవాలి. దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేసి ఏ ఒక్కరూ మిస్ కాకుండా సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూర్చేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. న్యాయవాది చేతిలో ఉన్న ఆయుధం.. సైనికుడి చేతిలో ఉన్న తుపాకీ లాంటిదని, హంతకుడి చేతిలో ఉండే బాకు లాంటిది కాదని చెబుతుంటారు. నేను మీ అందరికీ ఒక్కటే విజ్ఞప్తి చేస్తున్నా. ఈరోజు ప్రభుత్వం చేస్తున్న మంచి ద్వారా ప్రయోజనం పొందుతున్న వారు దాన్ని గుర్తుంచుకుని అదే అంకిత భావాన్ని పేదవాడి పట్ల చూపాలని కోరుతున్నా. ఈ కార్యక్రమంలో లా సెక్రటరీ జి.సత్యప్రభాకరరావు, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రగిరి విష్ణువర్ధన్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


ఆత్మవిశ్వాసం పెరిగింది



బెజవాడ బార్ అసోసియేషన్‌లో ఏడాది నుంచి జూనియర్ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నా. మంచి క్రిమినల్ లాయర్ అవ్వాలన్నది నా లక్ష్యం. మాది మధ్యతరగతి కుటుంబం కావడంతోకోర్టుల చుట్టూ ఎందుకు తిరుగుతావు? మంచి జీతం వచ్చే ఉద్యోగంలో చేరమని తల్లిదండ్రులు చెబుతుంటారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక వైఎస్సార్ లా నేస్తం పథకం ఎంతో ఉపయోగపడింది. దీంతో నాలో కాన్ఫిడెన్స్ పెరిగింది. తల్లిదండ్రులపై ఆధారపడకుండా నేను నిలదొక్కుకునేందుకు ఈ పథకమే కారణం. పాదయాత్ర హామీని సీఎం జగన్ నెరవేర్చడంతో చాలా సంతోషంగా ఉన్నాం, . ద్యాంక్యూ సార్.

–అమూల్య, లా నేస్తం లబ్ధిదారు, జూనియర్ న్యాయవాది, ఎన్టీఆర్ జిల్లా

ఉన్నత చదువులకు ఉపకారం..



జూనియర్ అడ్వకేట్‌గా మా పని చేస్తున్నా. మా అమ్మ టైలరింగ్ చేస్తుండగా నాన్న ప్రైవేట్ ఉద్యోగి. 2021 నుంచి లా నేస్తం తీసుకుంటున్నా. ఈ డబ్బులు జ్యూడీషియల్ ఎగ్జామ్స్ ఫీజు కోసం, మెటీరియల్ తీసుకోవడానికి ఉపయోగపడుతోంది. ఉన్నత చదువులకు మీరు ఇస్తున్న సపోర్ట్ ఎంతో బాగుంది. విద్యార్థులకు మంచి పథకాలు ప్రవేశపెట్టారు. విదేశాల్లో చదువుకునేందుకు కూడా సాయం చేస్తున్నారు. మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుని పేద విద్యార్థులకు ఉచితంగా సాయం చేయాలనుకుంటున్నా. రాష్ట్రంలో ఎన్నో కుటుంబాలు మీవల్ల ప్రయోజనం పొందుతున్నాయి. పెన్షన్, రేషన్ ఇంటి దగ్గరే ఇస్తున్నారు. మా అమ్మకు ఇంటి పట్టా వచ్చింది.

–సీహెచ్. వెన్నెల, జూనియర్ న్యాయవాది, గుంటూరు

ఈనాడు 'కొట్టు'కథ

▶ మొదటి పేజీ తరువాయి

నమ్మేస్తారని ఎలా అనుకుంటున్నారు? అసలు ఏనాటికైనా మారుతుందా 'ఈనాడు'?

'బీసీ'ల అభ్యున్నతి జనానికి చేరకుండా...

సోమవారం శాసనమండలి అభ్యర్థులను ప్రకటిస్తూ... ఉన్న 18 స్థానాల్లో 14... అంటే ఏకంగా 68 శాతాన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు కేటాయిస్తూ కొత్త చరిత్రను లిఖించారు సీఎం జగన్. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఎక్కడికక్కడ సీఎం చిత్ర పటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆనందంతో ర్యాలీలు చేశారు. ఇప్పటికే బీసీల్లో బలం పెంచుకున్న వైఎస్ జగన్‌కు... దీనివల్ల మరింత ఖ్యాతి వస్తుందని భావించిన టీడీపీ, దాని మిత్ర మీడియా... వ్యూహం ప్రకారం అదేరోజున 'గన్నవరం' కుట్రకు తెరతీశాయి. తామే రెచ్చగొట్టి కయ్యానికి కాలుదువ్వటమే కాక... విజయవాడ నుంచి గన్నవరానికి వెళ్లి మరీ పట్టాభి సహా టీడీపీ నేతలు అక్కడి ఎమ్మెల్యే వంశీ అనుచరులతో ఘర్షణకు దిగారు. అన్ని ఛానెళ్లలోనూ బీసీలకు పట్టం కట్టిన వ్యవహారం రాకుండా... టీడీపీ చక్రం తిప్పింది. మంగళవారం నాడు 'ఈనాడు'లో ... గన్నవరంలో ప్రభుత్వమే దారుణాలకు పాల్పడ్డట్టుగా... పోలీసులే దౌర్జన్యం చేసినట్టుగా దారుణమైన కథనాలు వండివార్చేశారు. ఆ ఘర్షణల సందర్భంగా అరెస్టయిన పట్టాభిని పోలీసులు దారుణంగా కొట్టారంటూ బుధవారం దాన్ని కొనసాగించారు. అందుకు రుజువులుగా ఎప్పుడో 2021 ఫిబ్రవరి 3నాటి ఫొటోలను... ఇప్పటివేనంటూ వేసేశారు. అదీ జరిగిన కథ!!. ఔరా రామోజీ??

2021, ఫిబ్రవరి 3 'ఈనాడు' ఏం రాసిందంటే...

'కర్రలు, రాడ్లతో పట్టాభిపై దాడి' అని 'ఈనాడు' బ్యానర్‌గా ప్రచురించిన వార్త ఇది. టీడీపీ నేత పట్టాభిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ 'ఈనాడు' హడావుడి చేసింది. విజయవాడలోని తన ఇంటి నుంచి కారులో వచ్చిన ఆయనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారని... కారు అద్దాలు పగలగొట్టారని... పట్టాభిని కారు నుంచి బయటకులాగి... ఎడమ మోచేయి, ఎడమ మోకాలు, తొడపై ఇష్టారాజ్యంగా కొట్టారని వార్త ప్రచురించింది. తన భర్తకు ప్రాణహాని ఉందని పట్టాభి భార్య చందన ఆవేదన వ్యక్తం చేసినట్టు మరో వార్త ఇచ్చింది. పోలీసులు స్పందించి ఆ దాడిని మెడికో లీగల్ కేసుగా నమోదు చేస్తాం... ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేస్తామంటే పట్టాభి వద్దన్నారని, దాంతో... పోలీసులు బలవంతంగా ఆయన్ని ఆసుపత్రికి తీసుకువెళ్లారని ఇంకో వార్త వేసింది. పట్టాభికి సంఘీభావంగా చంద్రబాబు హుటాహుటిన ఆయన నివాసానికి వచ్చి పరామర్శించటమే కాక... ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే చంపేస్తారా? అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసిన వార్త కూడా వేసింది. ఇక పట్టాభి శరీరంపై గాయాలు... పట్టాభిపై దాడికి ఉపయోగించిన కర్ర... ధ్వంసమైన పట్టాభి కారు అద్దాలు...పోలీసులు బలవంతంగా ఆసుపత్రికి తీసుకువెళుతుండటంతో విలపిస్తున్న పట్టాభి... పట్టాభిపై దాడి జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన తరువాత పోలీసులతో మాట్లాడుతున్న చంద్రబాబు... పట్టాభి శరీరంపై గాయాలను పరిశీలిస్తున్న బాబు... అంటూ ఫొటోలతో హడావుడి చేసి... రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడిందనే భావన కలిగించాలని కుట్ర పన్నింది.

కానీ... ఆ కుట్ర బెడిసికొట్టింది

బాబు ఎత్తుగడ బెడిసికొట్టింది. ఎందుకంటే ఆ దాడి గురించి ఫిర్యాదు చేయడానికి పట్టాభి ఇష్టపడలేదు. ఎవరిపైనయినా అనుమానం ఉందా? అంటే కూడా చెప్పలేదు. పోలీసుల దర్యాప్తునకు సహకరించలేదు. పోలీసులు దర్యాప్తు జరపటానికే ఆయన ఒప్పుకోలేదు. ఎందుకో తెలుసా? పట్టాభి వ్యక్తిగత రహస్యాలు, వివాదాలు, ఆర్థిక లావాదేవీలు, కొందర్ని ఆయన చేసిన మోసాలు అప్పట్లో కథలుకథలుగా వినిపించాయి. తన రహస్యాలను బయటపడకుండా బ్లాక్‌మెయిలింగ్ చేసేందుకు పట్టాభే ఆ దాడి డ్రామా ఆడించారని టీడీపీ వర్గాలు వ్యాఖ్యానించాయి కూడా. ఇవన్నీ బయటకు వస్తాయన్న ఉద్దేశంతోనే ఆయన దర్యాప్తునకు ఇష్టపడలేదు. దీంతో పట్టాభిని అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేయాలన్న బాబు ఎత్తుగడ బెడిసికొట్టింది.

అయినా... మనసు మారలేదు

అప్పట్లో చంద్రబాబు ఎత్తుగడ బెడిసికొట్టినా... 'ఈనాడు' మాత్రం మారలేదు. మళ్లీ బుధవారం నాడు పాత స్కీమునే పునరావృత్తం చేసింది. పట్టాభి అరికాళ్లు, తొడలపై దెబ్బలు అంటూ అలనాటి 5 ఫొటోలను మొదటి పేజీలో ప్రచురించింది. 'దేశమంతా ఐపీసీ చట్టం.. రాష్ట్రంలో వైసీపీ చట్టం' అంటూ మరో కథనంతో మొదటి, రెండు పేజీలను నింపేసింది. 'నా భర్త ప్రాణాలకు ముప్పు' అంటూ పట్టాభి భార్య చందన వాపోతున్నట్టుగా మరో వార్తను ఏకంగా అయిదు ఫొటోలతో ప్రచురించి 3వ పేజీని నింపేసింది. 'ఫిర్యాదు చేస్తే దాడులు చేస్తారా'అని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు మరో వార్త కూడా వేసింది. అంటే... రెండేళ్ల కిందటి ఘటనతో బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ ఆ స్కీమ్‌ను పునరావృత్తం చేశారు రామోజీరావు. మధ్యాహ్నానికల్లా సోషల్ మీడియాలోనే అందరూ నిజానిజాలు చెబుతూ 'ఈనాడు' వలువలు ఊడదీసేశారు.

సీఐ దళితుడు కాదంటూ టీడీపీ అసత్యవాదన...

పట్టాభి, మరికొందరు టీడీపీ నేతలు దళితవర్గానికి చెందిన గన్నవరం సీఐ కనకరావును కులం పేరుతో దూషిస్తూ ఆయనపై దాడికి పాల్పడ్డారు. ఆ దాడిలో ఆయన తలకు తీవ్రగాయం కావడంతో వైద్యులు 8 కుట్లు వేయాల్సి వచ్చింది. దాంతో కనకారావు ఫిర్యాదుపై పట్టాభితోపాటు టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టంతోపాటు మరికొన్ని సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా టీడీపీ తమ న్యాయవాది ద్వారా కోర్టులో అవాస్తవ వాదనలు వినిపించడం విస్మయం కలిగిస్తోంది. సీఐ దళితుడే కాదని టీడీపీ న్యాయవాది వాదించడం ద్వారా కోర్టుని తప్పుదోవ పట్టించేందుకు యత్నించారు. కానీ సీఐ మాల(ఎస్సీ) సామాజిక వర్గానికి చెందినవారని గన్నవరం తహశీల్దార్ ధ్రువీకరించారు.

పట్టాభిని పోలీసులు కొట్టనే లేదు.. వైద్య పరీక్షల్లో నిర్ధారణ

పట్టాభిని పోలీసులు కొట్టారన్న టీడీపీ ఆరోపణలు అవాస్తవమని స్పష్టమైంది. న్యాయస్థానం ఆదేశాలతో పట్టాభికి విజయవాడలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని వైద్యులు నిర్ధారించారు. వైద్యులు రెండు సార్లు పరీక్షించి మరీ ఆయన శరీరంపై ఎలాంటి గాయాలు లేవని న్యాయస్థానానికి నివేదిక సమర్పించారు. దాంతో తనను కొట్టారంటూ పట్టాభి ఆడిన డ్రామా... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై చంద్రబాబు చేసిన అవాస్తవ ఆరోపణలు... రాష్ట్రంలో ఐపీసీ కాదు వైసీపీ అమలు అవుతోందంటూ ఈనాడు చేసిన దుష్ప్రచారం అంతా పక్కా ముందస్తు కుట్రేనన్నది స్పష్టమైంది.

క్లుప్తంగా...

'ప్రగతి'పై సీఎస్‌లతో ప్రధాని వీడియో సమావేశం

పాల్గొన్న సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ప్రగతి కార్యక్రమం కింద అమలు చేస్తోన్న పలు ప్రాజెక్టులతో పాటు అమృత్ సరోవర్ కార్యక్రమం అమలు ప్రగతిని ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఢిల్లీ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. వివిధ జాతీయ రహదారుల అభివృద్ధి, నూతన రైల్వే లైన్ల నిర్మాణాలు, గ్యాస్ పైపులైన్లు, పలు థర్మల్ పవర్ ప్రాజెక్టుల పనుల ప్రగతిని ప్రధాని నరేంద్ర మోదీ సీఎస్‌లతో సమీక్షించారు. అమృత్ సరోవర్ పథకం అమలు తీరుపై ఆరా తీశారు. ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కె.ప్రవీణ్ కుమార్, బి.రాజశేఖర్, ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, శ్యామలరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కె.శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో దాడుల వ్యూహం ఎమ్మెల్యేదే

- సీఎం జగన్ తన సొంత రాజ్యాంగంతో అరాచకాలు చేస్తున్నారు
- ప్రజలకు చంద్రబాబు బహిరంగ లేఖ



సాక్షి, అమరావతి: గన్నవరం దాడులకు స్థానిక ఎమ్మెల్యే వ్యూహరచన చేశారని ప్రతిపక్ష నేత చంద్రబాబు ఆరోపించారు. ప్రజలకు బహిరంగ లేఖ పేరుతో ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మొత్తం ఘటనలో దాడులకు గురైంది తమ కార్యకర్తలేనని, ధ్వంసమైంది టీడీపీ కార్యాలయమని తెలిపారు. బాధితులు తెలుగుదేశం వాళ్లయితే పోలీసులు తప్పుడు ఆరోపణలతో తమ వారినే జైల్లో పెట్టారని పేర్కొన్నారు. ప్రజల తరపున గళం వినిపిస్తున్న బడుగు బలహీనవర్గాలను అణచివేయాలనే కుట్రలో భాగంగానే గన్నవరం హింసకు పాల్పడ్డారని ఆరోపించారు. కొందరు పోలీసు అధికారుల సహకారంతో వైఎస్సార్‌సీపీ నేతలు ప్రణాళికాబద్ధంగా తెలుగుదేశం నేతలపై దాడులు, పార్టీ కార్యాలయంలో విధ్వంసం సృష్టించారని విమర్శించారు. నియంతృత్వ ధోరణులకు నిలువెత్తు నిదర్శనం సీఎం వైఎస్ జగన్ అని విమర్శించారు. అంబేడ్కర్ ప్రసాదించిన రాజ్యాంగాన్ని పక్కనపెట్టి సీఎం తన సొంత రా జ్యాంగాన్ని అమలు చేస్తున్నాడని పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వమే స్వార్థప్రయోజనాల కోసం సమస్యలు సృష్టిస్తోందని ఆరోపించారు. ఇందులో కొందరు కళంకిత పోలీసు అధి కారులు భాగస్వాములు కావడం విచారకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రేరేపిత ఉగ్రవాద విధానాన్ని విస్తృతపరచడం ద్వారా వచ్చే ఎన్నికల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలని కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. రాష్ట్రాన్ని దుర్మార్గుల పీడనుంచి కాపాడాల్సిన బాధ్యత తనపై ఉందని పేర్కొన్నారు. ఇందుకోసం ఏ స్థాయి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

వాళ్లు ఒక్క పార్టీ ఆఫీసుపై దాడిచేస్తే మేం వంద పగలగొడతాం

- పాపానాయుడుపేటలో లోకేశ్
- పోస్టింగులు నిర్ణయించేది నేనే అంటూ డీఎస్పీకి బెదిరింపు



రేణిగుంట: 'మా జోలికొస్తే వదిలిపెట్టం. వాళ్లు ఒక్క పార్టీ ఆఫీసు మీద దాడి చేస్తే మేం వంద పగలదొబ్బుతాం. దాడిచేసిన వారిని కర్రాయర్లతో ఊరేగిస్తాం. మాపైనే అక్రమ కేసులు పెడుతారా? రేపు అధికారంలోకి వచ్చేది మేమే. పోస్టింగులు నిర్ణయించేది నేనే. గుర్తుపెట్టుకో..' అంటూ టీడీపీ నాయకుడు లోకేశ్ వ్యాఖ్యానించారు. ఆయన నిర్వహిస్తున్న పాదయాత్ర బుధవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చేరుకుంది. అక్కడ మూడురోడ్ల కూడలి వద్ద ఆయన స్టూల్ వేసుకుని బహిరంగసభను తలపించేలా మాట్లాడే ప్రయత్నం చేశారు. దీంతో రేణిగుంట డీఎస్పీ రామచంద్ర ఆయన్ని వారించారు. దీంతో లోకేశ్ గట్టిగా గద్దిస్తూ 'కేసులు పెట్టుకోబో.. ఏం తమాషానా.. రేపు అధికారంలోకి వచ్చేది మేమే.. పోస్టింగులు నిర్ణయించేది నేనే.. మా నాయకులపై దాడిచేసి తిరిగి వారిపైనే ఎస్సీ, ఎస్టీ కేసులు అక్రమంగా పెడుతున్నారు. దాడిచేసిన వారిని కర్రాయర్‌తో ఊరేగిస్తాం. డీఎస్పీలో రాయలసీమ అనేది ఉంటే నాకు మైక్ ఇవ్వు. పిరికోడిలా ప్యాలెస్‌లో కూర్చోకుండా వచ్చి సమాధానం చెప్పు. మాకు పౌరుషం లేదనుకుంటున్నావా? మీసం తిప్పి చెబుతున్నా.. చంద్రబాబును ఒక్క చిటికె వేయమనండి.. వైఎస్సార్‌సీపీ ఉంటుందో.. లేదో.. నేను చూస్తా. గన్నవరంలో మా పార్టీ ఆఫీసుపై దాడిచేస్తే కేసు పెట్టరు. నేను ఇక్కడ స్టూల్ ఎక్కి మాట్లాడితే కేసు పెడతారా? బ్లాక్ అండ్ వైట్ పేపర్లు హెలికాప్టర్‌లో నుంచి విసిరితే ఏమవుతుంది..' అన్నారు. అంతకుముందు రాజులకండ్రిగ సమీపంలో ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపు ఎస్ఎస్ కెనాల్ పూర్తిచేస్తామని చెప్పారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి రజిని తదితరులు



ఫిషింగ్ హార్బర్‌లో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మత్స్యకార మహిళలు

బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే

సీఎం లక్ష్యం

బీసీ, ఎస్సీ సంఘాల హర్షం

సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

అమలాపురం రూరల్/చిలకలూరిపేట/మహారాణిపేట (విశాఖ దక్షిణ): బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ పనిచేస్తున్నారని ఎస్సీ, బీసీ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. తాజాగా ప్రకటించిన 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేటాయించినందుకు సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపాయి. బుధవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మంత్రి విడదల రజిని క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రోళ్లపాలెంలో ఎస్సీ సంఘాలు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశాయి. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించాయి. అదేవిధంగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోలా గురువులును ప్రకటించినందుకు విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకార మహిళలు, బోటు యజమానులు, డ్రైవర్లు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. 'సీఎం సార్ థ్యాంక్స్' అంటూ నినదించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు మూగి రాజా,జోగి సుధాకర్, దుంపు ఈశ్వర్ రెడ్డి, పిల్లా సుభద్రమ్మ, కె.పోలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రోళ్లపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎస్సీ నాయకులు

బీసీలకు వెన్నుదన్నుగా సీఎం జగన్: మంత్రి గుమ్మనూరు



ఆలూరు రూరల్: బీసీలకు సముచిత స్థానం కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం ఆయన ఆలూరులో మీడియాతో మాట్లాడారు. శాసనమండలికి వైఎస్సార్‌సీపీ తరఫున 18 మంది ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రకటించగా.. అందులో 11 మంది బీసీలేనని చెప్పారు. 68 శాతానికి పైగా ఎమ్మెల్సీ పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కట్టబెట్టడం ద్వారా సీఎం జగన్ తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే బీసీలకు ఆత్మగౌరవం : ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



సాక్షి, విశాఖపట్నం: చట్టసభల్లో బీసీలకు సీఎం జగన్ పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి అన్నారు. టీడీపీ హయాంలో బీసీలకు అవమానాలు ఎదురవ్వగా.. జగన్ ప్రభుత్వంలో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. బుధవారం విశాఖలో ఆమె మీడియాతో మాట్లాడారు. మత్స్యకారులను చంద్రబాబు తాట తీస్తానంటే.. సీఎం జగన్ వారిని అక్కున చేర్చుకున్నారని కొనియాడారు. మత్స్యకారులంతా కాలర్ ఎగురేసుకొని తిరిగేలా రాజకీయ ప్రాధాన్యం కల్పించారని ప్రశంసించారు.

టీడీపీ నేత పట్టాభికి 14 రోజుల రిమాండ్

- మొత్తం 11 మంది రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలింపు
- పట్టాభి శరీరంపై ఎలాంటి గాయాలు లేవు
- విజయవాడ జీజీహెచ్ వైద్యుల ధ్రువీకరణ
- మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో సమర్పించిన పోలీసులు



పట్టాభిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

గన్నవరం: కృష్ణా జిల్లా గన్నవరం సీఐ పి.కనకారావుపై రాళ్లతో దాడి చేసి గాయపరచడంతోపాటు హత్యాయత్నానికి అనుచరులను ప్రేరేపించిన కేసులో టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌కు బుధవారం కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. పోలీసుల సమాచారం మేరకు.. ఈ కేసులో 11 మంది నిందితులను మంగళవారం గన్నవరంలోని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసులు హాజరుపరిచిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పది మందికి కోర్టు రిమాండ్ విధించింది. అయితే తనపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని జడ్జి ఎదుట పట్టాభి ఆరోపించారు. దీంతో ఆయనకు విజయవాడ జీజీహెచ్‌లో వైద్య పరీక్షలు చేయించి తిరిగి కోర్టులో హాజరుపరచాలని జడ్జి శిరీష పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు పట్టాభికి విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు బుధవారం కోర్టుకు తీసుకువచ్చారు. పట్టాభి చేతులకు సాధారణ గాయాలు మినహా శరీరంపై కొత్త గాయాలు ఏమీ లేవని జీజీహెచ్ వైద్యులు ఇచ్చిన మెడికల్ సర్టిఫికెట్‌ను కోర్టులో ఆయనకు చదివి వినిపించారు. మెడికల్ సర్టిఫికెట్‌పై పట్టాభి కూడా అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అయితే రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు కాకుండా మిగిలిన నిందితులు ఉన్న గన్నవరం సబ్ జైలుకు తనను రిమాండ్‌కు పంపించాలని పట్టాభి కోర్టును అభ్యర్థించారు. దీంతో ఆయనకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం పోలీసులు పట్టాభిని గన్నవరం సబ్ జైలుకు తరలించారు. అయితే సబ్ జైలులో పరిమితికి మించి ఖైదీలు ఉండటంతో వీరందరినీ వేరే జైలుకు పంపించాలని జైలర్ యూనస్ కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు న్యాయమూర్తి ఆదేశాలు ఇవ్వడంతో పట్టాభితోపాటు మరో పది మంది నిందితులను రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పోలీసులు తరలించారు.

పట్టాభిని కొట్టామనడం అవాస్తవం

- పోలీసులపై తప్పుడు ఆరోపణలు సరికాదు
- గొడవలు సృష్టించాలనే పట్టాభి దురుద్దేశం
- టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనలో 9 మంది అరెస్టు
- కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా



సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీ నేత పట్టాభిని తాము కొట్టామనడం అవాస్తవమని కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా తెలిపారు. తప్పుడు ఆరోపణలతో పోలీసులపై నిందలు వేయడం తగదన్నారు. ఈ మేరకు గన్నవరం విమానాశ్రయంలో బుధవారం ఎస్పీ మాట్లాడారు. పట్టాభి అవాస్తవాలు చెప్పి కోర్టును తప్పుదోవ పట్టించాలని చూశారని తెలిపారు. వైద్యుల బృందం రెండుసార్లు పరీక్షించినా పట్టాభి శరీరంపై ఎటువంటి గాయాలు లేవన్నారు. దీంతో పట్టాభి వ్యూహం విఫలమైందని చెప్పారు. టీడీపీ నేతల దాడిలో సీఐ కనకారావు గాయపడటంతో ఆయన కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. దీనికి ఏం సమాధానం చెబుతారని ఎస్పీ నిలదీశారు. సీఐ కనకారావు ఎస్సీ అని అందరికీ తెలుసన్నారు. అయితే ఆయన ఎస్సీ కాదు.. బీసీ అని కొందరు వివాదాన్ని లేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనకారావు కుటుంబానికి పోలీస్ శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఇకనైనా అవాస్తవాలను ప్రచారం చేయడం ఆపాలని టీడీపీ నేతలకు సూచించారు. లేనిపోని అభాండాలు వేసి పోలీసుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయవద్దని కోరారు. ఎటువంటి దురుద్దేశాలు లేకపోతే పట్టాభి మూడు వాహనాల నిండా జనాన్ని గన్నవరం ఎందుకు తెచ్చారని ఎస్పీ జాషువా ప్రశ్నించారు. వచ్చీ రాగానే పట్టాభి మరింత మందిని పోగేసి పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగారన్నారు. గొడవలు సృష్టించాలనే ఆయన దురుద్దేశం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఇంతవరకు టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి విషయంలో ఫిర్యాదు ఇవ్వలేదని తెలిపారు. అయినా కఠినమైన సెక్షన్లతో టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేసినవారిపై సుమోటోగా కేసు నమోదు చేశామని గుర్తు చేశారు. నిందితులను వీడియో ఫుటేజ్ ద్వారా గుర్తించి.. ఇప్పటికే తొమ్మిది మందిని అరెస్టు చేశామని తెలిపారు. మిగిలిన వారిని అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయన్నారు.

పోలీస్ అధికారుల సంఘం ఖండన

కాగా సీఐ కనకారావుపై టీడీపీ నేతల దాడిని కృష్ణా జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఖండించింది. తమపై జరిగే దాడులు ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవని పేర్కొంది. ఇటీవల కాలంలో కొన్ని రాజకీయ పార్టీలు వాటి అసహనాన్ని పోలీసులపై చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజల ధనమానప్రాణాలు కాపాడే తమపై పరుష పదజాలంతో భౌతిక దాడులకు పాల్పడటం తగదని తెలిపింది.

పట్టభద్రులు వైఎస్సార్‌సీపీ వైపే

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపు తథ్యం
- ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలపై ఒత్తిడి అవాస్తవం
- లబ్ధిపొందిన ప్రతి ఓటరును ఓటడిగే హక్కు మాకే ఉంది
- ఉద్యోగులు, యువత, విద్యార్థులకు సీఎం జగన్ మేలు చేస్తున్నారు
- టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రులు బొత్స, అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతిస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుస్తారని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర పట్టభద్రులంతా వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని చెప్పారు. సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, విదేశీ విద్యాదీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా అనేకమంది విద్యార్థులు లబ్ధిపొందారని.. వారంతా వైఎస్సార్‌సీపీ మద్దతిస్తున్న సుధాకర్‌ను గెలిపిస్తారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమం, అభివృద్ధి రెండూ ఎమ్మెల్సీ విజయాన్ని అందిస్తాయని చెప్పారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల కోసం ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలను బెదిరించామని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అవన్నీ అవాస్తవాలని ఖండించారు. అది కేవలం ఓటమి భయంతో చంద్రబాబు అండ్ కో టీం చేస్తున్న దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. ఒక వేళ తమ పార్టీ నుంచి ఎవరైనా బెదిరించినట్లు ఫిర్యాదు చేశారా? అని అడిగారు. అలాంటివి ఏమైనా ఉంటే ఎన్నికల కమిషన్ చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ మాటల్లో కాదు.. చేతల్లో సామాజిక న్యాయం చూపించారని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన వారినే ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఎంపిక చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, వేణుగోపాలకృష్ణ, ఎంపీ భీశెట్టి సత్యవతి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పెట్ల ఉమాశంకర్‌గణేష్, గొల్ల బాబూరావు, బొత్స అప్పలనర్సయ్య, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, పార్టీ సమన్వయకర్త ఆడారి ఆనంద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నూతన వీసీలు

సాక్షి, అమరావతి: ఇటీవల నూతనంగా నియమితులైన పలు యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్‌లు బాధ్యతలు స్వీకరించిన అనంతరం బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కడప డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ వీసీ బానోత్ ఆంజనేయ ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) గురజాడ, విజయనగరం వీసీ కే.వెంకటసుబ్బయ్య, ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఒంగోలు వీసీ మారెడ్డి అంజిరెడ్డిలు సీఎంను కలిశారు.

ద్వితీయశ్రేణి పట్టణాల్లో స్టార్టప్‌లపై ప్రత్యేక దృష్టి



ఎస్‌టీపీఐ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్

సాక్షి, అమరావతి: వేగంగా మారుతోన్న నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ కొత్త ఆవిష్కరణలను అభివృద్ధి చేయడంలో విజయవాడ కేంద్రంగా మారుతోందని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) ఏపీ-తెలంగాణ డైరెక్టర్ సీవీడీ రాంప్రసాద్ చెప్పారు. గడిచిన మూడేళ్లలో నెక్స్ట్ జనరేషన్ ఇంక్యుబేషన్ స్కీం (ఎన్‌జీఐఎస్) కింద విజయవాడ నుంచి 83 స్టార్టప్‌లు ఎంపిక కావడమే దీనికి నిదర్శనమన్నారు. బుధవారం విజయవాడలో ఎస్‌టీపీఐ-విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో 'అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు-రాబోయే అవకాశాలు' అనే అంశంపై స్టార్టప్ కాన్‌క్లేవ్‌ను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాంప్రసాద్ మాట్లాడుతూ..విజయవాడ వంటి ద్వితీయశ్రేణి పట్టణాల్లో స్టార్టప్ సంస్కృతిని వ్యాప్తి చేసేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన ఎన్‌జీఐఎస్ స్టార్టప్‌లు ఇచ్చే ప్రదర్శనతో ప్రయోజనం పొందవచ్చని తెలిపారు. ఎఫ్‌ట్రానిక్స్ ఎండీ దాసరి రామకృష్ణ మాట్లాడుతూ..నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకునే విధంగా స్టార్టప్‌లు సిద్ధంగా ఉండాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పరిశ్రమల్లో ఐవోటీ వినియోగం, డేటా ఎనలటిక్స్, డీప్ లెర్నింగ్ వంటి రంగాల్లో స్టార్టప్ ఫండింగ్ అవకాశాలు, ఎస్‌టీపీఐ అందిస్తోన్న అవకాశాలను వివరించారు.

బీసీలకు 11 ఎమ్మెల్సీ స్థానాలివ్వడం రికార్డే

- బీసీల అభివృద్ధికి కట్టుబడిన నేత సీఎం జగన్
- గత పాలకులు మూడో, నాలుగో స్థానాలు ఇచ్చేవారు
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు బాబు ఇచ్చింది 37.5 శాతమే
- ఇప్పుడు వైఎస్ జగన్ ఇచ్చింది 68.18 శాతం
- సాధికారతకు సీఎం జగన్ సిసలైన నిర్వచనం ఇచ్చారు
- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు కేటాయించటం దేశ చరిత్రలో ఓ రికార్డు అని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. ఆయన బుధవారం తాడేపల్లిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతూ... బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్న నేతగా సీఎం వైఎస్ జగన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. శాసన మండలి స్థానాల్లో మూడు లేదా నాలుగు స్థానాలు బీసీలకు ఇస్తారని భావించానని, కానీ జగన్ ఏకంగా 11 స్థానాలివ్వడంతో ఆశ్చర్యపోయానని చెప్పారు. గత ప్రభుత్వం అతి తక్కువ స్థానాలు బీసీలకు ఇచ్చి, వారిది బీసీల ప్రభుత్వమని, బీసీలను ఉద్ధరిస్తున్నామంటూ గొప్పలు చెప్పుకునేవారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పార్లమెంట్ సభ్యుల నుంచి మంత్రులు, ఎంపీటీసీల వరకు బీసీలకు ఇస్తున్న ప్రాధాన్యం దేశంలో మరే రాష్ట్రంలో కనిపించదని తెలిపారు. అందుకే బీసీలంతా వైఎస్ జగన్ సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా కొనసాగేలా చూసుకోవాలని పిలుపునిచ్చారు. '2014 -19 మధ్య టీడీపీ శాసన మండలికి 48 మందిని పంపితే.. అందులో ఓసీలు 30 మంది ఉండగా, బీసీలు 12 మంది మాత్రమే. ఓసీలకు ఏకంగా 62.5 శాతం పదవులివ్వగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చిన పదవులు కేవలం 37.5 శాతమే. టీడీపీ వంచనకు ఇదే నిదర్శనం. దీనికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 68.18 శాతం పదవులివ్వడం ఈ వర్గాల సాధికారత పట్ల ఆయన చిత్తశుద్ధిని నిరూపిస్తోంది. చంద్రబాబు, సీఎం జగన్ మధ్య ఆ తేడాను అందరూ గుర్తించాలి. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడానికి ముందే బీసీ అధ్యయన కమిటీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీల కోసం కమిటీలు వేశారు. వాటి సిఫార్సులకు అనుగుణంగా బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్‌బోన్ క్లాస్‌గా సీఎం జగన్ గుర్తించారు. కాబట్టే ఆ వర్గాలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారు. పదవులన్నిటిలోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చారు. కులాలను చీల్చే విధంగా కాకుండా స్ఫూర్తిదాయక విధానాలతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సాధికారత కల్పిస్తున్నారు. సీఎం జగన్ సాధికారతకు సిసలైన నిర్వచనం ఇచ్చారు' అని కృష్ణయ్య చెప్పారు.

ఎరువులు పుష్కలం

రబీ సీజనుకు ముందస్తుగా సిద్ధం..	రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయం

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలో రబీ సీజనులో కర్షకుల అవసరాలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులోకి ఉంచుతోంది అధికార యంత్రాంగం. సీజన్ ఆరంభం కాకముందే ముందస్తుగా సిద్ధం చేసింది. తద్వారా పంట సాగు సమయంలో రైతుల వ్యయప్రయాసలను దూరం చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఇప్పటికే సింహభాగం ఎరువులను రైతులకు అందజేసింది. ఏటా 90,270 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయి. వరి 56,433 హెక్టార్లలో సాగవుతుంది. సాగు ప్రారంభం నుంచి దిగుబడి వరకు 99,255 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ తదితర ఎరువులను వినియోగిస్తారు. గతంలో ప్రభుత్వం సబ్సిడీపై అంతంత మాత్రంగానే అందిస్తుండటంతో ప్రైవేటు ఎరువుల షాపులను ఆశ్రయించేవారు. కొన్ని దుకాణాల్లో కల్తీ ఎరువులు రైతులకు అంటగట్టడంతో తీవ్రంగా నష్టపోయేవారు. రైతు భరోసా కేంద్రాలు అందుబాటులోకి రావడంతో మూడేళ్లుగా ఇబ్బందులు తప్పాయి.

ఎరువుల కొరత లేదు: ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల కొరత ఉన్న ప్రచారంలో నిజం లేదు. వీటిని ఆర్‌బీకేల ద్వారా అందజేస్తాం. ఇప్పటికే సింహభాగం సరఫరా చేశాం. ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులతో పోలిస్తే భరోసా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులు అందుబాటులో ఉంచాం. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సమీపంలోనే ఎరువులు పొందే వెసులుబాటు కల్పించాం.

ఉపాధి 'బంక్'లు

గిరిజన గూడేల్లో పెట్రోల్ బంక్‌లు

- స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు
- ఏటా రూ.265 కోట్ల విక్రయాలు.. రూ.4 కోట్ల లాభాలు
- ఐదు డివిజన్లలో 16 పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు
- భవిష్యత్తులో మరో 4 బంక్‌ల ప్రారంభానికి ప్రణాళికలు



అరకులోయ పెట్రోల్ బంక్

సాక్షి, విశాఖపట్నం: ఒకప్పుడు గిరిజనులకు కేవలం రేషన్ సరకులు పంపిణీ చేస్తూ.. వారి నుంచి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసే సంస్థగా సేవలు ప్రారంభించిన గిరిజన సహకార సంస్థ (జీసీసీ).. ఇప్పుడు వారి జీవితాలకు భరోసా కల్పించే సంస్థగా ఎదిగింది. చమురు సంస్థల భాగస్వామ్యంతో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేసి అటు జీసీసీకి ఆదాయంతో పాటు గిరిజన యువతకు ఉపాధి కల్పిస్తోంది. 5 డివిజన్లలో 16 బంకుల్లో ఏడాదికి రూ.265 కోట్లకు పైగా చమురు విక్రయాలు జరుగుతున్నాయి. లాభాల బాటలో పయనిస్తున్న నేపథ్యంలో మరో 4 కొత్త బంకులు ఏర్పాటు చేసే దిశగా జీసీసీ అడుగులు వేస్తోంది. మారుమూల పల్లెల్లో నిత్యావసర సరకుల సరఫరాకే పరిమితమయ్యే జీసీసీ కాలానుగుణంగా మార్కెట్లో సరికొత్త పంథాతో ముందుకెళ్తోంది. వ్యాపారంలో నిలదొక్కుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వ సహకారంతో గిరిజన ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలలో పెట్రోల్, డీజిల్ ఇంధన సదుపాయాలు లేకపోవడంతో స్థానికంగా ఉండే ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు అనేక ఇబ్బందులను ఎదుర్కొనేవారు. ఈ క్రమంలోనే జీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించి, అమలు చేసింది. తొలినాళ్లలో హుకుంపేట, కాకరపాడు ప్రాంతాల్లో బంకులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ సంఖ్య 16కు చేరుకుంది.

ఏటా రూ.4 కోట్లకు పైగా ఆదాయం...

జీసీసీ పరిధిలోని 5 డివిజన్లలో పెట్రోల్‌బంకుల్ని ఏర్పాటు చేశారు. హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ సహకారంతో జీసీసీ స్థలాల్లో కొన్ని ప్రాంతాల్లోనూ, ఐటీడీఏ స్థలాల్లో మరికొన్ని ప్రాంతాల్లోనూ ఈ బంకుల్ని నడిపిస్తున్నాయి. 4 పెట్రోల్ బంకులు ఐటీడీఏ స్థలాల్లో ఉండగా.. మిగిలిన 12 బంకులను జీసీసీ స్థలాల్లో నడుస్తున్నాయి. పార్వతీపురం డివిజన్‌లో ఒకటి, పాడేరు డివిజన్‌లో 5, చింతపల్లి పరిధిలో 6, రంపచోడవరం పరిధిలో 3, చింతూరు డివిజన్‌లో ఒక పెట్రోల్ బంకు నడుస్తోంది. జీసీసీతో కలిసి వ్యాపారం చేసేందుకు హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్ కంపెనీలు ముందుకు రావడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. వాహనదారులు, రైతులు, ఉద్యోగులకు నాణ్యమైన ఆయిల్‌ను సరఫరా చేస్తున్నారు. జీసీసీ బంకులపై వినియోగదారులకు విశ్వాసం కలగడంతో విక్రయాలు జోరందుకుంటున్నాయి. ఏటా ఏకంగా 16 బంకుల్లో సరాసరి రూ.265.99 కోట్ల చమురు అమ్మకాలు జరుగుతుండటం గమనార్హం. ఈ బంకుల ద్వారా 175 మందికి ఉపాధి కల్పించగా, ఇందులో 163 మంది గిరిజన యువత ఉన్నారు.

స్థానికంగానే ఉపాధి లభించింది

దూరం వెళ్లే పని లేకుండా పెట్రోల్‌బంక్ ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి దొరికింది. దీని వల్ల మా కుటుంబానికి సాయంగా మారాను. జీసీసీ తీసుకున్న చొరవతో నాలాగే చాలా మంది యువతీ యువకులకు పెట్రోల్‌బంక్‌లలో ఉపాధి అవకాశాలు కల్పించడం శుభపరిణామం. రోజూ బంకుల్లో విపరీతంగా సేల్స్ జరుగుతున్నాయి.

– జ్యోతి, సీలేరు పెట్రోల్‌బంక్



మీకు ఒక స్నేహితుడు ఉంటే, అతడి కోసం యుద్ధం చేసేందుకు సిద్ధంగా ఉండాలి. యుద్ధం చేయాలంటే, మరొకరికి శత్రువుగా ఉండగలిగే సమర్థత ఉండాలి.

– జరాతుష్ట్ర

సాక్షి

గురువారం, ఫిబ్రవరి, 23

కులజాడ్యానికి కళ్లెం!

భారత్‌లో శతాబ్దాలుగా వేళ్లానుకున్న 'కులం' ఖండాంతరాలు దాటిందని, అది తమ దేశంలో ప్రవేశించి ఏపుగా ఎదుగుతున్నదని అమెరికా నగరాల్లో ఒకటైన సియాటల్ నగర కౌన్సిల్ గుర్తించింది. కుల వివక్షను శిక్షార్హమైన నేరంగా పరిగణిస్తూ మంగళవారం ఆర్డినెన్సు జారీచేసింది. దీని ప్రకారం ఉపాధి, హౌసింగ్, రీటెయిల్, ప్రజా రవాణా తదితర రంగాల్లో కుల వివక్ష ప్రదర్శించినట్టు తేలితే శిక్షలుంటాయి. అంతక్రితం మాటేమోగానీ సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలు రావటం మొదలయ్యాక మన దేశంనుంచి దళితులు పెద్ద సంఖ్యలో అమెరికాకు వెళ్లటం మొదలైంది. ఆ తర్వాతే కుల వివక్ష గురించిన ఆరోపణలు వెల్లువెత్తాయి. అదంతా నిజం కాదని, హిందూమతాన్ని కించపరచటం కోసం ఈ ప్రచారం చేస్తున్నారని ఆక్రోశించేవారూ లేకపోలేదు. ఈ సందర్భంలో అసాధారణ ప్రతిభావంతుడైన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు సంబంధించిన ఒక ఉదంతాన్ని గుర్తు తెచ్చుకోవాలి. జర్మనీలో హిట్లర్ అధికారం పీఠం ఎక్కడానికి నెలముందు...అంటే 1932 డిసెంబర్‌లో ఆయన అమెరికా వచ్చేశాడు. అయితే తాను ఒక యూదుగా ఇన్నేళ్లూ జర్మనీలో చవిచూసిన వివక్షే అక్కడి ఆఫ్రికన్ అమెరికన్లు కూడా ఎదుర్కొనటం చూసి నిర్ఘాంతపోయాడు. వివక్ష ఎదుర్కొనటంలో ఆయనకున్న అనుభవమే అమెరికాలో దాన్ని గుర్తించేలా చేసింది. బహుశా మన దేశంనుంచి వెళ్లిన దళితులు, ఇతర అట్టడుగు కులాలవారూ అలాంటి కారణం చేతనే కుల వివక్ష గురించి ఆరోపణలు చేసే పరిస్థితి ఏర్పడివుండొచ్చు. కాలిఫోర్నియాలోని ఈక్విటీ లాబ్స్ సంస్థ 2018లో ఒక నివేదిక వెలువరించింది. దాని ప్రకారం 67 శాతంమంది దళితులు పని ప్రదేశాల్లో తమను అనుచితంగా చూస్తున్నారని ఆరోపించారు. కులం కారణంగా దాడులు, దుర్భాషలు ఎదుర్కొన్నామని 25 శాతం మంది చెప్పారు. తమ కులాన్ని ఎత్తిచూపుతారని నిరంతరం భయపడుతుంటామని 50 శాతం మంది దళితులు తెలియజేశారు. 1,500మందిని సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. సిస్కో సిస్టమ్స్ సంస్థలో కుల వివక్ష కారణంగా తనకు న్యాయబద్ధంగా రావలసిన పదోన్నతులనూ, వేతన పెంపునూ అడ్డుకున్నారని రెండేళ్లక్రితం ఒక యువతి కోర్టుకెక్కటం అందరికీ తెలుసు. ఆధిపత్య కులానికి చెందిన ఇద్దరు మేనేజర్లు తనను అనేకరకాలుగా వేధించారని ఆమె ఆరోపించారు. ఆ తర్వాత కొన్ని విశ్వవిద్యాలయాలు, యాపిల్ సంస్థ, డెమాక్రటిక్ పార్టీ వంటివి తమ వివక్ష వ్యతిరేక విధానంలో కుల వివక్షను కూడా చేర్చాయి. ఈ పరిణామాలన్నీ అమెరికాలో కులవివక్ష పెరగటాన్నీ, దాన్ని అరికట్టే ప్రయత్నాలనూ పట్టిచూపుతున్నాయి. ఒక్క అమెరికా అనేమిటి...మన దేశ పౌరులు, మరి కొన్ని దక్షిణాసియా దేశాల పౌరులు వెళ్లిన ప్రతి దేశంలోనూ కులవివక్ష ఆరోపణలు తరచు వినబడుతూనే ఉన్నాయి.

ఏ దేశానికైనా పోవాలంటే ఎన్నో అవరోధాలుంటాయి. ముఖ్యంగా అమెరికా వెళ్లేందుకు వీసా రావాలంటే సవాలక్ష ప్రశ్నలకు జవాబివ్వాలి. ఇక ఆ గడ్డపై అడుగుపెట్టాక ఎదుర్కొనాల్సిన తనిఖీల గురించి చెప్పనవసరం లేదు. అయితే ఈ క్రమంలో ఎక్కడా కనబడనిదీ, ఎవరికీ దొరకనిదీ కుల తత్వం. మన దేశంలో ఈ కులతత్వం కనబడని చోటంటూ ఉండదు. ఇదొక నిచ్చెనమెట్ల వ్యవస్థ. ప్రతి కులమూ వివక్షను ఎదుర్కొంటూనే తాను అణచడానికి కింద మరో కులం ఉందని తృప్తిపడుతుంటుంది. కింది కులాల శ్రమను దోచుకోవటానికి పనికొస్తుంది గనుక రాచరిక, భూస్వామ్య వ్యవస్థలు ఆ కుల వ్యవస్థను చెక్కుచెదరకుండా కాపాడాయి. ఆ తర్వాత వచ్చిన బ్రిటిష్ పాలకులు 'విభజించు పాలించు' అనే తమ సిద్ధాంతానికి అక్కరకొస్తుందని గ్రహించి దీని జోలికి పోలేదు. నిజానికి వలసపోయిన భారతీయుల్లోని కుల వివక్షను గుర్తించి దాన్ని కూకటివేళ్లతో పెకిలించటానికి రెండు దశాబ్దాలనాడే దళిత సంఘాల నాయకులు, మేధావులు గట్టి ప్రయత్నం చేశారు. జాత్యహంకారానికి వ్యతిరేకంగా 2001లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ సదస్సులో కుల వివక్షను కూడా జాతివివక్షతో సమానంగా పరిగణించాలని వారు డిమాండ్ చేశారు. కానీ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వం దాన్ని అడ్డుకో గలిగింది.

అమెరికాలోని భారతీయులనూ, భారతీయ అమెరికన్లనూ 'ఆదర్శనీయ మైనారిటీ'గా అభివర్ణిస్తుంటారు. ఎందుకంటే ఇతర దేశాలనుంచి అక్కడికి వలసవచ్చినవారితో పోలిస్తే ఈ 'ఆదర్శనీయ మైనారిటీ'లో ఉన్నత చదువులు చదువుకునేవారూ, ఉన్నత స్థానాల్లో స్థిరపడినవారూ, రెండు చేతలా సంపాదించేవారూ, క్రమం తప్పకుండా ఆరోగ్య బీమా తీసుకునే స్తోమత గలవారూ అధికం. అనేక బహుళజాతి సంస్థల సారథులు భారతీయులే. 'స్టెమ్'(సైన్సు, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మేథమేటిక్స్) విభాగాల్లో ఇతర గ్రూపులతో పోలిస్తే వీరి హవా ఎక్కువ. ఈమధ్యకాలంలో రాజకీయాల్లో సైతం సత్తా చాటే స్థితికి చేరుకున్నారు. అయితే అంతా బాగానే ఉందిగానీ... ఎవరూ వేలెత్తి చూపక ముందే అమెరికాలోని హిందూ మత సంస్థలు మేల్కొని కులవివక్షను రూపుమాపేందుకు తగిన కార్యాచరణకు పూనుకొనివుంటే ఈ ప్రతిష్ఠ మరింత ఇనుమడించేది. అందుకు బదులు బుకాయింపులే వారి ఆయుధాలయ్యాయి. ఎంతకాలం ఈ నాటకం రక్తికడుతుంది? ఇవాళ సియాటల్ ఆలోచించినట్టే రేపన్నరోజున మరిన్ని నగరాలు, రాష్ట్రాలు కూడా చర్యలు తీసుకోవచ్చు. వేరే దేశాలకూ విస్తరించవచ్చు. వివక్ష ఉన్నచోటల్లా ఎవరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా దానికి ప్రతిఘటన సాగుతూనే ఉంటుంది. పరిణతితో ఆలోచిస్తేనే ఏ సమస్యకైనా పరిష్కారం దొరుకుతుంది.

హిందూమతం పురోగమించాలంటే...



మల్లెపల్లి లక్ష్మయ్య

మహాశివరాత్రి పూజల కోసం దేవాలయానికి వెళ్ళిన ఒక దళిత మహిళను మధ్యప్రదేశ్‌లో ఆధిపత్య కులాల జనం అడ్డుకున్నారు. ఇలాంటి వార్తల్లోకొచ్చే ఘటనలతో పాటు, రానివి ఎన్నో దేశంలో చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కులానికి కాలం చెల్లిందని మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. హిందూ ధార్మిక పీఠాధిపతులు వీటిని సహించలేక పోయారు. హిందూ ధార్మిక వ్యవస్థలో బ్రాహ్మణ పూజారి వర్గం ఆధిపత్యం ఎట్లా కొనసాగుతోందో దీనితో మనకు అర్థం కాగలదు. ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలకు కులనిర్మూలన మీద చిత్తశుద్ధి ఉంటే, ఈ బెదిరింపులకు భయపడకూడదు. అంబేడ్కర్ చెప్పినట్టు కుల నిర్మూలనకు పూనుకోకుండా, హిందూమతం పురోగమించడం అసాధ్యం.

మధ్యప్రదేశ్ లోని కర్‌గోవ్ గ్రామంలో మహాశివరాత్రి రోజు పూజలు చేయడానికి దేవాలయానికి వెళ్ళిన బలాయి కులానికి చెందిన దళిత మహిళను గ్రామంలోని ఆధిపత్య కులాల జనం అడ్డుకున్నారు. దళితులు దానిని ప్రతిఘటించడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దాదాపు పన్నెండు మంది గాయపడ్డారు. ఇరువర్గాలు తలపడటంతో పోలీసులు జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరో గ్రామమైన ఛోటా కర్సవాడలో కూడా ఇలాంటి సంఘటనే జరిగింది. పోలీసులు రెండు వర్గాల మీద కేసులు నమోదు చేశారు. ఇది కొన్ని జాతీయ దినపత్రికల్లో అచ్చయినందు వల్ల మనకు తెలిసింది. అసలు వార్తల్లోకి రాని ఎన్ని గ్రామాల్లో ఇటువంటి సంఘటనలు జరిగాయో తెలియదు. ఇక్కడ ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి. చాలా గ్రామాల్లో దళితులు గ్రామంలోని దేవాలయంలోకి వెళ్ళడానికి ఇష్టపడరు. ఒకవేళ పోవడానికి ప్రయత్నిస్తే ఇటువంటి సంఘటనలు జరుగుతాయని భయపడి ఊరుకుంటారు. ఇటీవల జరిగిన ఎన్నో సంఘటనలు దీన్ని రుజువు చేస్తాయి.

ఈ నేపథ్యంలో ఇటీవల హిందూ ప్రముఖుల మధ్య జరిగిన వివాదం గురించి చెప్పాల్సి ఉంది. ఈ నెల 6వ తేదీన ముంబయిలో సంత్ రవిదాసు జయంతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు వివాదాన్ని రేపాయి. ''కులవ్యవస్థకు కాలం చెల్లింది. కుల వ్యవస్థను భగవంతుడు సృష్టించాడనడం అబద్ధం. కొంతమంది పండితులు తప్పుదోవ పట్టించారు. దీనిని మనం పక్కన పెట్టాలి'' అంటూ ఆ సభలో వ్యాఖ్యానించారు. సంత్ రవి దాస్ ఈ దేశంలోని కులవ్యవస్థను నిరసించిన తాత్వికులలో ఒకరు. రవిదాస్ బోధనలు ఎంతో మందిని ప్రభావితం చేశాయి. దానినే మోహన్ భాగవత్ పునరుద్ఘాటించారు. అది నిజానికి కొంతలో కొంత సత్యం. కానీ హిందూ ధార్మిక పీఠాధిపతులు దానిని సహించలేక పోయారు. వెంటనే భాగవత్ మీద విరుచుకుపడ్డారు. పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ఈ వ్యాఖ్యలను ఖండించడమే కాకుండా, కుల వ్యవస్థను సంపూర్ణంగా సమర్థించారు. అంతే కాకుండా, పండితులైన బ్రాహ్మణులను, వారి చర్యలను కొనియాడారు.

''బ్రాహ్మణులు ప్రపంచంలోనే అత్యంత మేధోశక్తి కలిగినవాళ్ళు. కుల వ్యవస్థ ఈ దేశానికి మేలు చేసింది. విద్య, వైద్యం, రక్షణ రంగాల్లో ప్రపంచానికి మార్గదర్శనం చేసింది'' అంటూ ఆర్ఎస్ఎస్‌ను తీవ్రంగా విమర్శించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు కూడా సంపూర్ణంగా భాగవత్‌ను సమర్థించలేకపోయారు. పండితులంటే బ్రాహ్మణులు కాదనీ, అది కులాన్ని దృష్టిలో పెట్టుకొని అనలేదనీ వివరణ ఇచ్చారు. పూరీ శంకరాచార్యకు సంజాయిషీ ఇచ్చుకునే వరకు వెళ్ళారు.

కులవ్యవస్థను నిర్మూలించాలనే లక్ష్యంలో పనిచేయాలనుకుంటున్నామని ఒక వైపు ప్రకటిస్తున్న ఆర్ఎస్ఎస్, రెండోవైపు పీఠాధిపతుల విమర్శలకు భయపడిపోయింది. దాదాపు పది సంవత్సరాల క్రితం 2014 మార్చ్ 7న భాగవత్‌ను నాగపూర్ ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయంలో కలిశాం. నాతో పాటు సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి కూడా ఉన్నారు. సబ్ ప్లాన్ అమలు విషయంలో చట్టం చేయాలని అన్ని పార్టీలను, సంస్థలను కలిసే ప్రక్రియలో భాగంగా ఆయన్ని కూడా కలిశాం. అప్పుడు కులం, అంటరానితనం, హిందూ మతంలో సమస్యలపై దాదాపు మూడు గంటలపాటు చర్చ జరిగింది. ''అందరూ హిందువులని మీరు భావిస్తే అంటరానితనం, కులవివక్ష కొనసాగకుండా ఎందుకు మీరు కార్యక్రమాలు తీవ్రతరం చేయరు?'' అని అడిగినప్పుడు, ''ఇది నెమ్మదిగా జరగాలి. చాలామంది హిందూ ధార్మికకర్తలు ఇప్పటికీ కులవ్యవస్థను సమర్థిస్తున్నారు'' అంటూ సమాధానం ఇచ్చారు. హిందూ ధార్మిక వ్యవస్థలో బ్రాహ్మణ పూజారి వర్గం ఆధిపత్యం ఎట్లా కొనసాగుతోందో దీనితో మనకు అర్థం కాగలదు.

ఈ వ్యాసం మొదట్లో పేర్కొన్న మధ్యప్రదేశ్ సంఘటనలకు కారణం, హిందూ పూజారి వర్గం ఆధిపత్య స్వభావం. కులవ్యవస్థ నశిస్తే పూజారి వ్యవస్థ, దానితో పాటు బ్రాహ్మణిజపు ఆధిపత్యం కుప్పకూలిపోతుందని వారి భయం. ఇక్కడనే మనం అసలు సమస్యకు వద్దాం. కులవ్యవస్థను సమర్థిస్తున్నవాళ్ళ గురించి చర్చ అనవసరం. కులం పోవాలనీ, కులవ్యవస్థకు కాలం చెల్లిందనీ మాట్లాడుతున్నవాళ్ళకు కూడా, ముఖ్యంగా ఆర్ఎస్ఎస్ లాంటి సంస్థలకు కులనిర్మూలన మీద చిత్తశుద్ధిలేదు. హిందువులంతా ఒక్కటేననీ, కులం లేదనీ భావిస్తే, శంకరాచార్య బెదిరింపులకు భయపడే వాళ్ళుకాదు.

కొత్త కోణం



అందుకే కులవ్యవస్థకు పునాది ఏమిటి? ఎవరు దీనిని పెంచి పోషించారు? అనే ప్రశ్నలు వేసుకోవాలి. దానికి తగ్గట్టుగా కార్యాచరణకు పూనుకోవాలి. దీనికి ఇప్పుడు పెద్దగా శ్రమపడాల్సిన అవసరం లేదు. బాబాసాహెబ్ అంబేడ్కర్ అందుకు తన జీవితాన్ని ధారపోశారు. కులం పుట్టుక నుంచి కుల నిర్మూలన వరకు శాస్త్రీయ పరిశోధన చేసి మన ముందు సమగ్రమైన పరిష్కారాలను ఉంచారు. కులవ్యవస్థకు, కులాల పుట్టుకకు బ్రాహ్మణ పూజారి వర్గమే మొదటగా బీజాలు వేసిందనీ, దానిని పెంచి పోషించిందనీ ఎన్నో దృష్టాంతాలతో రుజువు చేశారు. 1916 మే 9న కొలంబియా విశ్వవిద్యాలయంలో జరిగిన సెమినార్‌లో ''భారత దేశంలో కులాల పుట్టుక, పనితీరు, అభివృద్ధి'' అనే అంశంపై సశాస్త్రీయంగా ప్రసంగించారు. అప్పటివరకు కులం విషయంలో పరిశోధన చేసిన సెనార్ట్ నెస్‌ఫీల్డ్, సర్ హెచ్.హెచ్. రిసిలీ, డాక్టర్ కేద్కర్‌ల అభిప్రాయాలను పూర్వపక్షం చేశారు. ''కులం ఏకైక లక్షణం అంతర్ వివాహం. కులం మూలకారణం అదే అని నా ఉద్దేశం'' అంటూ కులం పుట్టుకకు అంతర్ వివాహమే ప్రధాన కారణం అని చెప్పారు. కులం అనేది మొదటగా బ్రాహ్మణవర్గం తన గుంపును ఒక్క దగ్గర చేర్చి కంచె వేసుకున్నదనీ, దాని తర్వాత మిగతా వర్గాలు కంచెలు వేసుకున్నాయనీ అన్నారు. అందుకు గాను అనేక శాస్త్రాలను రూపొందించారనీ, అందులో బ్రాహ్మణవర్గం ఆధిపత్యాన్ని నిలబెట్టడానికి ఎన్నో కథలను సృష్టించారనీ అభిప్రాయపడ్డారు.

కులం పుట్టుక మీద ఆధారపడ్డ కులనిర్మూలన గ్రంథాన్ని రాసి, దేశానికి ఒక బృహత్తరమైన కార్యాచరణను రూపొందించారు అంబేడ్కర్. ఒక వేళ హిందూమతం తనను తాను సంస్కరించుకోవాలనుకుంటే రెండు మూడు ప్రతిపాదనలు చేశారు. హిందువులందరు ఒక్కటేనని చెప్పినప్పుడు, పూజారి వ్యవస్థను బ్రాహ్మణుల నుంచి విముక్తం చేసి, ఏ కులంవారైనా అర్హతను బట్టి పూజారులుగా నియమితులు కావాలన్నారు. కులవ్యవస్థను సమర్థిస్తున్న హిందూ గ్రంథాలలోని అంశాలను తొలగించాలని కూడా ప్రతిపాదించారు. నిజానికి ఈ రోజు హిందూ మతంగా చెప్పుకొంటున్న ఒక వ్యవస్థ, వేదాల కాలంలో ఉన్నట్టుగా లేదు. వేదాల కాలంలో యజ్ఞయాగాలలో ఉన్న ఆహారం, పద్ధతులన్నీ, బౌద్ధం తిరుగుబాటులో మార్చుకొని శాకాహారులుగా మారారు. ఇది వాస్తవం. అదే రీతిలో ఎన్నో జాతులను, కులాలను తమలో కలుపుకొన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీల ఇండ్లలోనికే వెళ్ళి పూజలు, పెళ్ళిళ్ళు చేయని పూజారులు ఇప్పుడు వెళుతున్నారు. ఇది ఒక మార్పే. అయితే ఇది సరిపోదు. బాబాసాహెబ్ చెప్పినట్టు కుల నిర్మూలనకు పూనుకోకుండా, హిందూమతం పురోగమించడం అసాధ్యం.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు । మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మూడు దశాబ్దాల ప్రేమ



ఇదే రోజున (ఫిబ్రవరి 22) నువ్వు 1995లో నీ ప్రేమను ఒప్పుకొని, నాకు ప్రపోజ్ చేశావు. కన్నార్పకుండా నేను అవునన్నాను. ఇప్పుడు 28 ఏళ్ల తర్వాత కూడా నీ కళ్లల్లోకి చూసినప్పుడు నేను నవ్వుతూ ఉంటానని గ్రహించాను. నీకు అవునని చెప్పడం నా జీవితంలో అత్యుత్తమ నిర్ణయం. లవ్యూ(సుందర్)!

– ఖుష్బూ సుందర్, నటి

అందరి కోసం



క్రైస్తవులందరికీ ప్రార్థనాయుత, శాంతిమయ లెంట్‌ను కోరుకుంటాను. ఈ భస్మ బుధవారంతో ఈ కాలాన్ని ప్రారంభిస్తున్నప్పుడు, ఇది మన అనిత్యతనూ, పశ్చాత్తాపాన్నీ, దేవుడి ప్రేమపూరిత కరుణనూ గుర్తు చేయాలి. అందరికీ శాంతి, న్యాయాలు ఉండే ప్రపంచం కోసం ప్రార్థించడం కొనసాగిద్దాం.

– సమియా సులుహు, టాంజానియా అధ్యక్షురాలు

ఒప్పుకుందాం!



ఇండియాలో కేవలం 5 పెద్ద ప్రైవేటు వ్యాపార సంస్థలు 400 బిలియన్ డాలర్లకు పైగా ఆస్తులను కలిగి వున్నాయి. ప్రభుత్వం దగ్గర సుమారు 600 బిలియన్ డాలర్లున్నాయి. పాకిస్తాన్‌లో మొత్తం ప్రకటిత వ్యాపారాల విలువ 50 బిలియన్లను దాటదు. ప్రభుత్వం దగ్గర 3 బిలియన్‌లున్నాయి. కానీ మన అహంకారం చూడండి!

– సయ్యద్ షబ్బర్ జైదీ, పాక్ ఆర్థికవేత్త

డిజిటల్లో టాప్



నేననుకోవడం, ఇండియా డిజిటల్ పేమెంట్ మౌలిక వ్యవస్థ ఎంత బలంగా ఉందో ప్రపంచం ఇంకా గుర్తించలేదు. ఇండియా డిజిటల్ పేమెంట్స్‌లో (ఫుట్‌బాల్ దిగ్గజం) లియోనల్ మెస్సీ లాంటిది. చాలా ముందుంది!

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ ఎండీ

ప్రతిదీ భిన్నమే



వేలకొలదీ చెట్లున్న అడవిలో, ఏ రెండు ఆకులూ ఒకలా ఉండవు. అలాగే అదే దారిలో చేసే రెండు ప్రయాణాలూ ఒకలా ఉండవు.

– పాలో కొయిలో, రచయిత

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

రామానుజుడే తిరుపతి నిర్మాత!

సందర్భం



ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి

తిరుమల ఆలయంలో క్రీ.శ. పన్నెండవ శతాబ్ది నాటికి అస్తవ్యస్తంగా ఉన్న పరిస్థితులను చక్కదిద్దడానికి తిరుమలను సందర్శించి, అక్కడ వాడుకలో ఉండిన వైఖానస ఆగమ సంప్రదాయ రీతికి తగినట్లు ఆధ్యాత్మిక రాజ్యాంగంగా పిలువదగిన ఒక నియమ, నిబంధనల పట్టికను రామానుజాచార్యులు రూపొందించారు.

'వేంగడం' కొండల్లోని వేంకటేశ్వరుడు అందరి దైవమనీ; కుల, తెగ, జాతి, భాష, మత భేద భావాలు లేని రీతిలో మానవులందరూ ఆయనను దర్శించుకోవడం, ఆరాధించుకోవడం; నైవేద్యం, ప్రసాదాలు, తీర్థం, కడకు శఠగోపం పొందే రీతిలో ఆలయ కార్యక్రమాలు నడవాలని రామానుజులు నిర్ధారించి 'సమతా' భావజాలానికీ, దాని విశ్వవ్యాప్తికీ బీజం వేయడం తిరుమల ఆలయంలోనే జరిగింది. 'తిరుమల' కొండలని పిలుస్తున్న కొండలు వేంకటేశ్వరునివేననీ, అక్కడ ఆయన మాత్రమే దైవంగా స్థానం కలిగి ఉండాలనీ, ఇతర దేవతా ఆలయాలు నిర్మించరాదనీ, ఆలయ కార్యక్రమాలు నిర్వహించేవారు తిరుమలలో నివాస గృహాలు నిర్మించుకోకూడదనీ, తిరుపతిలో ఏర్పరచబోవు అగ్రహారంలో నివసిస్తూ రోజూ తిరుమల వెళ్ళి ఆలయ కార్యక్రమాలు నిర్వహించాలనీ రామానుజాచార్యులు నిర్ణయించారు.

ఈ నిర్ణయానికి కొనసాగింపుగా నేటి తిరుపతిలోని కపిల తీర్థం రోడ్డుకు ఆనుకొని ఉండిన కొత్తూరు అనే, 'బోయ కొట్టం'గా పిలువదగిన కోటవూరుకు అర కిలోమీటరు దూరంలో దక్షిణ దిశలో బహుశా, ఒక సెలయేటి ఒడ్డున రామానుజుల కాలానికి ఉండిన చిన్నస్థాయి పార్థసారథి గుడికి నాలుగు వైపులా ఒక బ్రాహ్మణ అగ్రహారాన్ని ఏర్పరచాలనీ, తిరుచుకనూరు అనబడే నేటి తిరుచానూరు నుండి తిరుమల ఆలయంలో సేవలు చేయడానికి నిత్యం సుదూర ప్రయాణం చేయాల్సి వస్తోన్న వారు ఈ అగ్రహారంలో నివసించేట్లు చేయాలనీ రామానుజులు భావించడం జరిగింది. ఈ ఆలోచన కలిగిన దశలోనే తిరుపతిలోని పార్థసారథి గుడి ప్రక్కనే చిదంబరం నుండి గోవిందరాజ ప్రతిమను తెచ్చి ప్రతిష్ఠాపన చేయగలిగితే అగ్రహారానికి ఒక పరిపూర్ణ హంగు ఏర్పడుతుందని రామానుజులు భావించారు. ఆ రెండు విషయాలను నేటి తిరుపతి, దాని పరిసర విశాల ప్రాంతాలను... నేటి నారాయణవనంను రాజధానిగా చేసుకుని పరిపాలిస్తున్న 'సామంత' యాదవ రాయలు ఘట్టిదేవకు తెలుపడంతో ఆయన ఆ రెండు కార్యాలకు అవసరమైన ఏర్పాట్లు చేశాడు. కడకు, ఫిబ్రవరి 24, 1130వ తేదిన గోవిందరాజ ప్రతిమా ప్రతిష్ఠాపన చేయడంతో బాటు, తిరుపతి అగ్రహార నిర్మాణ కార్యక్రమాన్ని కూడా రామానుజులు ఆరంభించారు.



తిరుపతి పేరు క్రీ.శ.1234 నాటికి ఒక శాసనంలో తొలిసారిగా కనిపిస్తుంది. గోవిందరాజ ప్రతిమ ప్రతిష్ఠాపన జరిపి, ఆ తరువాత అగ్రహార నిర్మాణ ఆరంభ కార్యక్రమాన్ని రామానుజులవారు జరిపినట్లు గోవిందరాజ నిత్యపూజా కార్యక్రమంలో ఉచ్చరించబడు మంత్ర పుష్పంలోని ఒక భాగం నందలి మాటలను బట్టి తెలుస్తోంది. తిరుపతి గోవిందరాజ ప్రతిమా ప్రతిష్ఠాపన ఫల్గుణ పౌర్ణమి, ఉత్తరానక్షత్రం, సోమవారం నాడు జరిగిందని మంత్ర పుష్పం తెలుపుతోంది. రామానుజులు జీవిత కాలంలో ఫల్గుణ నెల, పౌర్ణమి తిథి, ఉత్తరా నక్షత్రం, సోమవారం రోజు ... ఆంగ్ల కాలమానంలో 1130 ఫిబ్రవరి 24తో మాత్రమే సరిపోలుతోంది. అంటే తిరుపతి నిర్మాణంతోపాటూ గోవిందరాజ ఆలయ నిర్మాణం ఈ తేదీనే ప్రారంభమయ్యిందని స్పష్టమవుతోంది. రామానుజుల వారిని స్మరించుకొనే రీతిలో 2022 ఫిబ్రవరి 24న తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తిరుపతిలో ఒక పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షణీయం.

వ్యాసకర్త ప్రొఫెసర్, ఎస్వీ యూనివర్సిటీ । 98495 84324

(తిరుపతి పట్టణానికి, గోవిందరాజ ఆలయానికీ శంకుస్థాపనలు జరిగి రేపటికి 893 ఏళ్లు)

సుస్థిర వ్యవసాయంతోనే రాబడి

విశ్లేషణ



డా॥ పి. పృథ్వీకర్ రెడ్డి

రసాయనాలు వాడకం వలన ఇండియాలో వ్యవసాయం, ఒక జీవనోపాధి దశనుండి మిగులు ఉత్పత్తి దిశగా పయనించిన మాట వాస్తవం. అయితే రైతులు మోతాదు మించి రసాయనాలు వాడటం వల్ల భూమి నిస్సారమై, పర్యావరణం కలుషితమయ్యింది. కనుక పర్యావరణ అనుకూలమైన, రైతుకు మెరుగైన ఆదాయ అవకాశాలను అందించే ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతి తక్షణావసరం. ప్రకృతి వ్యవసాయ పద్ధతి చాలా ఉత్తమమైన ప్రత్యామ్నాయంగా రుజువవుతున్నది. ఈ పద్ధతిలో రసాయనాలు వాడకం పూర్తిగా నిషిద్ధం. పశువుల మీద, స్థానికంగా లభించే వనరుల మీద ఈ పద్ధతి ఆధారపడి ఉన్నది. దీని విస్తరణకు భారత ప్రభుత్వం కూడా ప్రోత్సాహాన్ని ఇస్తుందనడానికి 2023–24 సంవత్సర బడ్జెట్ ప్రతిపాదనలే నిదర్శనం.

ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందంజలో ఉంది. రైతు సాధికారక సంస్థ ద్వారా ఏపీలో సహజ వ్యవసాయాన్ని అన్ని జిల్లాలలోనూ ప్రోత్సహిస్తున్నది. పంట పండించడానికి అయ్యే ఖర్చులు తగ్గించడం, పంట దిగుబడి పెంచడం; వ్యవసాయ శాస్త్ర సూత్రాలూ, పద్ధతులనూ ప్రోత్సహించడం ద్వారా వాతావరణ మార్పుల అనిశ్చితి నుండి రైతులను రక్షించడం ఏపీలో ప్రకృతి వ్యవసాయం ముఖ్య ఉద్దేశ్యాలుగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతి ప్రభావాన్ని అంచనా వేయడానికి... రైతు సాధికారక సంస్థ... విశాఖలో ఉన్న ఐడీఎస్ ఏపీకి అప్పగించారు. 2018–19 నుండి ఈ అంచనా ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఈ ప్రక్రియలో నేను కూడా పాల్గొంటున్నాను. ప్రతి సంవత్సరం రాష్ట్రం నుండి 2,000కు పైచిలుకు రైతుల నుండి సమాచారం సేకరించి అంచనా వేస్తున్నాం. ఈ అంచనాయే ఈ వ్యాసానికి ఆధారం.

ప్రకృతి వ్యవసాయ ఫలితాలు అన్ని పంటలలోనూ చాలా ఆశాజనకంగా ఉన్నాయి. ఉదాహరణ కు, ప్రధాన పంటలయిన వరి, వేరుశెనగ, పత్తి, మొక్కజొన్నల దిగుబడి బాగుంటోంది. 2018–19 నుండి నాలుగేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వచ్చే దిగుబడి, రసాయనాలు వాడిన పద్ధతి వల్ల వచ్చిన దిగుబడితో పోలిస్తే ఎక్కువగా ఉంది. అంతే కాక ఒక క్వింటాల్ (100 కిలోలు) దిగుబడి కొరకు అయ్యే ఖర్చు... రసాయనాలు వాడిన పద్ధతితో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చాలా తక్కువ అని రుజువయింది.

2018–19లో ఒక క్వింటాల్ వరి పండించడానికి రసాయన పద్ధతితో పోలిస్తే సహజ వ్యవసాయం ద్వారా పండించిన పంటకు రూ.79 తక్కువ ఖర్చు అయ్యింది. అది 2021–22 నాటికి రూ. 498కు తగ్గింది. ఈ తగ్గుదల పత్తి పంటలో చాలా ఎక్కువగా ఉంది. దీనికి ప్రధాన కారణం... దిగుబడి స్థాయి తగ్గకుండా ఉండడం, రసాయనాలకు



వెచ్చించే ఖర్చులతో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయ (సహజ) పద్ధతిలో పంట ఎదుగుదలకూ, సస్యరక్షణకూ ఖర్చులు చాలా తక్కువగా ఉండడం.

గత నాలుగేళ్ల డాటాను పరిశీలించినట్లయితే... ప్రకృతి వ్యవసాయ (సహజ) పద్ధతిలో వాడే వనరులు అనగా జీవామృతం, కషాయాలు, అస్త్రాలు వంటివాటి ఖర్చు వాటా... వరి, పత్తి పంటలకయ్యే ఖర్చులో 11 నుండి 15 శాతం ఉండగా; రసాయనాల ఖర్చు వాటా 21 నుండి 35 శాతం ఉన్నది.

సహజ పద్ధతిలో పండించిన ఈ రెండు పంటల నికర ఆదాయం రసాయన పద్ధతిలో పండించిన పంట కంటే చాలా ఎక్కువగా ఉంది. వరి పంట నికర ఆదాయం, రసాయన పద్ధతిలో పండించిన పంట కంటే, సహజ పద్ధతిలో హెక్టారుకు 2018–19 లో రూ. 3460 అధికంగా ఉండగా, 2019–20 లో రూ. 20,395, 2020–21 లో రూ. 19,288, 2021–22 లో రూ. 22,607 అధికంగా ఉంది. పత్తి పంట సహజ పద్ధతిలో పండించిన ఆదాయం, రసాయన పద్ధతిలో పండించిన దానికంటే హెక్టారుకు 2018–19లో రూ. 8,683, 2019–20లో రూ. 23,396, 2020–21లో రూ. 21,314, 2021–22లో రూ. 23,036 అధికంగా ఉంది.

గడచిన నాలుగేళ్ల సగటును చూసినట్లయితే, సహజ పద్ధతిలో వాడిన ఇన్‌పుట్స్ ఖర్చు, ప్రతి రూపాయి ఖర్చుకీ వరిలో రూ. 9.20 రాబడి (దిగుబడి రూపంలో), పత్తిలో రూ. 6.65 రూపాయలు వచ్చింది. అదే విధంగా, రసాయన పద్ధతిలో రసాయనాల కొరకు వెచ్చించిన ప్రతి రూపాయి ఖర్చుకీ వరిలో రూ. 2.36 రాబడి, పత్తిలో రూ. 0.86 మాత్రమే వచ్చింది. ఇది ఈ రెండు పంటలకే పరిమితం కాలేదు. అన్ని పంటలలోనూ ఇదే విధంగా ఉంది. రైతులు సహజ వ్యవసాయ శాస్త్ర సూత్రాలు, పద్ధతులు పూర్తిగా వారికున్న మొత్తం భూమిలో పాటించినట్లయితే వ్యవసాయం నుంచి వచ్చే ఆదాయం రెట్టింపు చేసుకోవడం సులభతరం అవుతుంది.

సహజ వ్యవసాయ పద్ధతిలో పంట పండించడానికి అయ్యే ఖర్చు తగ్గడం మూలాన, రైతు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా రక్షించబడుతున్నాడు. అలాగే తనకున్న భూమిలో బహుళ పంటలు అన్ని సీజన్లలో వేయడం మూలాన, భూమి ఉత్పత్తి సామర్థ్యం పెరిగి, తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొనుటలో మెరుగుపడి, పర్యావరణ సమతుల్యానికి దోహద పడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సహజ వ్యవసాయ పద్ధతి, దేశమంతటా పాటించినట్లయితే, స్థిరమైన సమతుల్య వ్యవసాయ అభివృద్ధికి ఎంతోకాలం పట్టదు.

వ్యాసకర్త ఆర్థికవేత్త

ఈ–మెయిల్: prudhvikar@cess.ac.in

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణమాసం, తిథి: శు.తదియ ఉ.7.42 వరకు, తదుపరి చవితి, నక్షత్రం: ఉత్తరాభాద్ర ఉ.9.04 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: రా.8.44 నుండి 10.17 వరకు, దుర్ముహూర్తం: ఉ.10.17 నుండి 11.04 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.40 వరకు, అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 6.27, సూర్యాస్తమయం: 6.00.

క్లుప్తంగా...

జోగినాయుడు బాధ్యతల స్వీకారం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత, సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్‌గా సినీ నటుడు, వ్యాఖ్యాత ఎల్.జోగినాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. వెలగపూడి సచివాలయం నాలుగో బ్లాక్‌లోని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ భార్గవ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసిన ఆయన ఈ బాధ్యతలను చేపట్టారు. రాష్ట్రంలో సాంస్కృతిక పురోగతి, తెలుగు భాషాభివృద్ధి, పద్య, ఆధునిక నాటక వికాసం, జానపద కళారూపాల అభివృద్ధి, ఆధునికీకరణ తదితర కార్యక్రమాలను వ్యూహాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఇటీవల జోగినాయుడును నియమించింది. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని, పదవుల్లో సింహభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయిస్తున్నారని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో పనిచేయడం గొప్ప అవకాశం భావిస్తున్నట్టు తెలిపారు. తనకు ఈ అవకాశంగా ఇచ్చిన సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు.

శాస్త్రోక్తంగా లక్ష చండీ మహాయజ్ఞం



యజ్ఞాన్ని పర్యవేక్షిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం పర్యవేక్షణలో హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో జరుగుతున్న లక్ష చండీ మహాయజ్ఞం 12వ రోజు బుధవారం శాస్త్రోక్తంగా సాగింది. యజ్ఞ భూమిలో అమ్మవారు చండీమాతదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి, గుంటీ మాత అమ్మవారికి పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. యజ్ఞశాలలో పండితులు సప్తశతీ పారాయణం నిర్వహించారు. 2,160 మంది బ్రాహ్మణులు 110 హోమ గుండాల వద్ద ఏకకాలంలో యజ్ఞం జరిపారు. ఈ నెల 26వ తేదీన జరిగే మహాపూర్ణాహుతితో యజ్ఞం ముగియనుంది.

శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీ పునఃప్రారంభం

తిరుమల: తిరుమలలోని గోకులం కార్యాలయంలో బుధవారం నుంచి ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి టికెట్ల జారీని టీటీడీ పునఃప్రారంభించింది. ఈ నెలలో ఇప్పటికే 750 టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన విషయం తెలిసిందే. తిరుమలలో ఈ నెల 28వ తేదీ వరకు రోజుకు 150 శ్రీవాణి టికెట్లను జారీ చేయనున్నారు. మార్చి నుంచి 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, 400 టికెట్లు తిరుమలలోని గోకులం కార్యాలయంలో, 100 తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద భక్తులకు అందుబాటులో ఉంటాయి. టికెట్లు కావలసిన భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టికెట్లు జారీ చేస్తారు. కాగా, తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 53,755 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.4.74 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. శ్రీవారిని రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, సినీనటి బి.సరోజాదేవి దర్శించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులు పరిశీలన



సాక్షి, అమరావతి: దేశంలోనే ఎక్కడా లేని విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత నమూనా విగ్రహాలను పరిశీలించిన నిపుణులు, ఉన్నతాధికారుల అభిప్రాయాలను సేకరించి, గురుగ్రామ్‌లోని డిజైన్ నిపుణులకు పంపించామని, చివరిగా ధ్రువీకరించిన ఆకారాన్ని రూపొందించామని తెలిపారు. ఇప్పటివరకు బూట్లు తీసుకొచ్చామని, మిగిలిన విడిభాగాలను వెల్డింగ్ ప్రక్రియలో జాయింట్ చేస్తున్నట్లు చెప్పారు. షెడ్యూల్డ్ కులాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేస్తోందని, వీటి ద్వారా ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూరుతోందని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ నిత్యం అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ పనులను సమీక్షిస్తున్నారని ఆయన చెప్పారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో సాంకేతిక నిపుణుడు వాసుదేవరావు మాట్లాడుతూ 80 అడుగుల పెడస్టల్ బేస్‌మెంట్ నిర్మాణంపై 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భూమి నుంచి విగ్రహం ఎత్తు మొత్తం 205 అడుగులు ఉంటుందన్నారు. విగ్రహం చుట్టూ స్మృతివనం నిర్మాణంతోపాటు సెంట్రల్ లైబ్రరీ, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, రెండువేల మంది సామర్థ్యం ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు 18 ఎకరాల ప్రభుత్వస్థలంలో రూ.248 కోట్లతో జరుగుతున్నాయని వివరించారు.

ఈ 'వార్తలు' మొలకెత్తుతాయ్

మట్టిలో నాటితే చిగురించే వార్తాపత్రిక



- అందుబాటులోకి తెచ్చిన జపాన్ పబ్లిషర్ 'మైనిచి షింబున్స్'
- ప్రతిరోజు 40.60 లక్షల కాపీల ముద్రణ
- పర్యావరణహిత పత్రికలకు ఆదరణ పెరుగుతుందన్న 'వన్ ఎర్త్'

సాక్షి, అమరావతి: వార్తా పత్రికను చదివిన తర్వాత ఏం చేస్తారు? ఆకర్షించే అంశాలుంటే దాచుకుంటారు. లేదంటే చింపి ఇంట్లో అవసరాలకు వాడుకుంటారు. ఎక్కువగా ఉంటే కేజీల్లెక్కన అమ్మేస్తారు. కానీ, వార్తాపత్రికను చదివేశాక మట్టిలోకి పెడితే.. పరిమళాలు వెదజల్లే పూల మొక్కగానో, ఆరోగ్యాన్నిచ్చే ఔషధ మొక్కగానో మొలకెత్తితే అద్భుతమే కదా! ఈ ప్రయత్నమే చేసింది జపాన్‌లోని 'మైనిచి షింబున్స్'. ఆ ప్రచురణ సంస్థ 2016లో ప్రారంభించిన 'గ్రీన్ న్యూస్‌పేపర్' ప్రపంచ వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రస్తుత పర్యావరణ సమస్యలపై పిల్లలకు అవగాహన పెంచడానికి, భవిష్యత్ తరానికి పేపర్ రీసైక్లింగ్ ప్రాముఖ్యతను బోధించేందుకు ఉత్తమ మార్గంగా ఈ పత్రిక ప్రత్యేకతను అక్కడి పాఠ్యాంశాల్లో చేర్చడం గమనార్హం. 'ది మైనిచి షింబున్స్' మే 4, 2016న 'గ్రీనరీ డే' కోసం తొలిసారి ఈ పత్రికను ప్రచురించింది. పర్యావరణ వార్తలకు అంకితం చేస్తూ 100 శాతం బయోడిగ్రేడబుల్ పేపర్‌తో ప్రత్యేక ఎడిషన్‌గా వచ్చిన తొలి పత్రికగా ఇది గుర్తింపు పొందింది. పాత కాగితాలను రీసైకిల్ చేసి, దానికి వివిధ రకాల మొక్కల విత్తనాలను జతచేసి తయారు చేసిన కాగితాన్ని ముద్రణ కోసం వినియోగిస్తున్నారు. వార్తలను ముద్రించేందుకు కూడా మొక్కల నుంచి తీసిన సహజసిద్ధ సిరాను వినియోగించడం మరో ప్రత్యేకత. జపాన్ మార్కెట్‌లో ప్రతిరోజు సుమారు 40.60 లక్షల మందికి చేరుతున్న ఈ పత్రికను చదివిన అనంతరం మట్టిలో పడేస్తే దాన్నుంచి మొక్కలు మొలిచి సీతాకోక చిలుకలను ఆకర్షించే పూలు పూయడం అంతకంటే ప్రత్యేకం.

పత్రికలకు పెరుగుతున్న ఆదరణ

వార్తా పత్రికలకు అవసరమైన కాగితం కోసం ప్రపంచంలో ఏటా 95 మిలియన్ చెట్లను నరికివేస్తున్నట్టు పర్యావరణం పరిరక్షణకు కృషి చేస్తోన్న అమెరికాకు చెందిన 'వన్ ఎర్త్' ఎన్‌జీవో సంస్థ చెబుతోంది. అయితే, పర్యావరణ ప్రయోజనాన్ని గుర్తించిన మైనిచి షింబున్స్ సంస్థ అందుబాటులోకి తెచ్చిన గ్రీన్ న్యూస్‌పేపర్‌కు జపాన్‌లో వచ్చిన ఆదరణను చూస్తుంటే.. ఇంటర్నెట్ కాలంలో కూడా ఇలాంటి పత్రికలను రీడర్స్ విపరీతంగా ఆదరిస్తారని నిరూపితమైనట్టు పేర్కొంది. గ్రీన్ న్యూస్‌పేపర్ ముద్రణ ద్వారా ప్రచురణకర్త 7 లక్షల డాలర్లకు పైగా ఆర్జించడం పెద్ద సంచలనంగా వన్ ఎర్త్ పేర్కొంది. ఇది వార్తాపత్రిక పరిశ్రమకు పెరుగుతున్న ఆదరణగా, పర్యావరణంపై ప్రజల్లోని చైతన్యానికి గుర్తుగా వివరించింది. భారతదేశంతో సహా ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలోను మొలకెత్తే పత్రికల ముద్రణ ప్రారంభమైందని, అమెరికాలోని అనేక కంపెనీలు వివిధ ప్రయోజనాల కోసం ప్లాంటేషన్ పేపర్‌ను తయారు చేయడం ప్రారంభించినట్టు పేర్కొంది. ఇటీవల వన్ ఎర్త్ చేసిన సర్వేలో భారత్‌లో శుభలేఖలు, యూరప్‌లో 74 శాతం గ్రీటింగ్ కార్డులను మొలకెత్తే రీతిలో తీసుకొచ్చినట్టు తెలిపింది.



పచ్చదనం పెంచడానికి దోహదం

ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచే కార్యక్రమాలను జపాన్ ప్రభుత్వం ముమ్మరం చేసిన నేపథ్యంలో దేశంలో పచ్చదనం పెంపునకు తమ పత్రిక దోహదం చేస్తున్నట్టు ప్రచురణ సంస్థ ది మైనిచి షింబున్స్ ప్రకటించింది. పత్రిక చదవడం పూర్తయిన తర్వాత చిన్న ముక్కలుగా చింపేసి, ఆ ముక్కలను మట్టిలో నాటాలని, ఆపై ఇతర మొక్కల మాదిరిగానే నీరు పెట్టాలని వారు సూచిస్తున్నారు. జపాన్‌లోని అతిపెద్ద అడ్వర్టైజింగ్ ఏజెన్సీలలో ఒకటైన డెంట్సు ఇంక్ ఈ విధానాన్ని కనిపెట్టి, మైనిచితో కలిసి పనిచేస్తోంది. గత కొన్నేళ్లుగా ది మైనిచి షింబున్స్ పబ్లిషర్స్ జపాన్ పాఠశాలల్లో పర్యావరణ సమస్యలపై అవగాహన పాఠాలు చెబుతున్నారు.

ఏపీ ఫైబర్‌నెట్ బేసిక్ ప్లాన్ ధరలు పెంచం

- జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో అందుబాటులో ఏపీ ఫైబర్‌నెట్ సేవలు
- త్వరలో ఏపీఎస్ఎఫ్ఎల్ నుంచి ఓటీటీ యాప్
- కొత్తగా సెట్‌టాప్ బాక్సుల సరఫరాకు ఆసక్తిగల సంస్థల నుంచి టెండర్లు
- పాత సెట్‌టాప్ బాక్సుల మరమ్మతులకు 3 సర్వీస్ సెంటర్లు
- విలేకరుల సమావేశంలో ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పి.గౌతంరెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఫైబర్‌నెట్ బేసిక్ ప్లాన్ ధరలు పెంచే ప్రసక్తే లేదని ఆంధ్రప్రదేశ్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) చైర్మన్ పి.గౌతంరెడ్డి స్పష్టం చేశారు. ఏపీఎస్ఎఫ్ఎల్ బేసిక్ ప్లాన్ ధరలు పెంచుతోందంటూ కొన్ని మీడియా సంస్థలు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. విజయవాడలోని ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.190కే బేసిక్ ప్లాన్ అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే బల్క్ ఇంటర్నెట్ ధరలను భారీగా తగ్గించినట్లు చెప్పారు. 2019లో 100 ఎంబీపీఎస్ ఫీజు రూ.8 లక్షలుగా ఉంటే అది ఇప్పుడు రూ.4.40 లక్షలకు తగ్గిందన్నారు. కొత్త కనెక్షన్లు పెంచుకోవడానికి సెట్‌టాప్ బాక్సులను సరఫరా చేయడానికి ఆసక్తిగల సంస్థల నుంచి టెండర్లు పిలవడానికి బోర్డు ఆమోదం తెలిపిందని చెప్పారు. తక్షణం 20 లక్షల బాక్సులు అవసరమవుతాయన్నారు. పాత బాక్సులకు మరమ్మతులు చేయడానికి విశాఖ, విజయవాడ, తిరుపతిల్లో సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో 55 వేల కిలోమీటర్ల ఆప్టికల్ ఫైబర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 33 వేల కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, త్వరలోనే మిగిలిన మొత్తం పూర్తిచేస్తామని వివరించారు. విస్తరణ కోసం ఆర్ఈసీ, పీఎఫ్‌సీ రుణం ఇవ్వడానికి ముందుకొచ్చినా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రావాల్సిన బకాయిలను రాబట్టుకోవడం ద్వారా పనులు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల్లో ఏపీ ఫైబర్‌నెట్ సేవలు అందుబాటులో ఉంటాయని, ఇప్పటికే పలుచోట్ల అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. ఓటీటీ తరహాలో ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోందన్నారు. ఇందులో సినిమాలు, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారంతోపాటు ఇతర వినోద కార్యక్రమాలను అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా కొత్త సినిమాలను రిలీజ్ రోజునే ఈ యాప్ ద్వారా చూసే విధంగా చిత్రపరిశ్రమతో చర్చిస్తున్నట్లు ఆయన చెప్పారు.

విశ్వ బ్రాహ్మణులకు నైపుణ్యాలపై సహకారం

- సమాజ నిర్మాణంలో వారి పాత్ర కీలకం: సజ్జల
- సమస్యలను సీఎం దృష్టికి తెచ్చి పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: విశ్వ బ్రాహ్మణుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం తాడేపల్లిలోని శ్రీ ఫార్చ్యూన్ గ్రాండ్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విశ్వ బ్రాహ్మణులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని, వైఎస్సార్ సీపీ వారికి ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. సమస్యలను సీఎం జగన్ దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామన్నారు. విశ్వ బ్రాహ్మణుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఎలాంటి సహకారం కోరినా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సమకాలీన సమాజాన్ని మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆనాడే కాలజ్ఞానం ద్వారా చెప్పారని గుర్తు చేశారు. ఆయన వారసులైన విశ్వబ్రాహ్మణులు మరింత అభివృద్ధి సాధించాలన్నారు. కుల వృత్తులను టెక్నాలజీతో మేళవించాలన్నారు. తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక ద్వారా బీసీల పట్ల తన ప్రాధాన్యతను సీఎం జగన్ మరోసారి స్పష్టం చేశారన్నారు. బీసీలకు సీఎం జగన్ చేసిన మేలు గురించి రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఈ సందర్భంగా వివరించారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయుల గౌరవం పెంపొందించిన వారు విశ్వ బ్రాహ్మణులని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయేలా బీసీలకు ఎంతో మేలు చేశారని సభకు అధ్యక్షత వహించిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు తెలిపారు. తదుపరి ఎమ్మెల్సీ స్థానాల్లో విశ్వ బ్రాహ్మణులకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మఠం నిర్మించుకునేందుకు తిరుమలలో స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మారేష్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దవ్వూరి నరసింహాచారి, కోశాధికారి సింహాద్రి ధనుంజయచారి, గౌరవాధ్యక్షుడు జవ్వాది కూర్మాచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.సన్నాయిదాసు, శివకోటి వాసు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.నంద వీరప్రసాద్, అధికార ప్రతినిధి వినుకొండ సుబ్బారావు, క్రమశిక్షణా కమిటీ చైర్మన్ కార్ల పాపయ్యచారి, సలహా కమిటీ చైర్మన్ కె.తిలక్, మహిళ కమిటీ చైర్మన్ ఏ.సుశీల, 26 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలు జేసీ బ్రదర్స్‌కు కోర్టు సమన్లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో వాహనాల కుంభకోణం కేసులో టీడీపీ నేతలు జేసీ దివాకర్ రెడ్డి, ఆయన సోదరుడు జేసీ ప్రభాకర్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. 155 బీఎస్-3 వాహనాలకు బీఎస్-4గా నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించి వాటిని జేసీ బ్రదర్స్ విక్రయించారనే అభియోగాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ కుంభకోణంలో ప్రధాన నిందితులుగా ఉన్న జేసీ బ్రదర్స్‌తో సహా 18 మందికి విజయవాడలోని ప్రజాప్రతినిధుల కోర్టు బుధవారం సమన్లు జారీ చేసింది. మార్చి 1న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. పోలీసులు జేసీ ప్రభాకర్ రెడ్డికి స్వయంగా సమన్లు అందజేశారు.

ఏపీ నుంచే నేరుగా హజ్ యాత్ర

- తొలిసారి విజయవాడ నుంచి విమాన సౌకర్యం
- ఫలించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి
- దేశంలో మరెక్కడా లేని విధంగా యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం
- జిల్లా కేంద్రాల నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక బస్సులు
- మక్కాలోనూ ఆంధ్ర యాత్రికులకు ఒకే ప్రాంగణంలో వసతి, సౌకర్యాలు
- ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ వెల్లడి

సాక్షి, అమరావతి: హజ్ (మక్కా) యాత్రకు వెళ్లే రాష్ట్రానికి చెందిన ముస్లింల కోసం రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా విజయవాడ నుంచి ప్రత్యేక విమాన సౌకర్యం కల్పిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా హజ్ యాత్రికుల కోసం విజయవాడలో ఇమిగ్రేషన్‌కు కేంద్ర విమానయాన శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఏపీకి చెందిన హజ్ యాత్రికులు ఇప్పటి వరకు బెంగళూరు, హైదరాబాద్ నుంచి వెళ్లేవారు. ఈ ఏడాది నుంచి విజయవాడ గన్నవరం విమానాశ్రయం నుంచే నేరుగా వెళ్లొచ్చు. ఈ అవకాశాన్ని రాష్ట్రానికి చెందిన ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలి' అని ఏపీ స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ పిలుపునిచ్చారు. బుధవారం విజయవాడలో జరిగిన కమిటీ సమావేశంలో హజ్ యాత్ర ఏర్పాట్లపై చర్చించారు. యాత్ర ఏర్పాట్లపై రూపొందించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం సమావేశం నిర్ణయాలను సభ్యులతో కలిసి ఆయన మీడియాకు వివరించారు.

దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని రీతిలో

హజ్ యాత్రకు వెళ్లేందుకు రూ. 3 లక్షల లోపు ఆదాయం కలిగిన బియ్యం కార్డుదారులకు రూ.60 వేలు, రూ. 3 లక్షలకంటే ఎక్కువ ఆదాయం ఉన్న వారికి రూ.30 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తోఫా ఇస్తోంది. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇలా ఇవ్వడంలేదు. తొలిసారి 70 ఏళ్ల పైబడిన వారు (1953 ఏప్రిల్ 30కి ముందు జన్మించిన వారు) దరఖాస్తు చేసుకుంటే లాటరీతో సంబంధం లేకుండా నేరుగా యాత్రకు ఎంపిక చేస్తారు. 70 ఏళ్లు పైబడిన వారు ఒకరిని సహాయకుడిగా తీసుకెళ్లొచ్చు. అదే విధంగా ఒంటరిగా ఉండే 45 ఏళ్ల పైబడిన మహిళలు కనీసం నలుగురు (2023 ఏప్రిల్ 30 నాటికి 45 ఏళ్లు నిండి ఉండాలి) కలిసి దరఖాస్తు చేసుకుంటే నేరుగా ఎంపిక చేస్తారు. ఒక వేళ ఇద్దరు మహిళలే దరఖాస్తు చేస్తే, కమిటీ ద్వారా మరో ఇద్దరు మహిళలను కలిపి పంపిస్తారు. ఈసారి 12 ఏళ్ల లోపు చిన్నారులకు సౌదీ ప్రభుత్వం అనుమతినివ్వలేదు. యాత్రకు వెళ్లే వారి కోసం హజ్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా హజ్ సొసైటీల ద్వారా అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. యాత్రికుల కోసం జిల్లా కేంద్రాలు, ముఖ్య పట్టణాల నుంచి విజయవాడ ఎయిర్‌పోర్టుకు ప్రత్యేకంగా బస్ సౌకర్యం కల్పిస్తున్నారు. వారిని సాగనంపేందుకు వచ్చే కుటుంబ సభ్యులకు సైతం గన్నవరంలోని ఓల్డ్ ఎయిర్‌పోర్టు, విజయవాడలోని మదరసాలలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వీరి సహాయార్థం వలంటీర్లను సైతం నియమిస్తున్నారు. ప్రయాణానికి 48 గంటల ముందు రిపోర్టు చేసే యాత్రికులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. మక్కాలో కూడా ఏపీ నుంచి వెళ్లే యాత్రికులకు ఏపీ ప్రభుత్వం తరపున ఒకే ప్రాంగణంలో వసతి, వైద్య సౌకర్యాలు కల్పిస్తున్నట్లు స్టేట్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ తెలిపారు. కమిటీ సమావేశంలో సభ్యులైన ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, సయ్యద్ వలియుల్లా హుస్సేన్, మహమ్మద్ ఇమ్రాన్, షేక్ గులాబ్జాన్, షేక్ అతువుల్లా తదితరులు పాల్గొన్నారు.



హజ్ యాత్ర పోస్టర్ విడుదల చేస్తున్న హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌసల్ హజమ్, ఎమ్మెల్సీ బాషా తదితరులు

దరఖాస్తు చేయండిలా..

హజ్ యాత్రకు వెళ్లే వారు http:hajcommittee.gov.in ద్వారా లేదా స్మార్ట్ ఫోన్‌లో ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో మార్చి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి

- దరఖాస్తుతో పాటు పాస్‌పోర్టు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు-2, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు-4, బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ లేదా క్యాన్సిల్డ్ బ్యాంక్ చెక్ సమర్పించాలి
- ఉచితంగా దరఖాస్తు చేసేందుకు జిల్లా హజ్ సొసైటీల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు
- దరఖాస్తు ప్రింట్ కాపీతో పాటు అవసరమైన పత్రాలు, అడ్వాన్స్ ఫీజు రసీదు, మెడికల్ సర్టిఫికెట్లను డ్రా తర్వాత ఏపీ హజ్ కమిటీ కార్యాలయంలో అందజేయాలి

• మంగళం తుడా క్వార్టర్స్ సమీపంలోని శేషాచలం అడవులకు బుధవారం సాయంత్రం కొందరు ఆకతాయిలు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎఫ్ఆర్వో రాములనాయక్ ఆధ్వర్యంలో ఫైర్ ప్రొటెక్షన్ వాచర్లు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేదు.

28లోగా ఈ-క్రాప్, ఈ-కేవైసీ పూర్తికావాలి

- 27న మూడోవిడత రైతుభరోసా సాయం
- అదేరోజు మాండూస్ తుపాను పరిహారం కూడా
- వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్

సాక్షి, అమరావతి: రబీ సీజన్‌లో సాగవుతున్న పంటల నమోదు (ఈ-క్రాప్)తో పాటు రైతుల ఈ-కేవైసీని ఈ నెల 28వ తేదీలోగా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ కోరారు. ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ పంట రుణాలు, పెట్టుబడి రాయితీ, మద్దతు ధరలపై వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు ప్రామాణికమని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ-క్రాప్‌తో పాటు రైతుల ఈ-కేవైసీని పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం మంగళగిరిలోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా వ్యవసాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ 2022-23 సీజన్‌కు సంబంధించి వైఎస్సార్ రైతుభరోసా-పీఎం కిసాన్ మూడోవిడత సాయం ఈ నెల 27వ తేదీన జమకానున్నట్లు తెలిపారు. ఇందు కోసం అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని సూచించారు. గతేడాది మాండూస్ తుపాను వల్ల జరిగిన పంట నష్టానికి సంబంధించి రూ.76 కోట్ల పరిహారం కూడా అదేరోజు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమచేయనున్నారని చెప్పారు. వేసవి పంటకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్ మార్చి నుంచి చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. రబీ సీజన్‌కు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆర్బీకేలకు ఎరువుల సరఫరాను మరింత పెంచాలని ఆదేశించారు. వైఎస్సార్ యంత్ర సేవాకేంద్రాల ఏర్పాటుకు సంబంధించి డీలర్లకు కొనుగోలు ఆర్డర్ల జారీ, రైతు కమిటీలకు రుణాల మంజూరు ప్రక్రియను మార్చి 5వ తేదీకల్లా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

అమరావతి రాజధానికి చట్టబద్ధత లేదు

- 878వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు



తాడికొండ: కేంద్రం నియమించిన నిపుణుల కమిటీల నివేదికలను పక్కన బెట్టి నారాయణ కమిటీతో వేసిన నివేదిక ప్రకారం ఎంపిక చేసిన అమరావతి రాజధానికి చట్టబద్ధత లేదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 878వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాజధానిపై గతంలోనే కేంద్రం అఫిడవిట్ రూపంలో కోర్టుకు నివేదిస్తూ ఆయా రాష్ట్రాలకే సర్వాధికారం ఉంటుందని తెలియజేసిందని, కానీ రాష్ట్రాభివృద్ధికి అడ్డుపడేందుకే బాబు అండ్ కో తప్పుడు కేసులు వేయిస్తున్నారని మండిపడ్డారు. వికేంద్రీకరణ ద్వారానే అభివృద్ధి సాధ్యమని నిపుణుల కమిటీలు సైతం సూచించినా పెడచెవిన పెట్టిన చంద్రబాబు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమరావతిని రాజధానిగా చేసి లక్షల కోట్లు దోపిడీ చేశాడనేది బహిరంగ సత్యమన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో విశాఖ వేదికగా పాలన కొనసాగించాలనే నిర్ణయంతో ముందుకెళుతున్న ప్రభుత్వానికి 5 కోట్ల మంది ప్రజల మద్దతు ఉంటుందని, త్వరలో ఆ దిశగా అడుగులు వేయాలని కోరారు. బాబుతో కలిసి ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారానికి కాలం చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయని చెప్పారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో రాఖీ సావంత్ భర్తకు కస్టడీ

మైసూరు : చదువుకోవడానికి మైసూరుకు వచ్చిన ఇరాన్ యువతిపై లైంగిక దాడి కేసులో బాలీవుడ్ నటి రాఖీసావంత్ భర్త ఆదిల్‌ఖాన్ దురానీని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఆయనను బుధవారం మైసూరు కోర్టులో హాజరు పరచగా ఈ నెల 27 వరకు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఆదేశించింది. అతనిని కోర్టుకు తీసుకొచ్చినప్పుడు నటి రాఖీ సావంత్ కూడా హాజరయ్యారు.

నాకూ న్యాయం కావాలి: రాఖీ సావంత్

అనంతరం మీడియాతో రాఖీ సావంత్ మాట్లాడారు. తాను చట్టబద్ధంగా పెళ్లి చేసుకున్నానని, తాను హిందూ మతానికి చెందినప్పటికీ ఆదిల్ కోసం ఇస్లాం మతాన్ని స్వీకరించి, ఫాతిమా అని పేరు కూడా మార్చుకున్నానని తెలిపారు. తన వద్ద నుంచి సుమారు రూ.1.70 కోట్లు తీసుకుని ఆదిల్ తిరిగివ్వలేదని రాఖీ ఆరోపించారు. తనను ఆదిల్ ఇంటి వారు ఆదరించలేదని వాపోయారు. తనకు న్యాయం కావాలని, అతనికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెయిల్ రాకూడదన్నారు.

అంబులెన్స్ ఆలస్యం అవాస్తవం

- ప్రమాద తీవ్రత వల్లే ఇద్దరు చనిపోయారు
- 108, 104 సేవలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

కర్నూలు(హాస్పిటల్): నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఆలమూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుల మృతికి ప్రమాద తీవ్రతే కారణమని, అంబులెన్స్ చేరుకోవడంలో ఎలాంటి జాప్యం లేదని 108, 104 సేవలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ అడిషనల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆర్.మధుసూదన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అంబులెన్స్ రాక ఆలస్యం కావడం వల్లే ఇద్దరు మృతి చెందారని కొన్ని దినపత్రికల్లో వచ్చిన కథనం అవాస్తవమని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో పాణ్యం మండలం వెహికల్ మరమ్మతులకు గురై ఉందని, దీంతో బనగానపల్లె వాహనానికి కేసు ఇచ్చినట్టు తెలిపారు. ఈ వాహనం మంగళవారం రాత్రి 7.45 గంటలకు బయలుదేరి 22 కి.మీ. దూరంలో ఉన్న ఘటన స్థలానికి దాదాపు 28 నిమిషాల్లో చేరుకుందన్నారు. అప్పటికే క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని, సిబ్బంది వారిని పరిశీలించి అంబులెన్స్‌లోకి చేర్చేందుకు 20 నిమిషాలు పట్టిందని తెలిపారు. అనంతరం నంద్యాల జిల్లా ఆస్పత్రికి వారిని తీసుకెళ్లారని, అక్కడి వైద్యులు వారి మృతిని నిర్ధారించారని మధుసూదన్‌రెడ్డి వివరించారు.

విద్యుదుత్పత్తికి ఇబ్బంది లేకుండా నీటి వినియోగం

- బలిమెల రిజర్వాయర్ వాటాపై ఏపీ, ఒడిశా అధికారుల సమావేశం

సీలేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): వేసవిలో విద్యుత్ ఉత్పత్తికి బలిమెల రిజర్వాయర్ నీటి వినియోగంలో సమన్వయంతో వ్యవహరించాలని ఆంధ్ర, ఒడిశా నీటిపారుదల శాఖ అధికారులు నిర్ణయించారు. ఏవోబీలో ఈ జలాశయం నీటి నిల్వలపై బుధవారం ఇరు రాష్ట్రాల అధికారులు సమావేశమయ్యారు. వేసవిలో విద్యుత్ ఉత్పత్తికి ఎంత నీరు అందుబాటులో ఉంది, దానిని ఎలా వాడుకోవాలనే అంశంపై చర్చించారు. బలిమెలలో 45.3674 టీఎంసీలు ఉండగా అందులో ఏపీకి 23.3916 టీఎంసీలు కేటాయించగా ఒడిశా 21.8758 టీఎంసీలు వాడుకోవాలని లెక్క తేల్చారు. 2022 జూలై నుంచి 2023 జనవరి వరకు 31 టీఎంసీలు ఏపీ వాడుకోగా, ఒడిశా 31టీఎంసీలు వాడుకున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయానికి బలిమెల నుంచి ఏపీకి రోజుకు 4 వేల క్యూసెక్కులు, ఒడిశా 1800 క్యూసెక్కులు వాడుకునేందుకు అంగీకరించారు. సమావేశంలో ఏపీ జెన్‌కో సూపరింటెండింగ్ ఇంజనీర్ ప్రశాంత్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్, ఏడీ అప్పలనాయుడు, ఒడిశా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఒకటో తరగతికి ఆరేళ్లు
కనీస వయసుపై కేంద్రం సూచన

న్యూఢిల్లీ: ఒకటో తరగతిలో ప్రవేశాలకు కనీస వయసును ఆరేళ్లుగా నిర్ధారించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. నూతన విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రకారం బాలలందరికీ 3 నుంచి ఎనిమిదేళ్ల వయసు దాకా ఐదేళ్ల మౌలిక విద్యాభ్యాస సమయం. ఇందులో తొలి మూడేళ్లు ప్రీ స్కూల్ స్థాయి బోధన, అనంతరం ఒకటి, రెండో తరగతి ఉండాలి. ఈ ఐదేళ్లూ వారికి అంగన్వాడీలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ప్రీ స్కూళ్లలో నాణ్యతతో కూడిన బోధన అందాలన్నది లక్ష్యమని కేంద్ర విద్యా శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఈ మౌలిక స్థాయిలో అర్హులైన ఉపాధ్యాయుల లభ్యతే కీలకమని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం వారికి రెండేళ్ల డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సును రూపొందించి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర విద్యా శాఖ సలహా ఇచ్చింది.

హిజాబ్‌తో పరీక్షలు రాస్తాం
సుప్రీంను అభ్యర్థించిన కర్ణాటక విద్యార్థినులు

న్యూఢిల్లీ: వచ్చే నెలలో పరీక్షలకు హాజర య్యేటపుడు హిజాబ్‌ను అనుమతించాలని కర్ణాటక ముస్లిం విద్యార్థినులు సుప్రీంకోర్టుకు విన్నవించుకున్నారు. 'విద్యాసంస్థల్లో హిజాబ్ ధారణపై సుప్రీంకోర్టులో జడ్జీలు భిన్న తీర్పులు వెలువర్చిన నేపథ్యంలో ఆ అంశం జోలికి వెళ్ల కుండా కేవలం ఎగ్జామ్ హాల్‌లోకి హిజాబ్‌తో ప్రవేశానికి అనుమతి కోరుతూ కోర్టును ఆశ్రయించాం. సోమవారం లేదా శుక్రవారం ఈ అంశాన్ని కోర్టు విచారణకు చేపడుతుందని భావిస్తున్నాం' అని విద్యార్థినుల తరఫు లాయర్ షాదన్ ఫరాసత్ చెప్పారు. దీనిపై నిర్ణయం తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం పేర్కొంది.

మోర్బీ వంతెన మృతులకు... రూ. పది లక్షల పరిహారం

అహ్మదాబాద్: మోర్బీ వేలాడే వంతెనను నిర్వహించిన గడియారాల తయారీ సంస్థ ఓరెవా గ్రూపు (అజంతా గడియారాలు) బాధిత కుటుంబాలకు పరిహారమివ్వాలని గుజరాత్ హైకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. మృతుల కుటుంబాలకు రూ పది లక్షలు, క్షతగాత్రులు రూ. రెండు లక్షల చొప్పున నాలుగు వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది. గత ఏడాది అక్టోబరు 30న సామర్థ్యానికి మించి జనాలను అనుమతించడంతో ఈ పురాతన వంతెన కూలిపోయి.. మొత్తం 135 మంది మరణించిన విషయం తెలిసిందే. మృతులు కుటుంబాలను ఐదేసి లక్షలు, క్షతగాత్రులకు రూ. లక్ష చొప్పున చెల్లిస్తామని ఓరెవా గ్రూపు ముందుకు రాగా.. తోసిపుచ్చిన హైకోర్టు 10 లక్షలను పరహారంగా నిర్ణయించింది.

ఒక దురాక్రమణకు తలవంచని తెగువకు ఏడాది

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి దిగి రేపటికి ఏడాది ● మరుభూమిగా మారినా మడమ తిప్పని ఉక్రెయిన్

- ఇప్పటికే తీవ్రంగా నష్టపోయిన రష్యా
- అయినా యుద్ధాన్ని ముగించేందుకు ససేమిరా
- ఆర్థికంగా ప్రపంచ దేశాలు అతలాకుతలం

ఏడాది క్రితం..

2022 ఫిబ్రవరి 24...

ప్రపంచం ఎన్నటికీ మర్చిపోలేని రోజు. పొరుగు దేశం ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగిన రోజు. రష్యా అపార సాయుధ సంపత్తి ముందు ఉక్రెయిన్ నిలవలేదని, దాని ఓటమితో రోజుల వ్యవధిలోనే యుద్ధం ముగుస్తుందని అంతా భావించారు.

దాదాపు ఏడాది గడిచాక...

పసికూనగా భావించిన ఉక్రెయిన్ పట్టువీడకుండా తెగించి పోరాడుతూనే ఉంది. పాశ్చాత్య దేశాల సాయుధ, ఆర్థిక సాయం దన్నుతో రష్యాను దీటుగా ఎదిరిస్తోంది. పలు ఆక్రమిత ప్రాంతాల నుంచి రష్యా సేనలను తరిమికొడుతూ మరిచిపోలేని పరాభవాలను పుతిన్‌కు రుచి చూపిస్తోంది. ఈ నేపథ్యంలో యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసే సూచనలు ఏమాత్రం కన్పించడం లేదు. ఎంతకాలమైనా ఉక్రెయిన్‌కు మద్దతిస్తూనే ఉంటామని అమెరికా అధ్యక్షుడు బైడెన్, రష్యా ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా ఎంత దూరమైనా వెళ్తామంటూ పుతిన్ చేసుకున్న తాజా హెచ్చరికలు దీన్ని మరింత బలపరుస్తున్నాయి. ఉక్రెయిన్, రష్యాలనే గాక ప్రపంచ దేశాలన్నింటినీ యుద్ధం తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ఐరోపా ఖండంలో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరుగుతున్న అతిపెద్ద ఘర్షణ కూడా ఇదే.

తొలిసారేమీ కాదు..

ఉక్రెయిన్, రష్యా మధ్య ఘర్షణలు ఇదే తొలిసారేమీ కాదు. వెయ్యేళ్ల చరిత్ర, 4.4 కోట్ల జనాభా ఉన్న ఉక్రెయిన్ ఒకప్పుడు సోవియట్ యూనియన్(యూఎస్ఎస్ఆర్)లో అంతర్భాగమే. సోవియట్ పతనానంతరం 1990ల్లో స్వతంత్ర దేశంగా అవతరించింది. పశ్చిమ దేశాల కుట్రల వల్లే ఉక్రెయిన్ తమకు దూరమైందని రష్యా ద్వేషం పెంచుకుంది. పాశ్చాత్య దేశాల చేతుల్లో ఉక్రెయిన్ కీలుబొమ్మ అని పుతిన్ తరచుగా విమర్శిస్తుంటారు. ఉక్రెయిన్ కృత్రిమంగా ఏర్పడ్డ దేశమని, నిజానికి అది, రష్యా ఒకే తల్లి బిడ్డలని ఆయన వాదిస్తుంటారు. రెండు దేశాలను ఎలాగైనా ఒక్కటి చేయాలన్నదే పుతిన్ ఆశయం. అందులో భాగంగానే 2014లో ఉక్రెయిన్‌కు చెందిన క్రిమియా ద్వీపకల్పాన్ని రష్యా ఆక్రమించింది. ఆ ఘర్షణలో ఇరువైపులా వేలాది మంది మరణించారు. మరోవైపు ఉక్రెయిన్‌లో గణనీయంగా ఉన్న రష్యన్ మాట్లాడే ప్రజలు రష్యాకు మద్దతుగా తిరుగుబాటుకు దిగారు. పరిస్థితి చెయ్యి దాటిపోతుండడం, రష్యా నుంచి ముప్పు పెరుగుతుండటంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పశ్చిమ దేశాల సాయం కోరారు. రష్యా బారినుంచి కాపాడేందుకు తమను తక్షణం నాటో కూటమిలో చేర్చుకోవాలన్న ఆయన విజ్ఞప్తికి సానుకూలత వ్యక్తమైంది. అదే జరిగితే నాటో సేనలు ఏకంగా రష్యా సరిహద్దుల్లో తిష్టవేసే ఆస్కారముండటం అధ్యక్షుడు పుతిన్‌కు ఆగ్రహం కలిగించింది. వెంటనే రంగంలోకి దిగి 2021 నవంబర్ నాటికే ఉక్రెయిన్ సరిహద్దులకు భారీగా సైన్యాన్ని తరలించారు. 2022 ఫిబ్రవరికల్లా దాన్ని లక్షకు పెంచి తీవ్ర ఉద్రిక్తతలకు తెర తీశారు. ఉక్రెయిన్‌పై దాడి తప్పదన్న వార్తల నడుమ, తీవ్ర పరిణామాలు, కఠిన ఆంక్షలు తప్పవని అమెరికా హెచ్చరించింది. తమకలాంటి ఉద్దేశం లేనే లేదంటూనే ఫిబ్రవరి 24న ఉక్రెయిన్‌పై పుతిన్ సైన్యం మూడువైపుల నుంచీ విరుచుకుపడింది.

- సాక్షి, నేషనల్ డెస్క్



శిథిల చిత్రంగా ఉక్రెయిన్

రష్యా దాడుల ధాటికి ఉక్రెయిన్ సర్వం కోల్పోయి శిథిలచిత్రంగా మిగిలింది. ఎక్కడ చూసినా కూలిన భవనాలు, మృతదేహాలతో మరుభూమిని తలపించింది. ఐక్యరాజ్యసమితికి శరణార్థుల హై కమిషనర్ విడుదల చేసిన గణాంకాల ప్రకారమే 2023 జనవరి 15 నాటికి రష్యా దాడుల్లో 7,000కు పైగా ఉక్రెయిన్ పౌరులు మరణించారు. 11 వేలకు పైగా క్షతగాత్రులయ్యారు. వాస్తవానికి కనీసం 50 వేల మందికి పైగా అమాయక పౌరులు యుద్ధానికి బలయ్యారని, లక్షలాది మంది గాయపడ్డారని అంచనా. 80 లక్షల మందికిపైగా ఉక్రెయిన్ పౌరులు శరణార్థులుగా ఇతర దేశాలకు వలసవెళ్లారు. వారంతా కట్టుబట్టలతో ఇల్లూ వాకిలీ వదిలి తరలిపోతున్న దృశ్యాలు మానవతకే తీరని మచ్చగా మిగిలాయి. మరో 60 లక్షల మంది స్వదేశంలోనే నిరాశ్రయుల య్యారు.

రష్యా అతలాకుతలం

రష్యా కూడా ఉక్రెయిన్ చేతిలో అవమానకర ఎదురుదెబ్బలు మినహా ఇప్పటిదాకా ఇప్పటిదాకా బావుకున్నదేమీ లేదు. పైపెచ్చు యుద్ధం వల్ల రష్యా ఆర్థిక వ్యవస్థ ఎన్నడూ లేనంతగా దిగజారింది. అమెరికా, పాశ్చాత్య దేశాల తీవ్ర ఆర్థిక ఆంక్షలతో పూర్తిగా స్తంభించి కుదేలైంది. ఆర్థిక వృద్ధి నేలచూపులు చూస్తోంది. అంతర్జాతీయ సంస్థలన్నీ దేశం వీడాయి. చమురు మినహా ఎగుమతులు, దిగుమతులు పూర్తిగా పడకేశాయి. ద్రవ్యోల్బణం, నిత్యావసరాల ధరలు చుక్కలనంటి సామాన్యుల బతుకు దుర్భరంగా మారింది. దాంతో యుద్ధంపై రష్యాలోనే తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఎన్నడూ లేని రీతిలో పౌరులు బాహాటంగానే ప్రభుత్వంపై విమర్శలకు దిగారు. వేలాదిగా అరెస్టులు జరిగినా వెరవకుండా ఆందోళనలు చేశారు.

యుద్ధంతో వాటిల్లిన నష్టం

	రష్యా	ఉక్రెయిన్
సైనికులు	2 లక్షలకు పైగా	1 లక్షకు పైగా
ప్రధాన యుద్ధ ట్యాంక్‌లు	3,334	7,960
ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ సిస్టమ్స్	243	405
యుద్ధ విమానాలు	299	386
హెలికాప్టర్లు	287	210
వాహనాలు/ఇంధన ట్యాంకులు	5,212	8,472
యుద్ధ నౌకలు/పడవలు	18	..
డ్రోన్‌లు	2,026	3,203

దేశాల్లో ఆకలి కేకలు

గోధుమలు, మొక్కజొన్న ఎగుమతిలో అగ్రస్థానాన ఉన్న రష్యా, ఉక్రెయిన్ నుంచి యుద్ధం కారణంగా తిండి గింజల సరఫరా పూర్తిగా నిలిచిపోయి 50కి పై చిలుకు దేశాలు తీవ్ర ఆహార కొరత బారిన పడి అల్లాడుతున్నాయి. అంతేగాక అటు సంపన్న, ఇటు భారత్ వంటి వర్ధమాన దేశాల ఆర్థిక వ్యవస్థలు యుద్ధం వల్ల ఎంతగానో దెబ్బ తిన్నాయి.

సాహసి... జెలెన్‌స్కీ

రష్యాకు ఎదురొడ్డి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మొక్కవోని ధైర్య సాహసాలు ప్రదర్శించారు. తనను హతమార్చేందుకు జరిగిన ప్రయత్నాలను కాచుకున్నారు. సురక్షితంగా తప్పిస్తామంటూ అమెరికా ముందుకొచ్చినా కాదన్నారు. సైన్యంతో కలివిడిగా తిరుగుతూ వారిలో స్థైర్యం నింపారు. ప్రపంచ దేశాలను సాయం కోరుతూ ప్రతి అంతర్జాతీయ వేదిక మీదా రష్యాను దునుమాడుతూ సాగారు. పూర్వాశ్రమంలో సినిమాల్లో కమేడియన్‌గా చేసినా నిజ జీవితంలో మాత్రం అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో తిరుగులేని నాయకత్వ లక్షణాలు ప్రదర్శించి హీరో అనిపించుకున్నారు.

ఎవరికెంత నష్టం?

యుద్ధంలో విజేతలు ఎవరో ఇప్పటిదాకా తేలకపోయినా ఇరు దేశాలు మాత్రం కనీవినీ ఎరుగని స్థాయిలో నష్టాన్ని చవి చూశాయి. లక్షల సంఖ్యలో సైనికులను, వేల సంఖ్యలో యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ ట్యాంకులు, నౌకలను కోల్పోయాయి.

ఏ దేశం ఎవరి వైపు...

అమెరికా బ్రిటన్ సహా 30 నాటో సభ్య దేశాలు యుద్ధంలో ఉక్రెయిన్‌కు పూర్తిగా వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. భారీగా ఆయుధ, ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నాయి. వీటితో పాటు మరెన్నో దేశాలు రష్యా దాడిని ఖండించి ఉక్రెయిన్‌కు నైతిక మద్దతు ప్రకటించాయి. ఇక రష్యాకు ప్రధానంగా పొరుగు దేశమైన బెలారస్ తొలినుంచీ గట్టి మద్దతుదారుగా ఉంది. చైనాతో పాటు ఉత్తర కొరియా, క్యూబా, వెనెజువెలా, ఇరాన్, సిరియా, కిర్గిస్తాన్ కూడా రష్యాకు మద్దతు ప్రకటించాయి. యూఏఈ, సౌదీ అరేబియా తటస్థంగా నిలిచినా రష్యా దాడిని ఖండించేందుకు తిరస్కరించాయి. యుద్ధానికి తక్షణం ముగింపు పలికి చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలన్నది తొలినుంచీ భారత్ వైఖరిగా ఉంది.

యుద్ధంలో కీలక మలుపులు

ఫిబ్రవరి: 24న యుద్ధం ప్రారంభం. ఉక్రెయిన్ నిస్సైనికీకరణకు సైనిక చర్య ముసుగులో తూర్పు, ఉత్తర, దక్షిణాల నుంచి రష్యా ముప్పేట దాడి.

మార్చి: ఖెర్సన్ నగరం స్వాధీనమైందన్న రష్యా. యూరప్‌లోకెల్లా పెద్దదైన జపోరిజియా అణు విద్యుత్కేంద్రం ఆక్రమణ. కీవ్ శివార్లలో ఉక్రెయిన్ డ్రోన్ల దాడిలో అపార నష్టం ధాటికి రష్యా సేనల పలాయనం. రష్యాపై అమెరికా, యూరప్ దేశాల భారీ ఆర్థిక, తదితర ఆంక్షలు.

ఏప్రిల్: కీవ్, బుచాల్లో వందలాది పౌరులను రష్యా సైన్యం చిత్రహింసల పాలు చేసి చంపినట్టు వెల్లడి. రష్యాపై యుద్ధ నేరాల అభియోగాలు మోపాలంటూ ప్రపంచవ్యాప్తంగా డిమాండ్లు. ఉక్రెయిన్ సైన్యం ఎదురుదాడి. రష్యా యుద్ధ నౌక మాస్క్‌వాను క్షిపణి దాడితో నల్లసముద్రంలో ముంచి సంబరాలు చేసుకున్న ఉక్రెయిన్.

మే: మారియుపోల్‌ను పూర్తిగా ఆక్రమించుకున్న రష్యా. రష్యా దూకుడు పట్ల ఆందోళనతో నాటోలో చేరుతామంటూ దరఖాస్తు చేసుకుని పుతిన్‌కు షాకిచ్చిన ఫిన్లండ్, స్వీడన్.

జూన్: ఉక్రెయిన్ దాడుల దెబ్బకు యుద్ధం మొదట్లో నల్లసముద్రంలో ఆక్రమించిన స్నేక్ ఐలాండ్ నుంచి వైదొలిగిన రష్యా సేనలు.

జూలై: ప్రపంచ ఆహార భద్రత దృష్ట్యా ఉక్రెయిన్ రేవు పట్టణాల నుంచి ఆహార ధాన్యాల సరఫరా.

ఆగస్టు: క్రిమియాపై ఉక్రెయిన్ దాడుల్లో తీవ్రంగా దెబ్బ తిన్న రష్యా వైమానిక స్థావరాలు, ఆయుధాగారాలు.

సెప్టెంబర్: ఖర్కీవ్‌లో ఆకస్మిక దాడులతో రష్యా దళాలను తరిమికొట్టిన ఉక్రెయిన్ సైన్యం. రిఫరెండం ముసుగులో డొనెట్స్క్, లుహాన్స్క్, ఖెర్సన్, జపోరిజియా ప్రాంతాలను రష్యాలో విలీనం చేసుకుంటున్నట్టు పుతిన్ ప్రకటన.

అక్టోబర్: క్రిమియాను రష్యాతో కలిపే కీలక బ్రిడ్జిని పేల్చేసిన ఉక్రెయిన్.

నవంబర్: రష్యాకు పరాభవం. దాడులకు తాళలేక ఖెర్సన్ నగరం నుంచి పుతిన్ సేనల పలాయనం.

డిసెంబర్: రష్యాలోని సరిహద్దు ప్రాంతాలు, పట్టణాలు, నగరాలపై దాడులు, భారీ నష్టం.

2023 జనవరి: మకీవ్కాలో క్షిపణి దాడులతో వందలాది మంది రష్యా సైనికులను మట్టుబెట్టామన్న ఉక్రెయిన్. 89 మంది మరణించారన్న రష్యా.

ఢిల్లీ మేయర్ పీఠం ఆప్‌దే

మేయర్‌గా షెల్లీ ఒబెరాయ్, డిప్యూటీ మేయర్‌గా ఇక్బాల్ ఎన్నిక



షెల్లీ, ఇక్బాల్ విజయానందం

న్యూఢిల్లీ: గతంలో పలుమార్లు వాగ్వాదాలు, వాయిదాలతో అర్ధంతరంగా ముగిసి సుప్రీంకోర్టుదాకా వెళ్లిన ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్(ఎంసీడీ) మేయర్ ఎన్నిక ఘట్టం ఎట్టకేలకు బుధవారం సజావుగా ముగిసింది. బీజేపీ అభ్యర్థి రేఖా గుప్తాపై ఆప్ మహిళా అభ్యర్థి షెల్లీ ఒబెరాయ్ 34 ఓట్ల తేడాతో నెగ్గి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. 266 ఓట్లు పోలవగా షెల్లీకి 150, గుప్తాకు 116 ఓట్లు దక్కాయి. నామినేటెడ్ సభ్యులకూ ఓటింగ్ హక్కు ఉందంటూ బీజేపీ కార్పొరేటర్లు వాదించడం, అందుకు ఒప్పుకునేది లేదంటూ మెజారిటీ సభ్యులైన ఆప్ కార్పొరేటర్లు వాగ్వాదానికి దిగడంతో ఢిల్లీలోని సివిక్ సెంటర్ భవనంలో మేయర్, డెప్యూటీ మేయర్, ఆరుగురు స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ గతంలో మూడుసార్లు అర్ధంతరంగా వాయిదాపడిన సంగతి తెల్సిందే. మేయర్ ఎన్నికలపై తేల్చాలంటూ ఆప్ అభ్యర్థి గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ) వీకే సక్సేనా నామినేట్ చేసిన సభ్యులకు ఓటింగ్ హక్కులు ఉండబోమని సర్వోన్నత న్యాయస్థానం ఫిబ్రవరి 17న తేల్చిచెప్పడంతో మేయర్ ఎన్నిక కోసం సభను సమావేశపరచాలని ఎల్‌జీ ఆదేశాలివ్వడం, ఎన్నికల్లో ఆప్ అభ్యర్థి జయకేతనం ఎగరేయడం చకచకా జరిగిపోయాయి. డెప్యూటీ మేయర్‌గా ఆప్ అభ్యర్థి అలే మొహమ్మద్ ఇక్బాల్ గెలిచారు. 'అల్లరి మూక ఓడిపోయింది. ప్రజలే గెలిచారు' అని బీజేపీనుద్దేశిస్తూ ఎన్నికల తర్వాత ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా హిందీలో ట్వీట్‌చేశారు. ఎంసీడీ తొలి మేయర్‌గా ఎన్నికైన 39 ఏళ్ల షెల్లీ ఆప్ మహిళా అభ్యర్థిగా తూర్పు పటేల్‌నగర్ వార్డు నుంచి గెలిచారు. గతంలో ఈమె ఢిల్లీ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఇగ్నోలో డాక్టరేట్ చేశారు. ఇండియన్ కామర్స్ అసోసియేషన్(ఐసీఏ)లో బంగారు పతకం సాధించారు.

బీజేపీ, ఆప్ సభ్యుల బాహాబాహీ

స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికపై రగడ

మేయర్, డెప్యూటీ మేయర్ ఎన్నిక తర్వాత సభను చాలాసేపు వాయిదావేశారు. సాయంత్ర ఆరు గంటలు అవుతున్నా సభ మొదలుకాకపోవడంతో బీజేపీ సభ్యులు హనుమాన్ చాలీసా చదువుతూ గడిపారు. 6.15గంటలకు సభ మొదలై స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ప్రక్రియ మొదలుపెట్టారు. పోలింగ్ ప్రాంతానికి మొబైల్ ఫోన్లను మేయర్ అనుమతించడాన్ని బీజేపీ సభ్యులు తీవ్రంగా తప్పుపడుతూ వెల్‌లోకి దూసుకొచ్చారు. దీంతో ' సభా మర్యాదలు పాటించని వారికి బయటకు పంపిస్తాం' అని మేయర్ షెల్లీ గద్దించారు. మేయర్, డెప్యూటీ మేయర్ ఎన్నికల్లో అనుమతించని ఫోన్లు, పెన్నులను ఇప్పుడెలా అనుమతిస్తారని బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో సభను వాయిదావేస్తున్నట్లు 6.35గంటలకు మేయర్ ప్రకటించారు. అప్పటికే చాలా మంది తమ ఓటు వేశారు. స్టాండింగ్ కమిటీలో ఆరు స్థానాల కోసం ఏడుగురు బరిలో నిలిచారు. మళ్లీ 7.40 గంటలకు ఎవరెవరి దగ్గర బ్యాలెట్ పేపర్లు ఉన్నాయో వాటిని అన్నింటిని తిరిగి ఇచ్చేయాలని, అప్పుడు తన తదుపరి నిర్ణయం చెప్తానని మేయర్ అన్నారు. దీంతో బీజేపీ సభ్యులు పెద్దపెట్టున నినదాలతో నిరసన తెలుపుతూ వెల్‌లోకి దూసుకొచ్చారు. ఇరు పార్టీల సభ్యులు పరస్పరం తోపులాటకు దిగారు. వాటర్ బాటిళ్లు విసురుకున్నారు. దాంతో సభ వాయిదా పడింది. రాత్రి 9.30కి తిరిగి మొదలైనా గందరగోళం కొనసాగింది.

ఐపీఎస్ రూపా మౌద్గిల్‌ను కట్టడి చేయండి

కోర్టును ఆశ్రయించిన రోహిణి సింధూరి

బెంగళూరు: కర్ణాటకలో ఐపీఎస్ అధికారి రూపా మౌద్గిల్, ఐఏఎస్ అధికారి రోహిణి సింధూరి మధ్య సమరం కొనసాగుతోంది. సోషల్ మీడియాలో పరస్పరం తీవ్ర ఆరోపణలు చేసుకోవడంతో వారిని ప్రభుత్వం బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఇద్దరికీ పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. తన గురించి తప్పుడు ప్రచారం చేయకుండా, సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టకుండా నిషేధం విధించాలని కోరుతూ రోహిణి సింధూరి బెంగళూరులోని సిటీ సివిల్, సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. ఆమె తన పిటిషన్‌లో రూపా మౌద్గిల్‌తోపాటు 60 మంది పేర్లను ప్రస్తావించారు. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. రూపా మౌద్గిల్‌ను, సోషల్ మీడియాను కట్టడి చేసేలా ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేయాలని రోహిణి తరఫు న్యాయవాది కోరారు. సర్వీసు రూల్స్ ప్రకారం రోహిణి ఇప్పటికే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారని, పోలీసులకు కూడా ఫిర్యాదు సమర్పించారని న్యాయస్థానం గుర్తుచేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

కులవివక్షను నిషేధించిన సియాటిల్

- తొలి అమెరికా నగరంగా ఘనత
- ఈ నిర్ణయంపై మిశ్రమ స్పందన



క్షమా సావంత్

వాషింగ్టన్: కులవివక్షను నిషేధిస్తూ అమెరికాలోని సియాటిల్ నగరం చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. అగ్ర రాజ్యంలో ఈ చర్య తీసుకున్న తొలి నగరంగా నిలిచింది. ఈ మేరకు భారత సంతతికి చెందిన నేత, ఆర్థికవేత్త క్షమా సావంత్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని స్థానిక కౌన్సిల్ భారీ మెజారిటీతో ఆమోదించింది. నగర వివక్ష వ్యతిరేక విధానంలో కులాన్ని కూడా జోడిస్తూ నిర్ణయం తీసుకుంది. అనంతరం సావంత్ మీడియాతో మాట్లాడారు. కులవివక్ష వ్యతిరేక తీర్మానం భారీ మద్దతుతో ఆమోదం పొందిందని హర్షాతిరేకాల నడుమ వెల్లడించారు. ''అమెరికాలో కుల వివక్షపై పోరాటంలో ఇదో కీలక ముందడుగు. ఇక దీన్ని దేశవ్యాప్తంగా విస్తరించేలా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరముంది'' అని ఆమె అభిప్రాయపడ్డారు. ఇది చరిత్మాత్మక నిర్ణయమని సియాటిల్ టైమ్స్ వార్తా పత్రిక కొనియాడింది. ''ఈ రోజు కోసం హత్య, అత్యాచార బెదిరింపులెన్నింటినో తట్టుకుంటూ ముందుకు సాగాం. అంతిమంగా ద్వేషంపై ప్రేమ గెలిచింది'' అని తాజా నిర్ణయం వెనక కీలకంగా వ్యవహరించిన ఈక్వాలిటీ ల్యాబ్స్ అనే స్వచ్ఛంద సంస్థ పేర్కొంది. భారత్‌లో కులవివక్షను 1948లో నిషేధించారు. 1950లో రాజ్యాంగంలో పొందుపరిచారు.

పలు సంస్థల వ్యతిరేకత!

సియాటిల్ కౌన్సిల్ నిర్ణయాన్ని హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) వంటి సంస్థలు వ్యతిరేకిస్తున్నాయి! ''ఈ విషయంలో కేవలం దక్షిణాసియావాసులను మాత్రమే లక్ష్యం చేసుకున్నారు. ఇలా వివక్ష వ్యతిరేక విధానంలో కులాన్ని జోడించడం అసంబద్ధం'' అని హెచ్ఏఎఫ్ సహ వ్యవవస్థాపకుడు సుహాగ్ శుక్లా ఆరోపించారు. ''ఈ ముసుగులో దక్షిణాసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికావాసులతో మిగతా వారి కంటే భిన్నంగా వ్యవహరించనున్నారు. ఈ కుటిల యత్నాలకు ఈ ఓటింగ్ ద్వారా ఆమోదముద్ర పడింది'' అంటూ దుయ్యబట్టారు. ఇదో ప్రమాదకరమైన తప్పుడు చర్య అని సంస్థ ఎండీ సమీర్ కల్రా అభిప్రాయపడ్డారు. ఈ చర్య సియాటిల్‌లోని దళిత బహుజనులకు కచ్చితంగా హాని చేసేదేనని అంబేడ్కర్–పూలే నెట్‌వర్క్ ఆఫ్ అమెరికన్ దళిత్స్ అండ్ బహుజన్స్‌కు చెందిన టీ.మధు ఆరోపించారు. ఇలా కులాన్ని విధాన నిర్ణయంలో భాగం చేయడం స్థానికుల్లో హిందువుల పట్ల ఉన్న భయాన్ని (హిందూఫోబియా)ను మరింత పెంచుతుందని అమెరికాలోని భారత సంతతివారు ఆందోళన చెందుతున్నారు. హిందువులను భయ భ్రాంతులను చేసే యత్నాల్లో భాగంగా అమెరికాలో గత మూడేళ్లలో పది హిందూ ఆలయాలు, గాంధీ, శివాజీ వంటి ఐదు విగ్రహాల విధ్వంస చర్యలు చోటుచేసుకున్నాయి. 2018 అమెరికన్ కమ్యూనిటీ సర్వే ప్రకారం అక్కడ ఉంటున్న భారత సంతతి వ్యక్తుల సంఖ్య 42 లక్షల పై చిలుకే. అమెరికా ఎప్పుడూ కులవ్యవస్థను అధికారికంగా గుర్తించకపోయినా అక్కడి దక్షిణాసియావాసులు ఉన్నత విద్యా సంస్థల్లో, పనిచేసే చోట కులవివక్షను ఎదుర్కొన్న ఉదంతాలెన్నో ఉన్నాయి.

పర్యావరణ పరిరక్షణ మన విధి: మోదీ

న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణ అనేది భారత్‌కు అంకితభావంతో నిర్వర్తించే విధి తప్ప బలవంతంగా చేసే పని కాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ప్రకృతి, అభివృద్ధి అనేవి కలిసి ముందుకు సాగాలని తాను నమ్ముతున్నట్లు చెప్పారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అవసరాలను పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల నుంచి తీర్చుకోవాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ఇచ్చిన సందేశాన్ని ద ఎనర్జీ, రిసోర్సెస్ ఇనిస్టిట్యూట్(టీఈఆర్ఐ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వరల్డ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సదస్సు(డబ్ల్యూఎస్‌డీఎస్)లో చదివి వినిపించారు. నగరాలు, పట్టణాలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఆధునిక సాంకేతికత, నవీన ఆవిష్కరణ ద్వారా పరిష్కార మార్గాలు కనుగొంటున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. భూమిని తల్లిగా, మనమంతా ఆ తల్లి బిడ్డలమని మన ప్రాచీన గ్రంథాలు అభివర్ణించాయని గుర్తుచేశారు. పర్యావరణ పరిరక్షణలో మన దేశం ముందంజలో నిలుస్తోందని హర్షం వ్యక్తం చేశారు.





మేఘాలయలో సంప్రదాయ వస్త్రధారణతో ఎన్నికల ప్రచారంలో మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ

ఈసీ నిర్ణయంపై స్టే ఇవ్వలేం: సుప్రీం

ఉద్ధవ్ వర్గానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: శివసేన పార్టీలోని ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఏక్‌నాథ్ షిండే వర్గమే అసలైన శివసేన పార్టీ అంటూ కేంద్ర ఎన్నికల సంఘం వెలువర్చిన నిర్ణయం అమలుపై స్టే ఇవ్వడం కుదరదని బుధవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం తేల్చిచెప్పింది. పార్టీ స్థిరచరాస్తులు, బ్యాంక్ ఖాతాలను షిండే వర్గానికి దక్కకుండా నిలువరిస్తూ 'యథాతథ' స్థితి ఉత్తర్వులు ఇవ్వాలన్న ఠాక్రే వర్గం విజ్ఞప్తిని కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. అయితే, ఠాక్రే వర్గం ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను అనర్హులుగా ప్రకటిస్తూ అసలైన పార్టీ హోదాలో షిండే వర్గం చేసే అనర్హత ప్రక్రియ/విప్ లాంటివి జరగకుండా చూస్తామని కోర్టు సూచనప్రాయంగా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో ఫిబ్రవరి 26న జరిగే ఉప ఎన్నికల్లో ఠాక్రే వర్గం 'ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే' పేరును, ఎన్నికల గుర్తుగా 'వెలిగే కాగడా'ను వినియోగించుకునేందుకు అనుమతి ఇచ్చింది. పార్టీ, పార్టీ గుర్తు అయిన విల్లు, బాణం సైతం సీఎం షిండే వర్గానికే దక్కుతాయని ఈసీ నిర్ణయించడం తెల్సిందే.

అమెరికా అధ్యక్ష బరిలో వివేక్



వాషింగ్టన్: భారతీయ మూలాలున్న అమెరికన్ యువ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామి ఆ దేశ అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నారు. నిక్కీ హేలీ తర్వాత రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం బరిలో నిలిచిన భారతీయ మూలాలున్న రెండో భారతీయుడు వివేక్ కావడం విశేషం. 37 ఏళ్ల వివేక్ తల్లిదండ్రులు గతంలో కేరళ నుంచి అమెరికాకు వలసవచ్చారు. డొనాల్డ్ ట్రంప్‌కు పోటీగా దక్షిణ కరోలినా మాజీ గవర్నర్, ఐరాసలో అమెరికా మాజీ రాయబారి నిక్కీ హేలీ ఇటీవలే పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడుతున్నట్లు ప్రకటించి ప్రచారం మొదలుపెట్టడం తెల్సిందే. 'అమెరికాను మళ్లీ అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తా. అంతకుముందు మనం అమెరికా గొప్పదనాన్ని మరోసారి పునశ్చరణ చేసుకుందాం. చైనా ఆధిపత్యం వంటి సవాళ్లను అమెరికా ఎదుర్కొంటోంది. అమెరికా సార్వభౌమత్వాన్ని చైనా ఉల్లంఘిస్తోంది. ఒక వేళ రష్యా నిఘా బెలూన్ వచ్చి ఉంటే కూల్చి వెంటనే ఆంక్షలు విధించేవాళ్లం. చైనా విషయంలో ఆంక్షలు ఎందుకు విధించలేకపోయాం?. ఎందుకంటే ఆధునిక ప్రపంచంలో ఉత్పత్తుల కోసం చైనాపై మనం అంతలా ఆధారపడ్డాం. ఆర్థికంగా ఇలా మరో దేశంపై ఆధారపడే పరిస్థితికి చరమగీతం పాడదాం' అని ఫాక్స్‌న్యూస్ ప్రైమ్‌టైమ్ షో సందర్భంగా వివేక్ వ్యాఖ్యానించారు. వివేక్ 2014లో రోవంట్ సైన్సెస్‌ను స్థాపించారు. హెల్త్‌కేర్, టెక్నాలజీ సంస్థలను స్థాపించి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. 2022లో స్ట్రైవ్ అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థనూ నెలకొల్పారు. అధ్యక్ష అభ్యర్థిగా బరిలో దిగాలంటే ముందుగా వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ, డొనాల్డ్ ట్రంప్‌లలో ఎవరో ఒకరు రిపబ్లిక్ పార్టీలో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నెగ్గాలి. వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్రక్రియ మొదలుకానుంది. అధ్యక్ష ఎన్నికలు వచ్చే ఏడాది నవంబర్ ఐదో తేదీన జరుగుతాయి. 2016లో బాబీ జిందాల్, 2020లో కమలాహ్యారిస్, ఈసారి నిక్కీ హేలీ తర్వాత అధ్యక్ష ఎన్నికలకు దిగిన నాలుగో ఇండో–అమెరికన్ వివేక్ రామస్వామికావడం విశేషం.

మార్గమధ్యంలో ఆయిల్ లీకేజీ

స్టాక్‌హోమ్‌లో ఎయిర్‌ఇండియా విమానం అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: అమెరికాలోని నెవార్క్ నుంచి ఢిల్లీకి బయల్దేరిన ఎయిర్‌ఇండియా విమానం.. ఇంజన్ నుంచి ఆయిల్ లీకేజీ ఘటనలో కొద్దిసేపు కలకలం రేపింది. వెంటనే విమానాన్ని స్టాక్‌హోమ్‌లోని విమానాశ్రయంలో అత్యవసరంగా దింపేశారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) తెలిపింది. ఎయిర్‌ఇండియాకు చెందిన బోయింగ్ 777–300 ఈఆర్ రకం విమానం 19 మంది సిబ్బందిసహా 311 మందితో నెవార్క్ నుంచి బయల్దేరింది. మార్గమధ్యంలో హఠాత్తుగా ఒక ఇంజిన్ నుంచి ఆయిల్ కారుతుండటంతో ఇంజిన్‌ను ఆపేశారు. మరొక ఇంజన్ మీదనే నడిపిస్తూ వెంటనే దగ్గర్లోని స్టాక్‌హోమ్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండ్‌చేశారు. సోమవారం సైతం ఎయిర్‌ఇండియాకు చెందిన విమానం న్యూయార్క్ నుంచి ఢిల్లీకి వస్తూ మార్గమధ్యంలో మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా లండన్‌లో ల్యాండ్ అయింది.

సిసోడియాను విచారించండి

రాజకీయ నిఘా కేసులో సీబీఐకి కేంద్ర హోం శాఖ అనుమతి

న్యూఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ పరిధి(జీఎన్‌సీటీడీ)లోని శాఖలు, స్వతంత్ర సంస్థలు, విభాగాలు చేపట్టే పనుల్లో అవినీతిపై నిఘా, 'ట్రాప్' కేసుల కోసం ఉద్దేశించిన ఫీడ్‌బ్యాక్ యూనిట్(ఎఫ్‌బీయూ)ను దుర్వినియోగం చేశారని, ఆ ఉదంతంలో ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను విచారించాలంటూ సీబీఐని కేంద్ర హోం శాఖ ఆదేశించింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం, 1988 కింద కొత్తగా ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కార్యాలయానికి దర్యాప్తు అనుమతుల ఉత్తర్వులు పంపింది. దీన్ని పిరికిపంద చర్యగా సిసోడియా అభివర్ణించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం : 23 : ఫిబ్రవరి : 2023



హాజరు అంతంతే

బడికి వెళ్లమంటే బాలలు మారాం చేస్తారు. శాసనసభ్యులు కూడా అంతేనా? బుధవారం విధానసభ ఎమ్మెల్యేలు లేక బోసిపోయిన దృశ్యం

న్యూస్‌రీల్

మోదీని చూస్తే కాంగ్రెస్‌కు వణుకు: కుమార

శివమొగ్గ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని చూస్తే కాంగ్రెస్ పార్టీ నేతలు నిద్రలో కూడా భయపడతారని జేడీఎస్ నేత, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి ఎద్దేవా చేశారు. శివమొగ్గ గ్రామీణ నియోజకవర్గంలో బుధవారం పంచరత్న యాత్రలో పాల్గొన్న కుమారస్వామి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులకు నరేంద్రమోదీ తప్పించి వేరే ఎవరూ కనిపించరని, మోదీ భజన తప్పించి వారికి వేరే విషయం ఏమి లేదని విమర్శించారు. ఆపరేషన్ కమల గురించి బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. బీజేపీకి బీ టీం జేడీఎస్ పార్టీ అని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సుర్జేవాలా చెప్పడంపై ఆయనకు సిగ్గుండాలని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తుది దశకు చేరుకుందని, ఈ విధమైన మాటల ద్వారా మరింత దిగజారిపోతుందని అన్నారు.

అపహరణకు గురైన ఆర్టీసీ బస్సు లభ్యం

- తెలంగాణలో వదిలేసిన దొంగలు



దొరికిన బస్సు

రాయచూరు రూరల్: కర్ణాటకలో అదృశ్యమైన కేఎస్ ఆర్టీసీ బస్ తెలంగాణలో దొరికింది. కలబుర్గి డివిజన్‌లోని కలబుర్గి జిల్లా చించోళి బస్టాండ్‌లో నిలిపిన కళ్యాణ కర్ణాటక ఆర్టీసీ బస్సును దొంగలు నకిలీ తాళాలతో స్టార్ట్ చేసుకుని ఉడాయించారు. బీదర్ రెండవ డిపోకు చెందిన కేఏ 38 ఎఫ్ 971 బస్సు ఇది. బీదర్ నుంచి చించోళికి వచ్చి తెల్లవారుజామున 3.30 గంటలకు బస్సు మాయమైంది. మంగళవారం విధులకు వెళ్లాలని డ్రైవర్, కండక్టర్ వచ్చి చూడగా బస్సు లేకపోవడంతో కంగుతిన్నారు. పలుచోట్ల గాలించి చివరకు చించోళి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పలు మార్గాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించి బస్సు వెళ్లిన దిశను గుర్తించారు. బస్సు బుధవారం తెలంగాణలోని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తాండూరు తాలూకా భూకైలాస తాండాలో లభించింది. దొంగల ఆచూకీ కోసం వెతుకుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతన్న ఉసురు తీసిన అప్పులు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

తుమకూరు: కొరటగెరె తాలూకా చెన్నరాయన దుర్గ హోబళి బెండోణె గ్రామానికి చెందిన సిద్ధరాజు నరసింహయ్య (45) అనే రైతు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. బెండోణె గ్రామంలోని పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని మరణించాడు. ఆయన కొరటగెరె కెనరా బ్యాంకులో వ్యవసాయం కోసం రూ. 5 లక్షల పైగా అప్పు చేశాడు. వీఎస్ఎస్ఎన్ బెండోణె శాఖలో రూ. లక్ష, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ సంస్థ నుంచి రూ. 70 వేలు, అనారోగ్య కారణాల కోసం ఇతర వ్యక్తుల నుంచి మరికొంత మొత్తాలు కలిపి రూ.12 లక్షల వరకు రుణభారం పేరుకుపోయింది. అప్పులు తీర్చాలని బ్యాంకు నుంచి నోటీసులు, ఒత్తిడులు ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో అప్పులు తీర్చలేక, కుటుంబాన్ని ఎలా పోషించాలనే ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ పోలీసులు పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

రాజకాలువల శుభ్రతకు టెండర్లు



కమిషనర్ తుషార్ గిరినాథ్

బనశంకరి: బెంగళూరు నగరంలో అన్ని జోన్లలో ఉన్న బ్యానర్లు, ఫ్లెక్సీలను తొలగించామని, అధికారులు నిర్లక్ష్యం చూపితే వారిపై చర్యలు తప్పవని బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. బుధవారం రాజకాలువల పూడిక తీత పట్ల విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన జవాబిస్తూ నిరంతరం రాజకాలువలను శుభ్రం చేయాలని, నగరంలో 90 కిలోమీటర్లు పొడవుతో రాజకాలువ ఉంది. దీని పనుల కోసం టెండరు పిలిచి ఆయా నియోజకవర్గాల వారీగా కాంట్రాక్టర్లను నియమించామని తెలిపారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు మూడేళ్ల వరకు రాజకాలువ స్వచ్ఛతను చూసుకుంటారని చెప్పారు. వర్షాకాల సమయంలో రాజకాలువలను శుభ్రం చేస్తారు, తరువాత కూడా స్వచ్ఛత పనులు కొనసాగిస్తారని తెలిపారు. మార్చి మొదటివారంలో బీబీఎంపీ బడ్జెట్ ను ప్రవేశపెడతామని చెప్పారు.

సమసిపోని సమరం

- రూప ఫోన్ కాల్‌లో ఘాటు వ్యాఖ్యలు
- ఐపీఎస్ రూప, ఐఏఎస్ రోహిణి వివాదానికి మరింత ఆజ్యం!



ఐఏఎస్ రోహిణి సింధూరి



ఫోన్ కాల్‌లో రచ్చ.. ఐపీఎస్ రూప మౌద్గిల్

బనశంకరి: ఐపీఎస్ రూపా మౌద్గిల్, ఐఏఎస్ రోహిణి సింధూరి మధ్య గత ఆదివారం నుంచి తలెత్తిన సంగ్రామం ఇప్పట్లో సమసిపోయేలా లేదు. రోజుకొక కొత్త మలుపు తిరుగుతూ తీవ్ర చర్చను రేకెత్తిస్తోంది. వివాదం నేపథ్యంలో వారిద్దరికి ఎలాంటి బాధ్యతలు ఇవ్వకుండా సర్కారు బదిలీ చేయడం తెలిసిందే.

కాల్ లీక్ ప్రకంపనలు

తాజాగా రూపా మౌద్గిల్– సామాజిక కార్యకర్త గంగరాజు మధ్య జరిగిన ఫోన్ సంభాషణ ఆడియో బయటపడింది. ఇందులో రూపా తీవ్ర ఆరోపణలు చేయడం ఉంది. కబిని వద్ద ఒక స్థలం డీల్ చేయడానికి భూ రికార్డుల కోసం రోహిణి సింధూరి నా భర్త, ఐఏఎస్ మానీశ్ వద్ద సమాచారం తీసుకుందని రూపా ఆ ఆడియోలో చెప్పారు. రూపా గతంలో చేసిన ఆరోపణలను మళ్లీ ఈ కాల్‌లో ప్రస్తావించారు. ఆడియో మరిన్ని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎమ్మెల్యే సారా మహేశ్ కేసును వెనక్కి తీసుకోవడానికి రాజీకోసం హెచ్‌డీ.కుమారస్వామి, హెచ్‌డీ.దేవేగౌడ, ఇద్దరు ఐఏఎస్‌ల ద్వారా రోహిణి ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెప్పారు. అంతేగాక ఆడియోలో గంగరాజుపైన రూపా ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు ఆమెను సపోర్టు చేస్తున్నారా, నువ్వు ఫైల్ పట్టుకుని పదేపదే ఆమె వద్దకు వెళ్లడం తప్పా ఏముంది, కాల్ రికార్డు చేసుకుంటావా, చేసుకో, నాకు వచ్చే కోపానికి.. అంటూ అసభ్య పదజాలంతో దూషించడం రికార్డయింది.

మైసూరులో ఆడియో విడుదల



మైసూరు: ఐపీఎస్ రూపాతో మాట్లాడిన ఫోన్ కాల్ ఆడియోను బుధవారం మైసూరులో సామాజిక కార్యకర్త గంగరాజు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గొడవ మరింత జటిలమయ్యే సూచనలే ఉన్నాయి. ప్రస్తుతం ఆ ఆడియో హాట్ టాపిక్‌గా మారింది. రోహిణి సింధూరి ఆమె పరిచయాలను ఉపయోగించుకుని భర్త అన్నను బీజేపీలోకి చేర్చాలని చూస్తోంది అని ఆడియోలో రూపా పేర్కొన్నారు. తన భర్త మానీశ్ తీరుపైనా, కుటుంబ వ్యవహారాలపైనా రూపా ఘాటు వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

రూపా నన్ను పావుగా వాడాలని చూశారు

ఈ సందర్భంగా మీడియాతో గంగరాజు మాట్లాడుతూ ఐపీఎస్ రూపా నాపై కోపంతో మాట్లాడారు. నాతో 25 నిమిషాలు మాట్లాడారు. రోహిణి సింధూరికి వ్యతిరేకంగా పోరాటం కోసం నన్ను ఉపయోగించుకునేందుకు ఆమె యత్నించారు. నాకు ఫోన్ చేసి భూ వ్యవహారాల గురించి సీబీఐ అధికారిలా ప్రశ్నించారు, రూపా నా మొబైల్ నుంచి ఫోటో తీసుకుని, వాట్సాప్ చాట్‌ను ఎమ్మెల్యే సా.రా మహేశ్‌కు పంపించారు. నన్ను అసభ్య పదజాలంతో మాట్లాడారు. రోహిణి అక్రమాల గురించి నా వద్ద సాక్ష్యాలు ఉన్నాయని, మీడియా వద్ద వాటి గురించి మాట్లాడు అని చెప్పగా అందుకు నేను నిరాకరించానని ఆయన చెప్పారు. నా కుటుంబానికి ఏమైనా అయితే రూపానే కారణం. అధికారం మాటున ఆమె ఏమైనా చేయొచ్చని ఆయన ఆరోపించారు. ఆమె నా రాకపోకలను, కార్యకలాపాలపై నిఘా వేశారు, రూపాపై క్రిమినల్ కేసు వేస్తా అన్నారు.

తీర్థయాత్రలో ఘోర విషాదం

- దుబాయ్‌లో బస్సు ప్రమాదం
- దంపతులు, కూతురు, తల్లి దుర్మరణం
- మృతులు రాయచూరు వాసులు



మరణించిన దంపతులు, కూతురు (ఫైల్, వృత్తాల్లో)

రాయచూరు రూరల్: తీర్థయాత్ర తీవ్ర విషాదాంతమైంది. దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచూరుకు చెందిన నలుగురు, కలబుర్గికి చెందిన ఒకరు దుర్మరణం పాలయ్యారు. ఈ నెల 14న రాయచూరు నుంచి వీరు ఉమ్రాకు పవిత్ర క్షేత్ర దర్శనానికి బయల్దేరారు.

అయితే బుధవారం దుబాయ్‌లో బస్‌లో వెళుతుండగా ఎదురుగా వచ్చిన కంటైనర్ ఢీకొంది. ప్రమాదంలో బస్సు నుజ్జునుజ్జుకాగా రాయచూరు ఆశాపూర్ రోడ్డు ద్వారకా నగరకు చెందిన షఫీ సుశేద్ (53), ఆయన తల్లి బీబీజాన్ (64), భార్య సిరాజ్ బేగం (48), కుమార్తె శిఫా(20) తీవ్ర గాయాలతో విగతజీవులయ్యారు. వారి కొడుక్కి గాయాలైనట్లు తెలుస్తోంది. కలబుర్గికి చెందిన మరో వ్యక్తి సైతం మరణించారు. స్థానికంగా ఉన్న కుటుంబ సభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి. మృతుల కుటుంబాలకు ప్రమాద సమాచారాన్ని అందించినట్లు పశ్చిమ పోలీస్ స్టేషన్ ఎస్ఐ భరత్ తెలిపారు.

ప్రయాణికురాలికి చేదు అనుభవం

- మూత్ర విసర్జన చేసిన యువకుడు
- కేఎస్ఆర్టీసీ బస్సులో ఘటన

సాక్షి బెంగళూరు: విమానంలో ఓ వృద్ధురాలిపై బెంగళూరుకు చెందిన బడా కంపెనీ ఉన్నతాధికారి మద్యం మత్తులో మూత్రం పోయడం అంతటా కలకలం రేపింది. ఇప్పుడు ఆర్టీసీ బస్సులో అటువంటి పాడు పని చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి విజయపుర నుంచి మంగళూరుకు వెళుతున్న కేఎస్ఆర్టీసీ స్లీపర్ బస్సులో ఈ ఘటన జరిగింది. మార్గమధ్యంలో కిరేసూరు వద్ద భోజనం కోసం డ్రైవర్ బస్సును ఆపితే కొందరు దిగిపోయారు. 28వ సీటులో ఉన్న రామప్ప (25) అనే యువకుడు తన సీటు నుంచి లేచి వచ్చి 3వ నంబరు సీటులో కూర్చున్న ఒక యువతిపై మూత్ర విసర్జన చేశాడు. భయపడిన ఆ యువతి కిందకు దిగి దాబాలో భోజనం చేస్తున్న డ్రైవర్, కండక్టర్‌కు విషయం తెలిపింది. డ్రైవర్, కండక్టర్ అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. మెకానికల్ ఇంజనీర్‌గా పనిచేస్తానని అతడు చెప్పాడు. మద్యం మత్తులో ఇలా చేసి ఉంటాడని అనుమానించారు. అతన్ని అక్కడే వదిలేసి బస్సు బయల్దేరింది.

మెట్రోలో ప్రమాదాల కట్టడికి ఆదేశం: సీఎం

శివాజీనగర: ఇటీవల రాజధానిలో నమ్మ మెట్రో రైలు మార్గం నిర్మాణ పనుల్లో ప్రమాదాలు అధికమవుతున్నాయి. ఈ విషయమై బుధవారం విధానసభలో ఓ ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నకు సీఎం బొమ్మై సమాధానం ఇచ్చారు. మెట్రో పనులకు సంబంధించి ఇప్పటివరకు 50 మంది ప్రమాదానికి గురయ్యారు. అందులో 38 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.3.15 కోట్లను పరిహారం అందించారు. ప్రమాదాలకు కారణమైన ముగ్గురు ఇంజనీర్లను సస్పెండ్ చేసి, కాంట్రాక్టర్లకు రూ.1.17 కోట్లు జరిమానా విధించినట్లు తెలిపారు. హెబ్బాళలో మెట్రో పిల్లర్ కూలి తల్లీ కొడుకు మరణించిన తరువాత పకడ్బందీగా పనులు చేయాలని ఆదేశించామని తెలిపారు.

ముడుపులు ఇవ్వాలని పీడీఓ ఒత్తిడి

- జీపీ సభ్యురాలి రాజీనామా

బనశంకరి: అభివృద్ధి పనులను ఆమోదించడానికి గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ) ముడుపులు అడుగుతున్నారని ఆరోపిస్తూ బెళగావి జిల్లా రాయబాగ తాలూకా మేఖళి జీపీ సభ్యురాలు సుధాసిద్ధప్ప రాజంగళ బుధవారం రాజీనామా చేశారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గత రెండున్నర ఏళ్ల నుంచి జీపీ సభ్యురాలిగా ఉన్నానని, తమ వార్డులో ఎలాంటి పనులు చేయలేదని వాపోయారు. పనులు మంజూరు చేయాలని అడిగితే పీడీఓ మంజునాథ్ దళవాయి పనుల్లో కమీషన్ ఎంతిస్తారని అడుగుతున్నారని ఆరోపించారు. అంతేగాక ముందస్తుగా 3 శాతం పర్సెంటేజీ డిమాండ్ చేశారని చెప్పారు. ఇవన్నీ భరించడం కంటే రాజీనామా చేయడం మంచిదని నిర్ణయానికి వచ్చానని ఆమె తెలిపారు. ఓట్లు వేసిన ప్రజలు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని అడుగుతున్నారని, వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదని, దీంతో తన పదవికి రాజీనామా చేస్తున్నానని ఆమె తెలిపారు.

ప్రభుత్వంపై విశ్వాసం పోతోంది

- పరిషత్‌లో ఎమ్మెల్సీ విశ్వనాథ్ నిర్వేదం

శివాజీనగర: ఐపీఎస్ రూప, ఐఏఎస్ రోహిణి సింధూరిల విషయం బుధవారం అసెంబ్లీలో చర్చకు వచ్చింది బీజేపీ ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ విధాన పరిషత్‌లో ప్రస్తావించారు. వారి గొడవ మూడు రోజుల నుంచి వైరల్ అవుతోంది. రోహిణి సింధూరి, ఎమ్మెల్యే సా.రా.మహేశ్ మధ్య ఆరోపణలపై రాజీ చేయాలని ఐఏఎస్ అధికారి పీ మణివణ్ణన్ ఒక హోటల్‌లో రాయబారం చేశారు, ఆయనకు ప్రభుత్వం ఈ అధికారం ఇచ్చిందా? అని ప్రశ్నించారు. రూపా మౌద్గిల్‌పై కూడా హస్తకళల మండలిలో పలు ఆరోపణలు ఉండగా, అక్కడి అధికారులు, ప్రధాన కార్యదర్శి మౌనంగా ఉన్నారు. వీటన్నింటినీ మీడియా ద్వారా చూస్తున్న రాష్ట్ర ప్రజలు పాలనా వ్యవస్థను చెడుగా అర్థం చేసుకొంటున్నారు. ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోతున్నారని విశ్వనాథ్ విమర్శించారు. తక్షణమే సస్పెండ్ చేసి తనిఖీ చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇందుకు ప్రభుత్వం తరఫున సమాధానమిచ్చిన ఉన్నత విద్యాశాఖ మంత్రి అశ్వత్థనారాయణ ఈ కేసులో కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఈ చర్చ జరిగేటపుడు పరిషత్ అధికారుల గ్యాలరీలో రూపా మౌద్గిల్ భర్త మానీష్ మౌద్గిల్ ఉండడం విశేషం.

మాంసాహారం తిని ఆలయ సందర్శన?

శివాజీనగర: బీజేపీ జాతీయ కార్యదర్శి సీ.టీ.రవి ఓ వివాదంలో చిక్కుకున్నారు. ఈయన ఈ నెల 19న కార్వారలో ఎమ్మెల్యే సునీల్ నాయక్ ఇంట్లో మాంసాహారం తిన్న అనంతరం ఉత్తర కన్నడ జిల్లా భట్కళలో ఉన్న హనుమాన్ ఆలయాన్ని సందర్శించినట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటో వైరల్ అవుతోంది. దీన్ని కాంగ్రెస్ ప్రచార అస్త్రంగా మలుచుకొని సీటీ రవిపై ధ్వజమెత్తుతోంది. కాగా మండ్యలో సీటీ రవి ఈ విషయంపై స్పందించారు. మాంసాహారం తిన్న మాట వాస్తవమేనని, అయితే ఆలయంలోకి వెళ్లలేదన్నారు.

అన్నదాతకు ఏదీ ఆసరా?



బెళగావి వద్ద ధాన్యం తూర్పెత్తుతున్న రైతులు (ఫైల్)

- మూడేళ్లలో 3,573 మంది రైతుల ఆత్మహత్య
- కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి
- 2,861 మంది మాత్రమే అని రాష్ట్ర గణాంకాలు

సాక్షి, బెంగళూరు: పగలూ రాత్రి కష్టపడి అందరికీ ఆహార ధాన్యాలను అందించే రైతన్నకు ఆసరా దక్కడం లేదు. రాష్ట్రంలో అన్నదాతల బలవన్మరణాలు ఏటికేడాది పెరుగుతున్నాయి. ఆరుగాలం కష్టించి సాగు చేసిన పంట ప్రకృతి ప్రకోపానికి బలి కావడం, ఒకవేళ పండినా ధరలు దక్కక అప్పులే మిగిలి అన్నదాతలు అప్పులు మూటగట్టుకోవాల్సి వస్తోంది. వాటిని ఎలా తీర్చాలనే బెంగ, కుటుంబ పోషణ బరువై రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

కేంద్రం ఏం చెప్పింది


కర్ణాటకలో 2019 నుంచి 2021 మధ్య కాలంలో మొత్తం 3,573 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పీఎం కిసాన్, ప్రధాన మంత్రి ఫసల బీమా యోజన తదితర పథకాలు అమల్లో ఉన్నప్పటికీ ఏమంత భరోసా ఇవ్వడం లేదనేది తేటతెల్లమైంది. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా మొత్తం 16,854 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు.

దేశంలో రెండవ స్థానం

రైతు ఆత్మహత్యల్లో కర్ణాటక దేశంలోనే రెండో స్థానంలో ఉంది. మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలిచింది. కన్నడనాట గత మూడేళ్లలో 462 మంది కుటుంబాలకు మాత్రమే పరిహారం లభించింది. మరో 460 మంది ఆత్మహత్య కేసులను ప్రభుత్వం తిరస్కరించింది.

ఆత్మహత్యలకు అనేక కారణాలు

- కుటుంబ కారణాలు, అనారోగ్యం, వైవాహిక సమస్యలు, ప్రేమ ఘటనలు, నిరుద్యోగం, పరీక్షల్లో ఫెయిల్ కావడం, పేదరికం, మద్యపానం, మత్తుపదార్థాలకు బానిసలవ్వడం వంటి కారణాలతో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నట్లు ఏడీఎస్ఐ నివేదిక ఆధారంగా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది.
- ఈ గణాంకాల ప్రకారం కర్ణాటకలో 2019లో 1,331 మంది, 2020లో 1,072 మంది, 2021లో 1,170 మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. మొత్తం 3,573 మంది బలయ్యారు.
- ఇక రాష్ట్ర ప్రభుత్వాల లెక్కలు కేంద్రం గణాంకాల కంటే చాలా తక్కువగా చూపారు. 2019లో 1,091 మంది, 2020లో 855 మంది, 2021లో 915 మంది మొత్తం 2,861 మంది రైతులు తనువు చాలించారు. ఇలా కేంద్రం లెక్కల కంటే రాష్ట్రం లెక్కల్లో 712 ఆత్మహత్యలు తక్కువగా ఉన్నాయి.



ఇక ఎన్నికల్లో పోటీ చేయను: యడ్డి

- తనయుడు విజయేంద్రకు దారి సుగమం



శివాజీనగర: నేను మళ్లీ అసెంబ్లీలోకి రాను, ఎన్నికల్లో పోటీ చేయను.. అని బీజేపీ సీనియర్ నేత, మాజీ సీఎం యడియూరప్ప ప్రకటించారు. తనయుడు ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీలుగా తన సీటును వదులుకొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనయుడు విజయేంద్రకు టికెట్ దక్కినట్లే దక్కి మిస్ కావడం తెలిసిందే. తండ్రీ కొడుకులకు టికెట్లు ఇచ్చి కుటుంబ పాలనను ప్రోత్సహించారనే ఆరోపణలు వస్తాయని బీజేపీ హైకమాండ్ అప్పట్లో అలా చేసింది. బుధవారం విధానసభలో యడియూరప్ప తన నిర్ణయాన్ని ప్రకటించారు. సీఎం బొమ్మైది మంచి బడ్జెట్ అని, తాను కూడా అసెంబ్లీలో ఏడుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టానని తెలిపారు. ఎక్కడ పోటీ చేసినా గెలుస్తానని సిద్దరామయ్య చెబుతున్నారు. అలాగైతే గత ఎన్నికల్లో చాముండేశ్వరిలో ఎందుకు ఓటమి పాలయ్యారని ప్రశ్నించారు. తాను ఎన్నికల్లో ఇక పోటీ చేయబోవడం లేదని తెలిపారు.

అనుమానం ఉన్మాదిని చేసింది

- భార్య, ఇద్దరు పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పు
- ఆపై ఆత్మహత్యాయత్నం
- శిడ్లఘట్ట తాలూకాలో ఘోరం



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు



ఉన్మాది దాష్టీకానికి మాడి మసైన తల్లీ కూతుళ్లు

శిడ్లఘట్ట, చిక్కబళ్లాపురం: భార్య, ఇద్దరు పిల్లలపై దాడి చేసి వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడో క్రూరుడు. ఈ ప్రమాదంలో ఆ ముగ్గురూ సజీవ దహనమయ్యారు. ఈ దారుణ సంఘటన చిక్కబళ్లాపుర జిల్లా శిడ్లఘట్ట తాలూకా హెబ్బూరులో జరిగింది. నేత్రావతి (37), కుమార్తెలు స్నేహ (11), హర్షిణి (9)లు మరణించారు. అక్రమ సంబంధం అనుమానమే ఈ మారణకాండకు కారణంగా భావిస్తున్నారు.

గొడవపడి దారుణం

వృత్తిరీత్యా భర్త సొణ్ణేగౌడ (48) వ్యవసాయం చేస్తుండగా, భార్య నేత్రావతి గృహిణి. పిల్లలు 5, 3 తరగతులు చదివేవారు. భార్యకు వేరొకరితో అక్రమ సంబంధం ఉందని సొణ్ణేగౌడ అనుమానించేవాడు. మంగళవారం రాత్రి ఈ విషయమై భార్యతో తీవ్రంగా గొడవపడ్డాడు. కోపం పట్టలేక ఉన్మాదిగా మారాడు. భార్య, ఆ తర్వాత పిల్లలపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. మంటల్లో కాలుతున్న వారి అరుపులు విన్న స్థానికులు వచ్చి వాటిని ఆర్పేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటలు ఉవ్వెత్తున రావడంతో ప్రయత్నం ఫలించలేదు. నిమిషాల్లోనే తల్లీ కూతుళ్లు తీవ్రంగా కాలిపోవడంతో ప్రాణాలు వదిలారు.

నిందితుడు ఆత్మహత్యాయత్నం

అప్పటికే సొణ్ణేగౌడ ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతన్ని బెంగళూరుకు తరలించారు. సంఘటన స్థలానికి శిడ్లఘట్ట గ్రామీణ పోలీసులు చేరుకుని పరిశీలించారు.

ముగ్గురి మృతదేహాలను శిడ్లఘట్ట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. చిక్కబళ్లాపుర ఎస్పీ డీఎల్ నాగేశ ఘటనాస్థలిని పరిశీలించారు. ఈ దుర్ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. భార్యభర్తలు తరచు గొడవలు పడుతున్నా, ఇంత దారుణం జరుగుతుందని ఊహించలేదని గ్రామస్తులు వాపోయారు.



నేత్రావతి, పిల్లలు స్నేహ, హర్షిణి (ఫైల్)

క్లుప్తంగా

రాఘవేంద్రుల పాదుకా పట్టాభిషేకం



పూజలు నిర్వహిస్తున్న శ్రీపాదంగళ్

రాయచూరు రూరల్: మంత్రాలయంలో గురు రాఘవేంద్రుల పాదుకా పట్టాభిషేక ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాఘవేంద్ర స్వామి మఠంలో మూలవిరాట్‌కు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ శ్రీపాదంగళ్ ప్రత్యేక పూజలు చేశారు. వందలాది భక్తుల సమక్షంలో గురుసార్వభౌముల 402వ పట్టాభిషేకం, రాయల 429వ వర్ధంతి స్మరణోత్సవం, వెండి రథోత్సవం జరిపారు. కాగా ఏడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు జరుగనున్నాయి.

సీసీ కెమెరాలను అమర్చండి

కంప్లి: ఎమ్మిగనూరులోని ప్రధాన మార్గంలో సీసీ కెమెరాలు అమర్చాలని బుధవారం గ్రామ పంచాయతీ పీడీఓ తారానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రముఖులు ఎస్.రాము మాట్లాడుతూ కొంత మంది దుండగులు రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫ్లెక్సీలు, బ్యానర్లను చింపడం, పేడ వేయడం వంటి కృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఒత్తిడి చేశారు. జీపీ సభ్యురాలు ముద్దీరమ్మ, ప్రముఖులు గాదిలింగప్ప, ఏ.కిషోర్‌కుమార్, ఎల్.జడెప్ప, రామకృష్ణ, నాగరాజ్, హెచ్.మౌలాలి పాల్గొన్నారు.

కేఆర్‌పీపీలో చేరిక



పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: కళ్యాణ రాజ్య ప్రగతి పార్టీ(కేఆర్‌పీపీ) జిల్లాధ్యక్షుడు గోనాళ్ రాజశేఖర్‌గౌడ నేతృత్వంలో నగరంలోని 11వ వార్డుకు చెందిన జేడీఎస్ నాయకుడు రసూల్‌సాబ్, బ్యాలచింత, గొల్లనాగేనహళ్లి, తంబ్రహళ్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేఆర్‌పీపీలో చేరినట్లు ఆ పార్టీ రూరల్ అభ్యర్థి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కంప్లి: పట్టణంలోని 110 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో అత్యవసర పనుల నిర్వహణతో ఈనెల 24న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంప్లి పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని జెస్కాం ఏఈ వినోద్‌కుమార్ తెలిపారు.

నాల్గో రోజున హోమపూజలు




పాల్గొన్న మంత్రి పీఏ రాజు దంపతులు

గంగావతి రూరల్: తాలూకాలోని ఆనెగుంది మేగోటె దుర్గామాత ఆలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్టాపన వేడుకల్లో భాగంగా నాల్గో రోజున రాష్ట్ర రవాణ శాఖా మంత్రి బి.శ్రీరాములు పీఏ విజయ్‌కుమార్(రాజు) దంపతులు దుర్గామాత మానసపుత్ర, దాసోహరత్న బ్రహ్మానంద స్వామీజీ ఆధ్వర్యంలో కల్బుర్గి వేద పాఠశాల పరిమళ ఆచార్య, మంత్రాలయ శిష్య బృందంతో గణపతి, నవగ్రహ, సుదర్శన హోమంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వాజేంద్ర ఆచారి, మేనేజర్ రాజన్నస్వామి, ఇంజనీర్ శ్రీధర్, రామణ్ణ, బాలు స్వామి, జీపీ అధ్యక్ష, సభ్యులు పాల్గొన్నారు.

పంచరత్న రథయాత్రకు శ్రీకారం

రాయచూరు రూరల్ : నగరంలో బుధవారం కిల్లే బృహన్మఠంలో శాంతమల్ల శివాచార్య స్వామీజీ పంచరత్న రథయాత్రకు శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ కుమారణ్ణ నినాదంపై ప్రచార జాతాకు పచ్చ జెండాను ఊపి ప్రసంగించారు. మాజీ నగరసభ అధ్యక్షుడు వినయ్ కుమార్ మాట్లాడుతూ పంచరత్న పథకాల గురించి ప్రజలకు వివరించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లాధ్యక్షుడు విరుపాక్షి, మహంతేష్ పాటిల్, రామకృష్ణ, శివశంకర్, తిమ్మారెడ్డి, రవి, ఆలం, విశ్వనాథ్ పట్టి, నరసింహులు, లక్ష్మీపతి, అంజాద్‌లున్నారు.

న్యాయవాదిపై దాడి తగదు



వినతిపత్రాన్ని అందిస్తున్న న్యాయవాదులు

హొసపేటె: విజయనగర జిల్లా హగరిబొమ్మనహళ్లి తాలూకాలో న్యాయవాది బసవరాజ్ కర్కిహళ్లిపై దాడిని వ్యతిరేకిస్తూ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వరకు ర్యాలీని నిర్వహించారు. సంఘం నేతలు కరుణానిధి, బసవరాజ్ మాట్లాడుతూ న్యాయవాదిపై దాడి నిందితులను పోలీసులు వెంటనే బంధించి చట్టప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని జిల్లాధికారి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నేతలు చంద్రశేఖర్, తారిహళ్లి, హనుమంతప్ప, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నగరిలో రాజుకున్న ఎన్నికల వేడి

- వ్యూహాత్మక ఎత్తులతో రాజకీయ పార్టీల ముందడుగు
- ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే ఓటర్లకు ప్రలోభాలు



బళ్లారి జంక్షన్ రైల్వే స్టేషన్ ముఖద్వారం

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో ఇంకా అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాక మునుపే రెండు నెలల క్రితం నుంచే జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కింది. జిల్లాలోని బళ్లారి సిటీ, బళ్లారి గ్రామీణ, కంప్లి, సండూరు, సిరుగుప్ప ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను మూడు నియోజకవర్గాల్లో సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, రెండు నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో గనుల జిల్లాగా పేరొందిన బళ్లారి జిల్లాలో ఈసారి ఎన్నికలు రసవత్తరంగా జరగనున్నాయి. మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి నూతనంగా కేఆర్‌పీ పార్టీని స్థాపించడంతో ఆయన బళ్లారి జిల్లాలో ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్‌లకు గట్టి దెబ్బ తగిలే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇక జేడీఎస్ తరపున కూడా అభ్యర్థులు రంగంలోకి దిగేందుకు జిల్లా జేడీఎస్ శాఖ కసరత్తు చేస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత ఓటర్లు బహిరంగంగా డబ్బులు కాని, గిఫ్టులు కాని ఇచ్చేందుకు దొంగచాటుగా ఇవ్వాల్సిన పరిస్థితులు ఉండటంతో ముందుగానే ఒక రౌండ్ ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులు ఇంటింటా తిరుగుతూ తమదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు.

బళ్లారి సిటీపైనే అందరి చూపు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బళ్లారి సిటీ నియోజకవర్గంపై అందరి చూపు పడింది. ఈసారి బళ్లారి సిటీ నియోజకవర్గం నుంచి గాలి జనార్దనరెడ్డి సతీమణి గాలి లక్ష్మీ అరుణ పోటీ చేయనుండగా ఇక బీజేపీ తరపున గాలి సోమశేఖరరెడ్డి మళ్లీ పోటీ చేస్తారని ప్రకటించడంతో ఒక వైపు సొంత అన్నదమ్ముల కుటుంబాల్లో రాజకీయ పోరు మొదలైంది. కాంగ్రెస్ తరపున నారా భరత్‌రెడ్డి తనకే టికెట్ దక్కుతుందని ఆశిస్తూ ఆయన ఇంటింటా ప్రచారం చేయడంతో పాటు ముందుగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో కుక్కర్లను పంపిణీ చేయడంతో పాటు వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేస్తున్నారు. గాలి లక్ష్మీ అరుణ కూడా మహిళలకు ఒడిబియ్యం వేసి చీరలను ఇస్తోంది. గాలి సోమశేఖరరెడ్డి కూడా ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పేదల గృహాలకు హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్, కేఆర్‌పీపీ మహిళా ఓటర్లను ఆకట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. కంప్లి నియోజకవర్గంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీ తరపున గణేష్ పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక బీజేపీ తరపున మాజీ ఎమ్మెల్యే టీ.హెచ్ సురేష్‌బాబు బరిలో నిలువబోతున్నారు.

టికెట్ కోసం ముమ్మర ప్రయత్నం

సిరుగుప్ప నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే సోమలింగప్ప తనకే టికెట్ దక్కుతుందని ఆశిస్తుండగా, గతంలో ఓడిపోయిన మురళీకృష్ణ, మాజీ ఎమ్మెల్యే బీ.ఎం.నాగరాజు ఇద్దరు కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. కేఆర్‌పీపీ తరుపున సిరుగుప్ప నుంచి దరప్ప నాయక పేరును ఆ పార్టీ అధ్యక్షుడు గాలి జనార్దనరెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక సండూరు నియోజకవర్గం వైపు అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. సండూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున హ్యాట్రిక్ విజయం సాధించిన తుకారాం ఈసారి కూడా తనకే టికెట్ దక్కుతుందని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా నియోజకవర్గంలో తనదైన శైలిలో ప్రచారం చేసుకుంటున్నారు. బీజేపీ తరపున మాజీ కార్పొరేటర్‌కు టికెట్ దక్కుతుందని ఆరు నెలల నుంచి అక్కడే మకాం వేసి ఇంటింటా తిరుగుతూ తనకు చేతనైనంతగా సాయం చేస్తున్నారు. అయితే సండూరు నియోజకవర్గం నుంచి మంత్రి శ్రీరాములు పోటీ చేస్తారని ప్రచారం సాగుతున్న తరుణంలో బీజేపీ తరపున కే.ఎస్ దివాకర్‌కు టికెట్ వచ్చే అవకాశం ప్రశ్నార్థకంగా మారింది. బళ్లారి జిల్లాలో ఓ వైపు ఎన్నికల వేడి, మరో వైపు వేసవి ఎండ వేడి కూడా మొదలైంది. జిల్లాను బీజేపీ, కాంగ్రెస్, కేఆర్‌పీపీ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటంతో ఎన్నికల వేడి రాజుకుంది.

1, 2 తేదీల్లో కసాప సమ్మేళనం

బళ్లారిఅర్బన్: స్థానిక రాఘవ కళామందిరంలో మార్చి 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు కన్నడ సాహిత్య పరిషత్ అఖండ బళ్లారి జిల్లా సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు కసాప జిల్లాధ్యక్షులు డాక్టర్ నిష్టిరుద్రప్ప పేర్కొన్నారు. బుధవారం పత్రికా భవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి డాక్టర్ అరవింద పాటిల్ అధ్యక్షత వహిస్తారన్నారు. ఆరోజు ఉదయం 7 గంటలకు మేయర్ రాజేశ్వరి జెండావిష్కరణ చేస్తారన్నారు. కమ్మభవన్ వద్ద భువనేశ్వరి మాత చిత్రపటానికి ఎమ్మెల్యే జీ.సోమశేఖర్‌రెడ్డి పూజ చేసి సమ్మేళన జాతాను ప్రారంభిస్తారన్నారు. జాతా గడిగిచెన్నప్ప సర్కిల్, బెంగళూరు రోడ్డు, తేరు వీధి, మోతీ సర్కిల్, రైల్వేస్టేషన్ మీదుగా రాఘవ కళా మందిరానికి చేరుకుంటుందన్నారు. అక్కడ 10.30 గంటలకు కసాప రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాడోజ మహేష్‌జోషి సదస్సును, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీ.శ్రీరాములు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా కొట్టూరు సంస్థానమఠ బసలింగస్వామి, రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర తదితరులు పాల్గొంటారన్నారు. సమ్మేళనంలో కవిగోష్టి, చర్చాగోష్టి, జిల్లా సాహిత్య సాంస్కృతిక, కన్నడ సాహిత్య కళారూపాలు, కవితా కచేరీ తదితర 8 గోష్టులు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కసాప పదాధికారులు సిద్దలింగప్ప హంద్యాళ్, బసవరాజు, కేవి.నాగిరెడ్డి, నాగరాజ్ మస్కి, చైతన్య వేదిక ప్రభు, మంజునాథ గోవిందవాడ, కప్పగల్ ఆచారి, బసవరాజ్ బిసిలహళ్లి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ఇసుక తరలింపునకు బారులు తీరిన టిప్పర్లు

రాయచూరు రూరల్: రాయచూరు, యాదగిరి జిల్లాల్లో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. రాయచూరు, దేవదుర్గ, మాన్వి, యాదగిరి, సురపుర తాలూకాల్లో ఆయా జిల్లాల్లోని తుంగభద్ర, కృష్ణా, భీమా నదీ తీర ప్రాంతాల్లో నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుక రవాణా విచ్చలవిడిగా కొనసాగుతోంది. జోళదెడగి, కర్కిహళ్లి, పర్వతాపూర్‌లలో కాంట్రాక్టర్లు పీఎల్.కాంబ్లి, పంచాక్షరి, శివప్ప బసప్ప, ఆనంద్ దొడ్డమనిలు స్టాక్ యార్డులకు నదుల నుంచి ఇసుకను దొంగచాటుగా తరలించి నిల్వ చేసుకుంటున్నారని సామాజిక కార్యకర్త హనుమంతు ఆరోపిస్తున్నారు. పట్టపగలే నదుల్లో బుల్డోజర్ల ద్వారా గుంతలు పడేలా ఇసుకను తవ్వి తరలిస్తున్నారు. రెండు వాహనాలకు రాయల్టీ అనుమతిని పొంది మిగిలిన వాహనాలకు లేకుండా వందల కొద్ది టన్నుల ఇసుకను సరఫరా చేస్తున్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు నేరుగా ఇసుకను తరలిస్తారు. దీంతో రూ.కోట్లాది మేర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో కోత పడుతోంది. ఈవిషయంలో రాజకీయ నాయకులు, అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

మహిళలు పథకాల లబ్ధి పొందాలి



అష్టకళా ప్రదర్శనను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి శోభా

గంగావతి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా స్వావలంబన కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి శోభా కరంద్లాజె పేర్కొన్నారు. ఆమె బుధవారం జిల్లాలోని కుకనూరులో ఏర్పాటు చేసిన అష్టకళా ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఈ పథకాలను ఉపయోగించుకోవాలన్నారు. దేశంలో మునుపెన్నడూ లేని విధంగా మహిళల కోసం తమ ప్రభుత్వం పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. మహిళాభివృద్ధితో కుటుంబ ఎదుగుదల సాధ్యమని ఆమె తెలిపారు. మహిళా సంఘాలు తమ చేతి వృత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. రాష్ట్ర మంత్రి హాలప్ప ఆచార్, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, ఎమ్మెల్యేలు పరణ్ణ మునవళ్లి, బసవరాజ్ దఢేసూగూరు, ఎమ్మెల్సీ హేమలతా నాయక్, కొప్పళ జిల్లాధికారి సుందరేష్‌బాబు, జెడ్పీ సీఈఓ రాహుల్ రత్నం పాల్గొన్నారు.

వరండాలోనే రోగికి వైద్యంపై విమర్శలు



నేలపై కూర్చొబెట్టి వైద్యం అందించిన కిమ్స్ వైద్యుల నిర్వాకం

హుబ్లీ: ఓ వృద్ధురాలికి బెడ్ కేటాయించకుండా కిమ్స్ ఆస్పత్రి వరండాలోనే చికిత్స అందించిన వైనం సర్వత్రా విమర్శలకు గురైంది. అనారోగ్యంతో బాధపడుతున్న పాతహుబ్లీకి చెందిన చెన్నవ్వ(67) అనే వృద్ధురాలు చికిత్స కోసం కిమ్స్‌కు రాగా ఆమెను నేలపైనే కూర్చొబెట్టి గ్లూకోజ్‌ను ఎక్కించారు. కనీసం స్టాండ్ కూడా ఇవ్వకుండా సదరు గ్లూకోజ్ బాటిల్‌ను ఆమె సహాయకులుగా వచ్చిన వారితో పట్టించారు. ఇలా గంటలు గడిచినా దీనిపై స్పందించిన నాథుడే లేడు. ఇది స్థానికులకు తీవ్ర ఆగ్రహం కలిగించడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్ అయింది.

హత్యాపాపం మీదంటే మీదే

- దొడ్డ బెళవంగలలో పార్టీల ఆరోపణలు



బీజేపీ నేతతో నిందితుడు తీయించుకున్న ఫోటో ప్రదర్శిస్తున్న కాంగ్రెస్ నేత లక్ష్మిపతి

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకాలోని దొడ్డబెళవంగలలో గత వారం జరిగిన ఇద్దరు యువకుల హత్యల వివాదం ఇంకా రాజుకుంటోంది. ఇప్పటికే జేడీఎస్ పార్టీ నేతలు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి హత్యల పాపం కాంగ్రెస్, బీజేపీ పార్టీలదే అని ఆరోపించారు. అయితే కాంగ్రెస్, బీజేపీ వారు కూడా పాత్రికేయుల సమావేశం ఏర్పాటుచేసి ఆరోపణలు చేసుకున్నారు. రెండు హత్యల పాపం క్రికెట్ టోర్నీ నిర్వాహకులదే అని కాంగ్రెస్ నేత లక్ష్మిపతి అన్నారు. కాబట్టి నిర్వాహకులపై కేసు పెట్టి అరెస్టు చేయాలని డిమాండు చేశారు. ఇందులో పోలీసుల నిర్లక్ష్యం కూడా ఉందన్నారు. బీజేపీ అభ్యర్థినని చెప్పుకుంటున్న ధీరజ్ మునిరాజు యథేచ్ఛగా డబ్బులు వెదజల్లుతూ ఇష్టారాజ్యంగా తాలూకాలో కార్యక్రమాలు ఏర్పాటుచేస్తూ గొడవలు సృష్టిస్తున్నారన్నారు.

ఓటమి భయంతో ఆరోపణలు: బీజేపీ

బీజేపీ నేతలు మాట్లాడుతూ ఎమ్మెల్యే రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతో జంట హత్యల పాపాన్ని బీజేపీ అభ్యర్థి ధీరజ్ మునిరాజుకు అంటగడుతున్నారన్నారు. ధీరజ్ ఇంటికి సమీపంలోనే నిందితులపై పోలీసులు ఫైరింగ్ చేయడం కాకతాళీయమన్నారు. నిందితులకు, ధీరజ్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు. జంట హత్యల కేసుని సీబీఐ లేదా సీఐడీకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

కోలారు వార్తలు...

జిల్లాలో అభివృద్ధి పనులు పూర్తి

- జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్



మాట్లాడుతున్న సీఈఓ యుకేష్ కుమార్

కోలారు : జిల్లా పంచాయతీ పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను దాదాపుగా పూర్తి చేసినట్లు జెడ్పీ సీఈఓ యుకేష్‌కుమార్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ కింద రూ.30 కోట్లు, ప్రైవేటు భాగస్వామ్యంతో సీఎస్ఆర్ నిధులతో రూ.7 కోట్లు, అమృత్ సరోవర్ పథకం కింద రూ.7 కోట్లు ఇలా జిల్లా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. శ్రీనివాసపురంలో 5 పరిసర సంరక్షణ యూనిట్లను ఏర్పాటు చేశామన్నారు. అమృత్ సరోవర్ సంక్షేమ పథకం కింద జిల్లాలో 130 చెరువుల్లో పూడికతీత చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 135 పాఠశాలలకు ప్రహరీలను నిర్మించారన్నారు. 327 వంటగదులు, 460 శౌచాలయాలు, 166 క్రీడా మైదానాలు, 477 వాటర్ హార్వెస్టింగ్ పరికరాలను అమర్చారన్నారు. 450 శిథిల అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు చేశామన్నారు. ప్రభుత్వ శిశుపాలనా కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. అన్ని జీపీల పరిధిలోని 154 గ్రంథాలయాలను ఇప్పటికే డిజిటలీకరించామన్నారు. 2.38 శాతం మంది యువ ఓటర్లను ప్రస్తుత సంవత్సరంలో ఓటరు జాబితాలో చేర్చారన్నారు.

ధార్వాడను సాంస్కృతిక రాజధానిని చేస్తాం

- కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘువాల్



మాట్లాడుతున్న అర్జున్‌రామ్

హుబ్లీ: ధార్వాడ జిల్లాను సాంస్కృతిక రాజధానిగా చేస్తామని కేంద్ర సంస్కృతి శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘువాల్ తెలిపారు. ఆయన బుధవారం ధార్వాడలో లలితకళ అకాడమి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. పండిట్ పుట్టరాజ గవాయి పేరిట సంగీత కార్యక్రమ నిర్వహణకు నిధులు విడుదల చేస్తామన్నారు. సంగీతంతో పాటు అన్ని అకాడమిలు ధార్వాడకు వస్తే సాంస్కృతిక రాజధాని అవుతుందన్నారు. కళాకారులకు స్కాలర్‌షిప్ ఇచ్చే ప్రక్రియ ప్రారంభించాలని ప్రధానికి విన్నవిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వివేకానంద పాడిన ఓ పాటను పాడారు. మ్యూజియం ఏర్పాటుకు రూ.5 కోట్లు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పాల్గొన్నారు.

మహాత్ముల ప్రతిమల ఊరేగింపు



కంప్లి: కురుగోడులోని జగద్గురు కొట్టూరుస్వామి సంస్థానమఠం శాఖ విరక్త మఠపు జగద్గురు డాక్టర్ సంగనబసవ మహాస్వామి పట్టాధికార సువర్ణ మహోత్సవాల సందర్భంగా నూతన ప్రతిమల ప్రతిష్టాపన, ప్రవచనాలు జరిగాయి. ఈసందర్భంగా దొడ్డ బసవేశ్వర దేవస్థానం నుంచి దొడ్డ బసవేశ్వర మూర్తి, జగద్గురువు డాక్టర్ సంగన బసవ మహాస్వామి మూర్తి, శివశరణ నీలమ్మతాయి మూర్తులను వివిధ మేళతాళాలతో ముత్తైదువుల హారతులతో భారీగా ఊరేగించారు. ఎమ్మెల్యే గణేష్, వివిధ మఠాధిపతులు పాల్గొన్నారు.

ఈశ్వర దేవస్థాన వార్షికోత్సవం



గంగావతి: నగరంలోని నిజవార్ నగర్‌లో బుధవారం ఈశ్వర దేవస్థానపు వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఆలయం నుంచి ఈరణ్ణ దేవస్థానం వరకు నిర్వహించిన కుంభోత్సవ ఊరేగింపును ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి ప్రారంభించారు. ఉదయాన్నే ఈశ్వరుడికి పలు రకాల అభిషేకాలు, ధార్మిక కార్యక్రమాలను అర్చకులు నెరవేర్చారు. కార్యక్రమంలో బీజేపీ నేత శ్రావణ కుమార్ రాయకర్, వాసుదేవ నవలి, అందానప్ప, సింగనాళ వెంకటేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీజేపీతోనే సాధ్యం



కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న దృశ్యం

కోలారు : రాష్ట్ర అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకుడు మోహన్ కృష్ణ తెలిపారు. బుధవారం ఘట్టమాదమంగలలో బీజేపీ ప్రభుత్వ సాధనల కరపత్రాన్ని పంచి మాట్లాడారు. బీజేపీ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు. దీనిని సహించలేని ప్రతిపక్షాలు అకారణంగా లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. జెడ్పీ మాజీ సభ్యుడు జయప్రకాష్ నాయుడు, నవీన్‌రాం పాల్గొన్నారు.

పరిహారం కోసం రైతుల ధర్నా

కోలారు : బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూమిని కోల్పోయిన రైతులకు పరిహారం అందించాలని బుధవారం భూ నిర్వాసితుల పోరాట సమితి ఆధ్వర్యంలో రైతులు కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. కేపీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.యశ్వంత్ మండ్య మాట్లాడుతూ ప్రభుత్వం కారిడార్ నిర్మాణం కోసం రైతుల నుంచి భూమిని స్వాధీనం చేసుకుని పరిహారం అందించకుండా వారిని వీధిపాలు చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కార్పొరేట్ సంస్థలకు ఎర్రతివాచీ పరుస్తూ సామాన్య రైతులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వం రైతులకు తగిన పరిహారం అందించకుంటే పోరాటం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. పోరాట సమితి సభ్యులు వెంకటేష్, మునివెంకటేగౌడ, కల్లుకెరె బాబు, రంగనాథ్ పాల్గొన్నారు.

జేడీఎస్‌ను గెలిపించాలి

శ్రీనివాసపురం : వచ్చే ఎన్నికల్లో జేడీఎస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి కుమారస్వామిని ముఖ్యమంత్రిని చేయాలని జిల్లా జేడీఎస్ అధ్యక్షుడు జి కె వెంకటశివారెడ్డి తెలిపారు. బుధవారం గౌడతాత గుడ్డలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. జేడీఎస్ పంచరత్న, జలధారె పథకాలు రాష్ట్రాభివృద్ధికి దోహదపడతాయన్నారు. పేదలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాంతీయ పార్టీ జేడీఎస్‌తోనే సాధ్యమన్నారు. గతంలో 14 నెలల పాటు సీఎంగా ఉన్నప్పుడు కుమారస్వామి అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఈసందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి జేడీఎస్‌లో చేరారు. రాష్ట్ర జేడీఎస్ ప్రధాన కార్యదర్శి బి వి శివారెడ్డి, జిల్లా జేడీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గాయత్రి ముత్తప్ప, జెడ్పీ మాజీ సభ్యుడు తూపల్లి ఆర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించరూ

రాయచూరు రూరల్: హాస్టళ్లలో కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల బకాయి వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ పేర్కొన్నారు. ఆయన బుధవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో చేపట్టిన ఆందోళనను ద్దేశించి మాట్లాడారు. కాంట్రాక్ట్ పద్ధతిని రద్దు చేసి నెలకు రూ.36 వేల వేతనం చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, జీసీఎఫ్, ఈపీఎఫ్‌లు అందించాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

ఒక్క రూపాయికి కక్కుర్తి.. బీఎంటీసీకి జరిమానా

శివాజీనగర: రూపాయే కదా అని బస్సులో చాలామంది తిరిగి అడగరు, కండక్టర్ కూడా ఇవ్వరు. కానీ రమేశ్ నాయక్ అనే ప్రయాణికుడు రూపాయి కోసం పోరాడి విజయం సాధించాడు. వివరాలు.. ఆయన 2019లో శాంతినగర నుంచి మెజిస్టిక్‌కు ప్రయాణం చేస్తున్నారు. ఈ సమయంలో రూ.30 ఇచ్చి రూ.29 టికెట్‌ను కొనుగోలు చేశారు. కండక్టర్ రూపాయ చిల్లరను ఇవ్వకుండా మౌనంగా ఉన్నారు. అడిగినా కూడా పట్టించుకోలేదు. దీంతో రమేశ్ నాయక్ జిల్లా వినియోగదారుల న్యాయస్థానానికి వెళ్లి రూ.15 వేలు పరిహారాన్ని కోరారు. ఈ కేసులో ప్రయాణికునికి రూ.2 వేల పరిహారం ఇవ్వాలని బీఎంటీసీని వినియోగదారుల ఫోరం ఆదేశించింది. ఖర్చుల కింద రూ. వెయ్యి అదనంగా ఇవ్వాలని సూచించింది. 45 రోజుల్లోగా పరిహార మొత్తాన్ని ఇవ్వకపోతే వడ్డీ కూడా పడుతుందని చెప్పడం గమనార్హం. చిల్లర విషయంలో బస్సు కండక్టర్ ప్రయాణికులతో అనుచితంగా ప్రవర్తించడం తగదని హెచ్చరించింది.

ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తొస్తారా?

బళ్లారి అర్బన్: ఎన్నికలప్పుడే ప్రజలు గుర్తుకొస్తారే తప్ప సమస్యలపై మాత్రం పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ కౌన్సిలర్, అఖిల భారత జనగణ ఐక్యత సంస్థాపక అధ్యక్షులు ఎస్.గంగిరెడ్డి ఆరోపించారు. బుధవారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో గత కొన్నేళ్లుగా ప్రజలకు సరైన ప్రధాన రోడ్లతో పాటు సీసీ రోడ్లు, యూజీడీ, ఓపెన్ కాలువ, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఎన్నికలప్పుడు మాత్రం పనులు చేస్తున్నామని చూపించుకొనేందుకు రోడ్లను తవ్వి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

ఆర్థికాభివృద్ధికి గణితం దోహదం

రాయచూరు రూరల్: దేశ పురోగతికి ప్రతి ఒక్కరూ నూతన విద్యా విధానాలను అనుసరించాలని రాయచూరు వ్యవసాయ వర్సిటీ వీసీ హరీష్ రామస్వామి పేర్కొన్నారు. ఆయన బుధవారం నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు గణితం ఎంతో దోహదపడుతుందన్నారు. పెట్టుబడి పెట్టడం కూడా గణితంతోనే సాధ్యమవుతుందనే విషయాన్ని విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ విశ్వనాథ్, అధికారి మఠస్వామి, గోకుల్‌నాథ్, రాఘవేంద్ర, యంకణ్ణలున్నారు.

హంపీ వర్సిటీ వీసీగా డాక్టర్ విజయ్ తంబండ పూణచ్చ

హొసపేటె: హంపీ కన్నడ వర్సిటీ తాత్కాలిక వైస్ ఛాన్సలర్(వీసీ)గా వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్ తంబండ పూణచ్చ మంగళవారం అధికార బాధ్యతలను చేపట్టారు. ఇంతకు ముందు ఉన్న వైస్ ఛాన్సలర్ రమేష్ పదవీకాలం ముగియడంతో తాత్కాలిక వీసీగా విజయ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణోత్సవం

మాలూరు : లక్కూరులో ప్రసన్న సోమేశ్వరస్వామి కల్యాణోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖకు చెందిన ఆలయంలో ప్రతియేటా కళ్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవ మూర్తులకు ఆలయ ప్రాంగణంలో విశేష అలంకరణ చేసి పూజలను నెరవేర్చారు.

మార్చి 4, 5 తేదీల్లో రాయల జయంతి



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

కోలారు : నగరంలోని ఈటీసీఎం ఆస్పత్రి ముందు మార్చి 4, 5వ తేదీల్లో విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయల 552వ జయంతిని నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణదేవరాయ అభివృద్ధి ప్రతిష్టాన జిల్లా అధ్యక్షుడు కె వి సురేష్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న రాయల జయంతిని ఇకపై ప్రతియేటా జిల్లాలో నిర్వహిస్తామన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించే జయంతిలో మొదటి రోజున సాహిత్య చర్చాగోష్టులు, చరిత్ర పరిశోధకుల ఉపన్యాసాలు, నృత్య రూపకాలు ఉంటాయన్నారు. రెండో రోజున కుస్తీ పోటీలు, రాగి ముద్దలు తినే పోటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోటీల విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు. ప్రతిష్టాన సభ్యులు ఎస్ ఎన్ శ్రీధర్, రఘునాథ్, చంద్రశేఖర్, సురేష్, శ్రీనివాస్, సీటీఓ రాజేష్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పారబోత

కోలారు : కోలారు అబ్కారీ శాఖ అధికారులు వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి స్వాధీన పర్చుకున్న 61,470 లీటర్ల అక్రమ మద్యాన్ని, 369 లీటర్ల బీరును బుధవారం నగరంలోని అబ్కారీ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట పారబోశారు. అబ్కారీ డిప్యూటీ కమిషనర్ హెచ్.రమేష్‌కుమార్ ఆదేశాల మేరకు అబ్కారీ డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీశైల అవజి, రెవిన్యూ శాఖ అధికారి గౌతంరాజ్ నేతృత్వంలో అక్రమ మద్యాన్ని సిబ్బంది ధ్వంసం చేశారు.

క్లుప్తంగా

ఎట్టకేలకు చిరుత పట్టివేత



తుమకూరు: కొన్ని రోజులుగా కుక్కలు, పశువులను బలి తీసుకుంటూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్న చిరుత పులి బోనులో చిక్కింది. మంగళవారం అర్ధరాత్రి గుబ్బి తాలూకా కడబ హోబళి కొప్ప గ్రామంలో దొరికింది. కొప్ప గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యక్తి తోటలో అటవీ శాఖాధికారులు చిరుత కోసం బోనును పెట్టారు. ఈ బోనులో చిరుత పడింది. ఇది ఆడ చిరుతగా గుర్తించారు. ఇది లక్షలాది రూపాయల విలువ చేసే మేకలు, గొర్రెలను నెల రోజుల వ్యవధిలో చంపి తిని రైతులకు ఎంతో నష్టం చేసింది.

కుమారస్వామికి విభిన్న హారాలు



శివమొగ్గ: మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామి చేపట్టిన పంచరత్న యాత్రకు శివమొగ్గ జిల్లాలో మంచి స్పందన లభించింది. మంగళవారం భద్రావతి నియోజకవర్గంలో యాత్ర సాగింది. బుధవారం శివమొగ్గ గ్రామీణ నియోజకవర్గంలో జరిగింది. కార్యకర్తలు నీటి బాటిళ్లు, ఖర్బూజ పండ్లు, ఎండు కొబ్బరి, వక్కలతో తయారు చేసిన హారాలను వేస్తూ కుమారస్వామికి స్వాగతం పలికారు.

మూగజీవాలను వణికిస్తున్న చర్మగంటు వ్యాధి

- ఉడుపి జిల్లాలో 74 పశువుల మృతి

యశవంతపుర: చర్మగంటు వ్యాధి పశువుల ప్రాణాలు తీస్తోంది. ఈవ్యాధితో ఉడుపి జిల్లాలో 74 పశువులు మృతి చెందాయి. వేలాది రూపాయల విలువైన పశువులు మృతి చెందుతుండటంతో పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కుందాపుర, హెబ్రి, బ్రహ్మావర, కార్కళ తాలూకాల్లో పాడి పరిశ్రమపై రైతులు పెద్ద సంఖ్యలో ఆధారపడ్డారు. ఇతర జిల్లాల నుంచి గేదెలు తీసుకొచ్చి పోషిస్తున్నారు. సుమారు ఆరు వేల పశువులు చర్మగంటుతో బాధపడుతున్నట్లు గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో పశుసంవర్ధకశాఖ అధికారులు గుర్తించారు. ఇతర జిల్లాలనుంచి ఉడుపి జిల్లాకు తీసుకొచ్చిన పశువుల వల్లనే చర్మగంటు వ్యాధి వ్యాపించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రోగ నివారణకు పశువులకు టీకా వేయిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ శంకర్ శెట్టి తెలిపారు.

పూలహారంలో మాంసం ముద్దలు

- ఇద్దరు దుండగుల దుశ్చర్య

దొడ్డబళ్లాపురం: భక్తుల ముసుగులో వచ్చిన దుండగులు మాంసం ముద్దలు ఉన్న పూల హారం ఇచ్చారు. దీనిని ఆలయ సిబ్బంది పసిగట్టి హారాన్ని బయట పడేయడంతో స్వామివారికి పెను ముప్పు తప్పింది. ఈ ఘటన దొడ్డ తాలూకా మధురె శనిమహాత్మస్వామి దేవాలయంలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం దేవాలయానికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు దేవుడికి హారాలు తెచ్చామంటూ ప్లాస్టిక్ సంచులు అందించి వెళ్లిపోయారు. సంచులనుంచి హారాన్ని బయటకు తీయగా అందులో మాంసం ముద్దలు కనిపించాయి. కంగుతిన్న సిబ్బంది కవర్‌ను బయటకు తీసుకువచ్చి పారవేశారు. ఘటనపై దొడ్డబెళవంగల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సీసీ కెమెరాలో రికార్డయిన ఫుటేజీ పరిశీలించగా యువకుల దుశ్చర్య కళ్లకు కట్టింది. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

24 నుంచి పినాకినీ ద్రాక్షరస ఉత్సవాలు




మాట్లాడుతున్న రవినారాయణరెడ్డి

గౌరిబిదనూరు: ద్రాక్ష సాగును ప్రోత్సహించడం కోసం పట్టణంలోని సాయికృష్ణ కన్వెన్షన్ హాలులో ఈనెల 24 నుంచి 26వరకు పినాకినీ ద్రాక్షరస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ద్రాక్ష,వైన్ బోర్డ్ అధ్యక్షుడు రవినారాయణరెడ్డి బుధవారం తెలిపారు. పదికిపైగా వైన్ తయారీ కంపెనీలు స్టాల్స్ ఏర్పాటు చేసి 80 రకాల ద్రాక్ష వైన్‌ను ప్రదర్శిస్తారని తెలిపారు. వినియోగదారులకు 10 శాతం తగ్గింపు ధరతో వైన్ అందజేస్తారని తెలిపారు. బోర్డు ఎండీ సోము మాట్లాడుతూ బోర్డు స్థాపనకు ముందు 2 వైనరీలు ఉండగా నేడు వీటి సంఖ్య 19కి పెరిగిందన్నారు. ద్రాక్ష పంట 500 ఎకరాల నుంచి 2వేల ఎకరాలకు పెరిగిందన్నారు.

డబ్బు డబుల్ అవుతుందని మోసం

- రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు
- రూ. 8.30 లక్షలు ఖాతాకు జమ చేయించుకొని వంచన

బనశంకరి: సైబర్‌నేరగాళ్లు రోజూఎంతో మందిని టార్గెట్ చేస్తున్నా జనం అత్యాశకు పోయి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. కేటుగాళ్లు ఏదో ఒక రకంగా మభ్యపెట్టి వంచనలకు పాల్పడుతున్నారు. పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు ఇస్తామని సైబర్‌కేటుగాళ్లు ఓ యువకుడిని నమ్మించి రూ.8.30 లక్షలు కాజేశారు. కోణణకుంటె నివాసి రోహిత్ బసవరాజ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. నగదు రెట్టింపుచేస్తామని నమ్మించారు. దీంతో బసవరాజ్ తొలుత రూ. వెయ్యి వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. కొద్దిసేపటికే అతని ఖాతాకు రూ.1300 తిరిగి జమ అయ్యింది. నమ్మకం ఏర్పడటంతో భారీగా డిపాజిట్ చేసేందుకు బసవరాజ్ సిద్ధమయ్యాడు. ఈమేకు దశలవారీగా రూ.8.30లక్షలు వారు చెప్పిన ఖాతాకు పంపాడు. అనంతరం వంచకులు అందుబాటులోకి రాలేదు. మోసం జరిగినట్లు గుర్తించిన బాధితుడు సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశాడు.



మహిళకు రూ.2.5 లక్షల టోకరా.. నిందితుడి అరెస్ట్

కేంద్రప్రభుత్వ దర్యాప్తు సంస్థల డైరెక్టర్, చీఫ్ అంటూ పరిచయం చేసుకొని ఉద్యోగం ఇస్తామని చెప్పి మహిళను మోసగించిన దేవనహళ్లి నివాసి ప్రవీణ్‌శెట్టి(39) అనే నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంజయ్‌నగర నివాసి శృతి ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిర్వహిస్తోంది. ఈక్రమయంలో ప్రవీణ్‌శెట్టి అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. ఇండియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, నేషనల్ క్రైం బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ సౌత్ ఇన్‌చార్జ్, ఏసీబీలో నేషనల్ డైరెక్టర్‌గా ఉన్నట్లు నకిలీ గుర్తింపుకార్డు చూపించాడు. ఎస్సీ కోటాలో ఉద్యోగం ఇప్పిస్తానని శృతిని నమ్మించాడు. అవసరాలు ఉన్నాయంటూ ఆమె వద్ద రూ.2.5 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బు వెనక్కి ఇవ్వలేదు. డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదుతో కబ్బన్‌పార్కు పోలీసులు గాలింపు చేపట్టి ప్రవీణ్‌శెట్టిని అరెస్ట్ చేశారు.

గోవాకు పశుమాంసం రవాణాను అరికడతాం

- అసెంబ్లీలో మంత్రి ప్రభుచౌహాన్ వెల్లడి

శివాజీనగర: కర్ణాటక నుంచి గోవాకు గోమాంసం తరలిస్తుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పశు సంవర్ధక శాఖ మంత్రి ప్రభు చౌహాన్ తెలిపారు. రాష్ట్రంలో గోవధ నిషేధం అమలైన తరువాత 1,329 కేసులు నమోదు కాగా, 10 వేల పశువులను కాపాడినట్లు చెప్పారు. బుధవారం విధానపరిషత్ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రం నుంచి విచ్చలవిడిగా పశుమాంసం గోవాకు ఎగుమతి అవుతోందని, ప్రభుత్వం ఏం చేస్తోందని పలువురు ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. దీనికి మంత్రి స్పందిస్తూ పశు మాంసం వివరాలు తమ శాఖ వద్ద లేవన్నారు. ఆవు, ఎద్దు మాంసం రవాణా చేస్తున్నట్లు తెలిస్తే అడ్డుకుంటామన్నారు.

రోజూ 2 టన్నులు వెళ్తోంది

గోవాకు ప్రతిరోజు 2 టన్నుల మాంసం సరఫరా అవుతోందని అక్కడి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో చెప్పారు, ఆ మాంసం బెళగావి నుండే రవాణా అవుతోంది. ప్రభుత్వం కావాలనే ఈ సమాచారం దాచిఉంచిందని ఎమ్మెల్సీ హరీశ్ కుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రం నుంచి గోవాకు గోమాంసం వెళ్తోందని అంగీకరించిన సర్కారు ఆ వివరాలను ఎందుకు బయట పెట్టడం లేదని ధ్వజమెత్తారు.



బెళగావి నుంచి పశుమాంసం గోవాకు రవాణా అవుతోందని ఆరోపణలున్నాయి

కోవిడ్ మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

రాష్ట్రంలో కరోనా వైరస్ వల్ల మృతిచెందిన కుటుంబాలకు రూ.446 కోట్ల పరిహారం అందించినట్లు రెవెన్యూ శాఖ మంత్రి ఆర్.అశోక్ తెలిపారు. బుధవారం విధానసౌధలో సమావేశాల్లో కాంగ్రెస్ నాయకుల ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పరిహారానికి అర్హులని ఆరోగ్య శాఖ బులెటిన్‌లో పేరు రానివారు ఆ తరువాత దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష, కేంద్రం రూ.50 వేలు ఇవ్వగా మొత్తం రూ.1.50 లక్షలు చొప్పున అందజేసినట్లు తెలిపారు.

బండరాయితో బాది మహిళ హత్య

- హతురాలు కొన ఊపిరితో ఉన్నప్పుడు వీడియో చిత్రీకరణ
- ఆత్మహత్య చేసుకున్న నిందితుడు

సాక్షి బెంగళూరు: మహిళను రాయితో బాది హత్య చేసిన వ్యక్తి ఆ దృశ్యాలను వీడియో తీసి ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడు. అనంతరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన చామరాజనగర జిల్లా మలెమహదేశ్వరబెట్ట పరిధిలోని నాగమలెలో జరిగింది. తమిళనాడు పెన్నాగరం చెక్‌పోస్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న లక్ష్మి(35) తన భర్తతో విభేదించి నాగమలెకు చేరుకుంది. తమిళనాడు ధర్మపురి జిల్లా వీరభద్రయ్యనహళ్లికి చెందిన మునిరాజు (40)తో సంబంధం పెట్టుకుంది. ఏడు నెలల క్రితం నాగమలెకు చెందిన రమేశ్ అనే వ్యక్తిని లక్ష్మి రెండో వివాహం చేసుకుంది. మంగళవారం లక్ష్మిని వెతుక్కుంటూ వచ్చిన మునిరాజు.. కోపంతో లక్ష్మి తలపై రాయితో బాది హత్య చేశాడు. అంతకుముందు కొన ఊపిరితో ఉన్న సమయంలో ఆమె వద్ద కూర్చొని వీడియో రికార్డు చేసి ఫేస్‌బుక్‌లో పెట్టాడు. 'నా లక్ష్మిని నేను రాయితో బాది చంపేశాను.. నన్ను హంతకుడిగా మార్చింది' అంటూ మునిరాజు వీడియోలో వ్యాఖ్యలు చేశాడు. అనంతరం బొమ్మ అనే వ్యక్తి పొలంలో చెట్టుకు ఉరి వేసుకుని మునిరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మి భర్త రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలెమహదేశ్వరబెట్ట పోలీసులు కేసు నమోదు చేశారు.

మండ్య వద్ద బీజేపీ బైక్ ర్యాలీ

మండ్య: కేఆర్ పేట ఉప ఎన్నిక నుంచి జిల్లాలో రాజకీయ మార్పు మొదలైందని, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు ఖాయంగా కనిపిస్తోందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి అన్నారు. బుధవారం మండ్య తాలూకా ఇండువాళు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ ఇతర పార్టీల నుంచి ఇటీవల బీజేపీలోకి చాలా మంది యువకులు చేరారని వెల్లడించారు. మండ్యలో ఎక్కువ స్థానాలు గెలుపొంది బీఎస్ యడియూరప్పకు బహుమానంగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. మంత్రి కేసీ నారాయణ గౌడ మాట్లాడుతూ అతి త్వరలో మండ్యకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రానున్నారని వెల్లడించారు. రాష్ట్రంలో తొలిసారిగా మండ్యలో యువ మోర్చా సమావేశం జరగడం సంతోషంగా ఉందన్నారు. జేడీఎస్ కుటుంబ పార్టీ అని వారు దుయ్యబట్టారు. ఈ సందర్భంగా బీవై విజయేంద్ర, సీటీ రవి, కేసీ నారాయణ గౌడ ఎంపీ తేజస్వీ సూర్యకు క్రేన్ ద్వారా భారీ మోసంబి పండ్లు, చెరుకు హారాలు వేసి స్వాగతం పలికారు. ఇండువాళు సచ్చిదానంద నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు.



ర్యాలీలో పాల్గొన్న కార్యకర్తలు

లోకాయుక్త వలలో గ్రామ సహాయకుడు



లోకాయుక్తకు చిక్కిన శివణ్ణ

యశవంతపుర: లంచం తీసుకుంటూ గ్రామ సహాయకుడు లోకాయుక్తకు చిక్కాడు. హక్కుపత్రం కావాలంటూ చిక్కమగళూరు జిల్లా కడూరు తాలూకాలోని ఓ వ్యక్తి గ్రామ సహాయకుడు శివణ్ణను ఆశ్రయించాడు. పనిజరగాలంటే రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా మొదటి విడతగా రూ.3వేలు ఇచ్చాడు. మిగతా రూ.7వేల మొత్తాన్ని బుధవారం తన కార్యాలయంలో తీసుకుంటుండగా లోకాయుక్త డీఎస్పీ తిరుమలేశ్ తన సిబ్బందితో దాడి చేసి శివణ్ణను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్ట్ చేశారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్టు

బాగేపల్లి: బాగేపల్లి పట్టణంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగలు పట్టుబడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా అమడగూరుకు చెందిన సురేశ్, గోరంట్లకు చెందిన అశోక్‌ను బాగేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. రూ. 3 లక్షల విలువైన 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బాగేపల్లి బస్టాండ్ వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను నిందితులు ఈనెల 3న చోరీ చేశారు. దీనిపై గుడిబండ తాలూకా సోమేశ్వర గ్రామానికి చెందిన సయ్యద్ హుస్సేన్ బాగేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గాలింపు చేపట్టగా నిందితులు పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, (ఇన్‌సెట్‌లో) నిందితులు సురేశ్, అశోక్

ఆకతాయిపై పోక్సో కేసు

యశవంతపుర: విద్యార్థినిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆకతాయిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. దక్షిణ కన్నడ జిల్లా బెళ్లారె గ్రామానికి చెందిన కోలంబళ నివాసి అశ్రఫ్...కాలినడకన పాఠశాలకు వెళ్తున్న ఓ విద్యార్థినిపట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. నీ తల్లీ ఫోన్ నంబర్ నుంచి కాల్ చేయాలని హుకుం జారీ చేశాడు. బాధితురాలి తల్లదండ్రులిచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

వైభవం... సిద్ధేశ్వరుడి చిన్నరథోత్సవం

హేమావతి(అమరాపురం): మండలంలోని హేమావతిలో వెలసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి చిన్నరథోత్సవం వైభవంగా సాగింది. శివ..శివా, సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కు జై అంటూ నినదిస్తూ వేలాది మంది భక్తులు రథాన్ని ముందుకు లాగారు. కాగా మంగళవారం రాత్రి ముత్యాల పల్లకీలో ఆది దంపతులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ మంజునాథ్, ఈఓ నాగేంద్రప్రసాదరావు, సర్పంచ్ తిప్పేస్వామి తదితరులు పర్యవేక్షించారు. సీఐ సురేష్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహించనున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

విహారయాత్రలో విషాదం

- ఈత కొడుతూ విద్యార్థి మృతి



విద్యార్థి గుప్త(ఫైల్)

యశవంతపుర: విహార యాత్రకు విచ్చేసిన బాలుడు ఈత కొడుతూ నీట మునిగి మృతి చెందాడు. బీదర్‌కు చెందిన ఆశీశ్ గుప్తా(15) స్నేహితులతో కలిసి కలబురిగికి విహారయాత్రకు వెళ్లాడు. కలబురిగి నగరంలోని శ్రీరామతీర్థ ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం సమీపంలోని కాలువలో ఈత కొడుతూ ఆశీశ్ గుప్త నీట మునిగి మృతి చెందాడు. అగ్నిమాపక సిబ్బంది, కలబురిగి సబ్ అర్బన్ పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మైసూరు: జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా ఒక మహిళ గాయపడింది. మైసూరు విజయనగర రెండో దశ నివాసి ఎస్.మంజునాథ్ (22) తన అత్త నాగమ్మతో కలిసి బైక్‌పై మైసూరు తాలూకా వరకోడు వైపు నుంచి పిల్లహళ్లిలోని తన ఇంటికి వెళ్తుండగా మైసూరు నుంచి టీ.నరసీపురకు వెళుతున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొంది. మంజునాథ్ మరణించగా తీవ్రంగా గాయపడిన నాగమ్మను మైసూరు కేఆర్ ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని...

గుర్తు తెలియని వాహనం ఢీకొని దేవయ్యనహుండి గ్రామానికి చెందిన మంజునాథ్ (38)అనే వ్యక్తి మృతి చెందాడు. ఈయన మైసూరులో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మైసూరు-మానదవాడి రోడ్డు శ్రీ లక్ష్మి వేంకటేశ్వర కల్యాణ మంటపం వద్ద పనులు ముగించుకుని కాలి నడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మంజునాథ్ అక్కడికక్కడే మరణించాడు. మైసూరు దక్షిణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మోదీ వందసార్లు వచ్చినా ఫలితం ఉండదు

-మాజీ సీఎం సిద్ధరామయ్య

యశవంతపుర: బీజేపీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు నళీన్‌కుమార్ కటీల్, జాతీయ అధ్యక్షుడు జెపీ నడ్డాకు రాజకీయ పరిజ్ఞానం లేదని మాజీ సీఎం సిద్ధరామయ్య విమర్శించారు. ఆయన బుధవారం చిత్రదుర్గలో విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్‌కు సిద్ధాంతాలు లేవని జేపీ నడ్డా విమర్శిస్తున్నారని, అయితే ప్రజలను రెచ్చగొట్టేలా ద్వేష రాజకీయాలకు పాల్పడటం తప్ప బీజేపీకి సిద్ధాంతం ఏమీ లేదని మండి పడ్డారు. హోంమంత్రి అమిత్‌షా, ప్రధాని మోదీ నూరు సార్లు కర్ణాటకకు వచ్చినా ఎన్నికల్లో బీజేపీ గెలవటం అసాధ్యమన్నారు. తాగునీటి కేంద్రాల స్థాపనలో భారీ అవినీతి జరిగిందని, దీనిపై విచారణ జరిపించాలన్నారు.

అప్పు మాల ధరించనున్న అభిమానులు

సాక్షి బెంగళూరు: దివంగత నటుడు పవర్‌స్టార్ పునీత్ రాజ్‌కుమార్(అప్పు)ను దేవుడిలా కొలిచే అభిమానులు అప్పు మాల పేరుతో దీక్షలు చేపట్టనున్నారు. మార్చి 1 నుంచి అప్పు పుట్టినరోజు మార్చి 17 వరకు మాల ధరించి వ్రతం చేసేందుకు అభిమానులు సిద్ధమయ్యారు. 'మాల ధరించిన వారు పునీత్ పుణ్యభూమిని దర్శించుకుని హంపి నదిలో పవిత్ర స్నానం చేసి విరూపాక్షేశ్వర దేవునికి పూజలు చేసి మాలను విసర్జించాలి' అని పోస్టర్లు వెలిశాయి.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

మైసూరు: విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన దక్షిణ కొడగు నాల్కేరిలో జరిగింది. అసోంకు చెందిన అబ్రుద్దీన్.. నాల్కేరిలో శివాచార్ వినయ్ అనే వ్యక్తికి చెందిన పొలంలో కరివేపాకు కోస్తుండగా విద్యుత్ తీగలు తగిలాయి. అబ్రుద్దీన్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మరణించాడు. కుట్ట పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

హోసూరు వార్తలు..

అలసనత్తంలో జల్లికట్టు



పరుగులు తీస్తున్న వృషభాలు

హోసూరు: హోసూరు సమీపంలోని అలసనత్తం గ్రామంలో బుధవారం జల్లికట్టును ఉత్సాహంగా జరుపుకొన్నారు. హోసూరు, డెంకణీకోట, సూళగిరి, బేరికె, బాగలూరు తదితర ప్రాంతాల నుంచి రైతులు ఎద్దులను తీసుకెళ్లి పరుగెత్తించారు. యువకులు ఎద్దులను నిలువరించేందుకు ప్రయత్నించారు. హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ప్రజలు పాల్గొని వీక్షించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

హత్య కేసులో ఇద్దరు అరెస్టు

హోసూరు: మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన హోటల్ యాజమాని హత్య కేసులో రౌడీతో పాటు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని అగ్రహారం గ్రామానికి చెందిన మురళి (31) తళిలో హోటల్ నిర్వహిస్తున్నాడు. గత 19వ తేదీ రాత్రి మురళి, అతని మిత్రులతో కలిసి ఎస్.కురుబట్టి వద్ద జరిగిన అంకాళ పరమేశ్వరి ఆలయ జాతరకెళ్లాడు. ఈ సమయంలో ఉళి వీరనపల్లి గ్రామానికి చెందిన రౌడీ సందీప్ (22), శేఖర్ (26)లు మురళిని హత్య చేసి పరారయ్యారు. పాత గొడవలే హత్యకు కారణమని సమాచారం. మత్తిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో సందీప్ 2021లో మత్తిగిరి వద్ద జరిగిన ఓ హత్య కేసులో నిందితుడు.

అభివృద్ధి పనులు ప్రారంభం



భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కెలమంగలం సమితి బైరమంగలం గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులకు తళి ఎమ్మెల్యే టి.రామచంద్రన్ బుధవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. బైరమంగలం పంచాయతీలో మౌలిక వసతులను కల్పించాలని ప్రజలు కోరుతూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ, పాఠశాల భవనం తదితరాల పనులు ప్రారంభించారు. యూనియన్ ఉపాధ్యక్షులు శ్రీనివాసన్, పంచాయతీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పై నుంచి పడి బేల్దారు మృతి

హోసూరు: నిర్మాణ పనుల్లో విధులు నిర్వహిస్తున్న బేల్దారు జారి కింద పడి మృతి చెందిన ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలక్కోడు సమీపంలోని జిట్టాండహళ్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శక్తి (35) పట్టణంలోని శివకుమార్‌నగర్‌లో మూడంతస్తుల భవనంపైన నిర్మాణ పనులు చేస్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు తగలడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మత్తిగిరి పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

దివ్యాంగులకు వైద్య శిబిరం



శిబిరానికి హాజరైనవారు

హోసూరు: విద్యాశాఖ ద్వారా దివ్యాంగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం హోసూరు బీడీవో కార్యాలయ ఆవరణలో శిబిరం నిర్వహించగా, 18 ఏళ్లలోపు ఉన్న దివ్యాంగులు, విద్యార్థులు సుమారు 200 మందికిపైగా పాల్గొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు పాల్గొని దివ్యాంగులకు వైద్య చికిత్సలందజేశారు. ఈ శిబిరానికి మంచి స్పందన లభించిందని విద్యాశాఖాధికార్లు తెలిపారు.

నగలు చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

యశవంతపుర: బంగారు నగలను చోరీ చేసిన నిందితుడిని చిత్రదుర్గ పోలీసులు అరెస్ట్ చేశారు. చిత్రదుర్గ తాలూకా భీమసముద్రకు చెందిన డీఎం ప్రసన్న అన్న కుమార్తె వివాహం బెంగళూరులో ఈనెల 17న జరిగింది. పెళ్లి కుమార్తె కోసం ప్రసన్న బంగారు నగలు కొనుగోలు చేసి వాటిని తీసుకొని కుటుంబంతో కలిసి కారులో బెంగళూరు వెళ్లాడు. ఈక్రమంలో నగలు గల్లంతయ్యాయి. దీంతో ఈనెల 21న ప్రసన్న చిత్రదుర్గ గ్రామాంతర పోలీసులకు ఫిర్యాదు చేశారు. కారు డ్రైవర్ ఓంకారప్పను అదుపులోకి తీసుకొని విచారించగా సొత్తును దొంగలించినట్లు అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

క్రిష్ణగిరి: వేపనపల్లి నియోజకవర్గం కొమ్మేపల్లి గ్రామ పంచాయతీ అగరం గ్రామంలో రూ. రూ.10.19 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని యూనియన్ చైర్‌పర్సన్ లావణ్య మధు బుధవారం ప్రారంభించి పిల్లల వినియోగానికి తీసుకొచ్చారు. పంచాయతీ అధ్యక్షులు దేవరాజ్, బీడీవో గోపాలక్రిష్ణన్, కౌన్సిలర్ మునిరత్న, ఆశోగన్, జానకియమ్మ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చింతామణి: కొనుగోలు చేసిన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారనే ఆవేదనతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కంచార్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరకమాకలహళ్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకొంది. వివరాలు.. గ్రామానికి చెందిన మంజునాథ్‌రెడ్డి (40) కొన్నాళ్లు బెంగళూరులో ఆటో నడిపాడు. 2016లో జాలహోబళి మరకుకుంటె గ్రామపంచాయతీ పరిధిలో స్థలం కొని భార్యపేరుపై రిజిస్టర్ చేయించాడు. ఆ స్థలాన్ని బంధువులు కబ్జా చేశారు. పలుమార్లు పెద్దలతో పంచాయితీలు చేసినా ఫలితం లేకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో మనోవేదనకు గురైన మంజునాథ్‌రెడ్డి స్వగ్రామంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శరణార్థి అనుమానాస్పద మృతి

హోసూరు: హోసూరు సమీపంలోని కెలవరపల్లి వద్ద నివాసముంటున్న శ్రీలంక శరణార్థుడు రుడు రాజీవన్ (33) మృతి చెందాడు. ఇతనికి తాగుడు అలవాటుండేది. మంగళవారం సాయంత్రం కెలవరపల్లి వద్ద ఒక పొలంలో శవమై కనిపించాడు. విషయాన్ని స్థానికులు హడ్కో పోలీసులకు తెలుపగా వారు చేరుకొని శవాన్ని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

ఎమ్మెల్యేకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

శివాజీనగర: విధానసభ ఎన్నికలకు నోటిఫికేషనే వెలువడలేదు. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల జాబితా కూడా ప్రకటించలేదు. అయినప్పటికీ శివాజీనగర కాంగ్రెస్ ఎమ్మెల్యే రిజ్వాన్ హర్షద్‌కు మద్దతుగా కార్యకర్తలు, అభిమానులు నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. ఎమ్మెల్యే సైతం అటు అభివృద్ధి పనులు, ఇటు ప్రచారంలో పాల్గొంటున్నారు. గత ఎన్నికల్లో మాజీ మంత్రి ఆర్.రోషన్ బేగ్ రాజీనామాతో ఖాళీ అయిన ఈ స్థానానికి ఉప ఎన్నికలు నిర్వహించగా రిజ్వాన్ హర్షద్ తొలిసారిగా ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రిజ్వాన్ హర్షద్‌కు టికెట్ లభిస్తుందని చెబుతూ కార్యకర్తలు కాంగ్రెస్ హయాంలో చేపట్టిన పథకాలపై ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. రామస్వామి పాళ్య వార్డు పరిశీలకునిగా నియమితులైన పటేల్ శీనా నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు ప్రచారంలో పాల్గొంటున్నారు.



రామస్వామి పాళ్య వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

క్లుప్తంగా...

వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ టాపర్‌గా నమ్రత

ఎంబీబీఎస్ ఫైనల్ ఫలితాల్లో 900కు గాను 752 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తాజాగా విడుదల చేసిన ఎంబీబీఎస్ ఫైనలియర్ ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ విద్యార్థిని పి.నమ్రత రాష్ట్ర స్థాయిలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఆమెతో పాటు ఎం.యదునందన్, టి.కీర్తన, చిన్నవెంకటసాయి వంశీకృష్ణ, సి.సాయితరుణ్ డిస్టింక్షన్ సాధించారు. వీరిలో నమ్రత 900 మార్కులకు గాను 752 మార్కులతో స్టేట్ ఫస్ట్‌గా నిలిచారు. అలాగే ఆమె జనరల్ మెడిసిన్ సబ్జెక్టులో 300 మార్కులకు గాను 264 మార్కులతో యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. కర్నూలు మెడికల్ కాలేజీలోనూ ఆమె జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ సబ్జెక్టుల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఆమెతో పాటు టి.కీర్తన, సి.సాయివంశీకృష్ణలు సైతం గైనకాలజీ విభాగంలో, ఎం.యదునందన్ పీడియాట్రిక్స్ విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించారు.

అసిస్టెంట్ కన్జర్వేటర్‌గా ఎంపికైన వారికి మెడికల్ టెస్టులు

సాక్షి, అమరావతి: అటవీ శాఖలోని అసిస్టెంట్ కన్జర్వేటర్ పోస్టులకు ఎంపికైన వారికి వాకింగ్ టెస్టు, మెడికల్ టెస్టులను నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ బుధవారం తెలిపింది. ఈ టెస్టులకు ఎంపికైన వారి జాబితాను ' https:// psc.ap.gov.in' వెబ్‌సైట్‌లో పొందుపరచింది. అభ్యర్థుల వారీగా వాకింగ్ టెస్టు, మెడికల్ టెస్టుల తేదీ, సమయాలను తరువాత తెలియజేయనుంది. బీసీ సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్–2 (ఉమెన్) పోస్టులకు ఎంపికైన వారి జనరల్ ర్యాంకింగ్ జాబితాలను వైఎస్సార్ కడప, విశాఖ జిల్లాలకు తదుపరి ప్రక్రియల కోసం పంపినట్లు ఏపీపీఎస్సీ తెలిపింది.

రూ.715 కోట్లతో కుప్పానికి రెండు రిజర్వాయర్లు

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఎస్ఈ రాజగోపాల్

బి.కొత్తకోట: ఏపీఆర్ హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశలో భాగమైన కుప్పం ఉపకాలువలో అంతర్భాగంగా రెండు కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.715.17 కోట్ల అంచనాతో ప్రభుత్వానికి నివేదికలు పంపామని ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజినీర్ సీఆర్.రాజగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలం మీదుగా సాగే హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువపై నిర్మించిన మూడు ఎత్తిపోతల పథకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం గుడిపల్లె మండలం ద్రావిడ విశ్వవిద్యాలయం సమీపంలోని యామిగానిపల్లె వద్ద పెద్దనాయునిచెరువును యామిగానిపల్లె రిజర్వాయర్‌గా ఆధునికీకరించి నీటినిల్వ సామర్థ్యాన్ని 0.7 టీఎంసీలకు పెంచుతామని చెప్పారు. శాంతిపురం మండలంలోని మాడినపల్లె సమీపంలోని పెద్దన్నచెరువు నీటినిల్వ సామర్థ్యాన్ని 0.3 టీఎంసీలకు పెంచి మాడినపల్లె రిజర్వాయర్‌గా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. యామిగానిపల్లె, మాడినపల్లె రిజర్వాయర్లకు కుప్పం ఉపకాలువ నుంచి నీటిని మళ్లించి తరలించనున్నట్లు తెలిపారు. కాగా కుప్పం ఉపకాలువలో పెండింగ్ పనుల్లో రూ.30కోట్ల పనులు పూర్తి చేయించామని చెప్పారు.

'మైనర్ మినరల్స్'పై చెన్నైలో రోడ్ షో

భారీగా పాల్గొన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

సాక్షి, అమరావతి: ఏపీలో అపారంగా ఉన్న ఖనిజ వనరుల మైనింగ్ వైపు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించేందుకు గనుల శాఖ బుధవారం చెన్నైలో రోడ్ షో నిర్వహించింది. ఫిక్కీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రోడ్ షోలో దాదాపు 200 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్ వీజీ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఏపీలోని మైనింగ్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని వివరించారు. రాష్ట్రంలో దాదాపు 6 వేల హెక్టార్లలో చిన్న తరహా ఖనిజ నిల్వలున్నాయని.. వీటిని వెలికితీయడం ద్వారా పారిశ్రామిక ప్రగతిని సాధించవచ్చన్నారు. లీజుల జారీలో ఎటువంటి జాప్యం, పక్షపాతం లేకుండా సులభతరమైన విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పలు రాష్ట్రాల్లో ఈ తరహా రోడ్ షోలు నిర్వహించడం ద్వారా ఔత్సాహికుల్లో అవగాహనను పెంచుతున్నామని.. వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నామని చెప్పారు. ఈ నెల 25న హైదరాబాద్, 27న భువనేశ్వర్, మార్చి 2న బెంగళూరులో రోడ్ షోలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఏబీడీఎం అమలుకు స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఏబీడీఎం) కార్యక్రమం అమలునకు పోస్టుల భర్తీ కోసం స్క్రీనింగ్ కమిటీని వైద్య శాఖ ఏర్పాటు చేస్తూ బుధవారం ఆ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులిచ్చారు. కమిటీకి వైద్య శాఖ ముఖ్యకార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్, ఏపీ వీవీపీ కమిషనర్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సీఈవో, సమాచార, సాంకేతిక శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు.



అవుటాఫ్ కవరేజ్

దేశంలో ఇంకా 38,901 గ్రామాల్లో మొబైల్ కవరేజీ లేదు

- మారుమూల గ్రామాల్లో వాణిజ్యపరంగా ఆచరణీయం కానందునే..
- దేశంలో 6.44 లక్షల గ్రామాలుండగా 6.05 లక్షల గ్రామాలకు మొబైల్ కవరేజ్
- ఏపీలో 2,971 మారుమూల గ్రామాలకు లేదు
- అత్యధికంగా ఒడిశాలో 6,592 గ్రామాలకు..
- ఈ 4జీ మొబైల్ సేవల కోసం రూ.26,316 కోట్లతో ప్రాజెక్టు
- ఇటీవల పార్లమెంట్‌లో ప్రకటించిన కేంద్ర కమ్యునికేషన్ మంత్రిత్వ శాఖ

దేశంలో ఆయా రాష్ట్రాల్లో మొబైల్ కనెక్టివిటీలేని గ్రామాల సంఖ్య..

రాష్ట్రం	గ్రామాలు
ఒడిశా	6,592
రాజస్థాన్	3,316
మహారాష్ట్ర	3,121
మధ్యప్రదేశ్	3,092
అరుణాచల్‌ప్రదేశ్	3,081
ఆంధ్రప్రదేశ్	2,971
మేఘాలయ	2,428
అస్సాం	2,083
జార్ఖండ్	2,072
ఛత్తీస్‌గఢ్	1,887
హిమాచల్ ప్రదేశ్	1,482
కర్ణాటక	1,121
జమ్ము-కశ్మీర్	822
గుజరాత్	567
మణిపూర్	470
నాగాలాండ్	420



సాక్షి, అమరావతి : దేశంలో 38,901 మారుమూల గ్రామాలకు ఇంకా మొబైల్ కవరేజ్ లేదని కేంద్ర కమ్యునికేషన్ మంత్రిత్వ శాఖ ఇటీవల పార్లమెంట్‌లో వెల్లడించింది. వాణిజ్యపరంగా ఇది సాధ్యం కాకపోవడంతోపాటు జనాభా అక్కడక్కడ కొద్దికొద్దిగా ఉండడమే ఇందుకు కారణమని తెలిపింది. దేశంలో మొత్తం 6,44,131 గ్రామాలుండగా 6,05,230 గ్రామాలకు మొబైల్ కవరేజ్ ఉందని, మిగతా 38,901 గ్రామాలకు లేదని వివరించింది. అత్యధికంగా ఒడిశా రాష్ట్రంలో 6,592 గ్రామాలకు.. ఆ తరువాత రాజస్థాన్‌లో 3,316 గ్రామాలకు మొబైల్ కవరేజ్ లేదు. ఆంధ్రప్రదేశ్‌లో 2,971 గ్రామాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.

రూ.26,316 కోట్లతో ప్రాజెక్టు

దేశవ్యాప్తంగా మొబైల్ కవరేజ్ లేని గ్రామాల్లో 4జి మొబైల్ సేవలను దశల వారీగా సంతృప్త స్థాయిలో కల్పించడానికి రూ.26,316 కోట్ల వ్యయంతో ప్రాజెక్టును రూపకల్పన చేసినట్లు కేంద్ర కమ్యునికేషన్ మంత్రిత్వ శాఖ తెలిపింది. రెండో దశలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఈ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.2,211 కోట్ల అంచనాతో ప్రాజెక్టును చేపడుతున్నట్లు వెల్లడించింది. అలాగే, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రస్తుతమున్న 2జీ టెక్నాలజీని రూ.2,425 కోట్ల అంచనా వ్యయంతో 4జీ టెక్నాలజీ స్థాయికి పెంచనున్నామని పేర్కొంది. అంతేకాక.. ఈశాన్య రాష్ట్రాల్లో కూడా ఈ సేవలను అందించడానికి రూ.3,673 కోట్ల వ్యయం అంచనాతో పథకాలను చేపడుతున్నట్లు కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, ఒడిశాలోని 7,287 గ్రామాలకు.. అలాగే, ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని 502 గ్రామాలకు 4జీ మొబైల్ కనెక్టివిటీని అందించడానికి రూ.7,152 కోట్ల అంచనాతో ప్రాజెక్టును చేపడుతున్నట్లు కేంద్రం తెలిపింది.

పయ్యావుల భద్రత పునరుద్ధరణకు ఆదేశాలిస్తాం

- ఐదారుగురు సిబ్బంది పేర్లు ఇవ్వండి..
- అందులో ఇద్దరిని భద్రతకు నియమిస్తాం
- హోంశాఖకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు భద్రత పునరుద్ధరణకు తగిన ఆదేశాలు ఇస్తామని హైకోర్టు స్పష్టం చేసింది. ఐదుగురు లేదా ఆరుగురు పోలీసు భద్రతా సిబ్బంది పేర్లను తమకు ఇవ్వాలని, అందులో నుంచి ఇద్దరిని భద్రతా సిబ్బందిగా నియమిస్తామని పేర్కొంది. విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. తనకు గతంలో ఉన్న భద్రతను పునరుద్ధరించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ కేశవ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేశవ్ తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ.. పోలీసు భద్రతను పునరుద్ధరించాలని కోరినా ప్రయోజనం లేకపోవడంతో కోర్టుకొచ్చామన్నారు. గతంలో పిటిషనర్ వద్దే పనిచేసిన భద్రత సిబ్బందిని కొనసాగించేలా ఆదేశాలివ్వాలని కోరారు.

భద్రతను మేం తొలగించలేదు..

ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. భద్రతను తొలగించామన్న పిటిషనర్ వాదన అవాస్తవమని చెప్పారు. పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను మార్చామన్న కారణంతో ఇతర భద్రత సిబ్బందిని కూడా పిటిషనరే వెనక్కి పంపారని తెలిపారు. భద్రత కల్పన విషయంలో ప్రభుత్వం జీవో ప్రకారం రొటేషన్ విధానాన్ని అనుసరిస్తోందన్నారు. పిటిషనర్ కోరిన వారినే భద్రతా సిబ్బందిగా ఇవ్వలేమని చెప్పారు. అలా ఇస్తే రేపు ప్రతి ఒక్కరు ఫలానావారే తమకు కావాలని కోరతారని పేర్కొన్నారు. 2+2గా ఉన్న భద్రతను 1+1కి కుదించడంపై కౌంటర్ దాఖలు చేశామన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ.. ఆ ప్రాంతంలో ఉండే ప్రత్యేక పరిస్థితులపై తనకు అవగాహన ఉందని చెప్పారు. పిటిషనర్‌కు భద్రతను పునరుద్ధరించేందుకు తగిన ఆదేశాలిస్తామని, ఐదారుగురు సిబ్బంది పేర్లు ఇస్తే అందులో ఇద్దరిని భద్రతా సిబ్బందిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేస్తానని తెలిపారు.

ఏప్రిల్ 11న రాష్ట్ర విభజన కేసు విచారణ

ఆదేశాలు జారీ చేసిన సుప్రీం కోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజనకు సంబంధించి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌ను ఏప్రిల్ 11న విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. 2014లో రాష్ట్ర విభజన అనంతరం రెండు రాష్ట్రాల్లో రెండుసార్లు ఎన్నికలు జరగడంతో ఉండవల్లి అరుణ్‌కుమార్ తన పిటిషన్‌లో అభ్యర్థనను మార్చారు. రాష్ట్రాలకు సంబంధించి ఆస్తులు, అప్పుల వ్యవహారాలను త్వరగా తేల్చాలని, ఆంధ్రప్రదేశ్‌కు లబ్ధి చేకూరేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై గతేడాది నవంబరు 28న విచారణకు రాగా ఫిబ్రవరి 22న విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. ఇదిలా ఉంటే ఈ నెల14న సుప్రీంకోర్టు ఓసర్క్యులర్ జారీ చేసింది. ఓసారి నోటీసు అయిన అంశాలను బుధ, గురువారాల్లో విచారించబోమని అందులో స్పష్టంచేసింది. దీంతో బుధవారంనాటి విచారణ జాబితా నుంచి ఈ కేసును రిజిస్ట్రీ తొలగించారు. దీంతో ఉండవల్లి తరఫు న్యాయవాది అల్లంకి రమేశ్ మంగళవారం సాయంత్రం కోర్టు పనివేళల ముగింపు అనంతరం జస్టిస్ కేఎం జోసెఫ్ ధర్మాసనం ముందు ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఈ పిటిషన్‌ను కనీసం పది, పదిహేను రోజులు విచారించాల్సి ఉంటుందని, మూడు నెలల్లో తన పదవీ విరమణ ఉందని జస్టిస్ జోసెఫ్ గుర్తుచేశారు. అన్ని రోజులు అవసరంలేదని రమేశ్ వివరించారు. దీంతో ఏప్రిల్ 11న విచారణ చేపడతామని, ఆ రోజు జాబితాలో చేర్చాలని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. మంగళవారం అర్ధరాత్రి సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఈ ఆదేశాలు ఉంచింది.

తనపై రెండు కేసులు కొట్టేయాలంటూ రఘురామకృష్ణరాజు పిటిషన్లు

విచారణ నుంచి తప్పుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి

సాక్షి, అమరావతి: పశ్చిమ గోదావరి జిల్లాలో తనపై నమోదైన రెండు కేసులను కొట్టేయాలని కోరుతూ నరసాపురం ఎంపీ కనుమూరు రఘురామకృష్ణరాజు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి ముందు విచారణకు వచ్చాయి. ఈ వ్యాజ్యాలను పరిశీలించిన న్యాయమూర్తి.. విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాజ్యాలపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం ఉందని పిటిషనర్ న్యాయవాది ఉమేష్‌చంద్ర చెప్పారు. దీంతో ఈ వ్యాజ్యాలను మరో న్యాయమూర్తి ముందుంచేందుకు ఫైళ్లను సీజే ముందుంచాలని జస్టిస్ శ్రీనివాసరెడ్డి రిజిస్ట్రీని ఆదేశించారు..

మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా విలేజ్ క్లినిక్స్

సీహెచ్‌వోల పనితీరుపై నెలనెలా సమీక్ష

సాక్షి, అమరావతి: వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ద్వారా గ్రామీణులకు మెరుగైన సేవలు అందించడమే వైద్య, ఆరోగ్య శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా విలేజ్ క్లినిక్‌లలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌వోల) పనితీరును ప్రతినెలా సమీక్షించనున్నారు. ఇందుకు అనుగుణంగా సూచీలను ఖరారు చేశారు. ఆయా సూచీల్లో సీహెచ్‌వోలు కనబరిచిన ప్రతిభ ఆధారంగా పనితీరును అంచనా వేస్తారు. గ్రామాల్లోనే ప్రజలకు వైద్య సేవలందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 10,032 విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో బీఎస్సీ నర్సింగ్ చేసిన వారిని సీహెచ్‌వోలుగా నియమించింది.

14 అంశాల ఆధారంగా..

సీహెచ్‌వోలు ప్రజలకు అందించే సేవలతోపాటు వారి పనితీరును అంచనా వేయడానికి 14 అంశాలను ఖరారు చేశారు. ఈ అంశాల్లో నెల రోజుల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా పనితీరు అంచనా వేస్తారు. సాధారణంగా సీహెచ్‌వోలకు వైద్య శాఖ నెలకు రూ.15 వేల వరకూ పనితీరు ఆధారంగా ప్రోత్సాహకం అందిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రోత్సాహకం అందించడానికి పనితీరు అంచనాలను ప్రామాణికంగా తీసుకుంటారు. విలేజ్ క్లినిక్ పరిధిలోని ప్రజలకు ఓపీ, టెలీ మెడిసిన్ సేవల కల్పన, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వీరికి కౌన్సెలింగ్ చేయడం, ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో చిన్నారుల రిజిస్ట్రేషన్, ఏడాదిలోపు పిల్లలకు ఫుల్ ఇమ్యూనైజేషన్, ఎన్‌సీడీ సర్వే పురోగతి వంటి 14 అంశాల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా పనితీరు అంచనా ఉంటుంది.

12 రకాల వైద్య సేవలు

విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు 12 రకాల వైద్య, 14 రకాల పరీక్షల సేవలు అందిస్తోంది. 67 రకాల మందులు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. టెలీ మెడిసిన్ ద్వారా పీహెచ్‌సీ వైద్యుడితోపాటు హబ్‌లోని జనరల్ మెడిసిన్, గైనిక్, పీడియాట్రిషన్ వంటి స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ సేవలు ప్రజలకు అందుతున్నాయి. మరోవైపు ఫ్యామిలీ డాక్టర్ విధానంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండుసార్లు విలేజ్ క్లినిక్‌లను సందర్శిస్తున్నారు.

తెనాలిలో చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు ప్రారంభం

పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తులు



పోక్సో కోర్టును ప్రారంభించిన జస్టిస్ దుర్గాప్రసాదరావు. జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ కృష్ణమోహన్, జస్టిస్ జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ సుజాత, తదితరులు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలిలోని కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా నిర్మించిన 'చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు' ను బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుర్గాప్రసాదరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ వడ్డిబోయిన సుజాత, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప హాజరయ్యారు. జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ..మైనార్టీ తీరని మహిళలపై జరిగే అత్యాచారాలను అత్యంత త్వరితగతిన విచారణ జరిపించి బాధితులకు న్యాయం, నేరస్తులకు తగిన శిక్ష పడేలా చూడాలని అటు ప్రభుత్వం, ఇటు న్యాయస్థానాలు భావిస్తున్నాయని చెప్పారు. పోక్సో నేరాలను తీవ్రమైనవిగా పరిగణించి సత్వర న్యాయం చేయాలన్న సంకల్పంతో సాధ్యమైనన్ని ఎక్కువ పోక్సో కోర్టులను అవసరమైన ప్రదేశాల్లో నెలకొల్పుతున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే గుంటూరులో పోక్సో కోర్టు ఉన్నప్పటికీ తెనాలిలో కూడా మరో పోక్సో కోర్టును ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. ఇక్కడ 16 మండలాలకు సంబంధించిన పోక్సో కేసులను విచారణ చేస్తారని చెప్పారు.

రక్తహీనత నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- బీ12 మాత్రలను పంపిణీ చేయాలి
- అధికారులతో సమీక్షలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రక్తహీనత నిర్మూలన కోసం చర్యలు చేపట్టాలని అధికారులను వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ఆదేశించారు. బుధవారం మంగళగిరిలోని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ఉన్నతాధికారులతో మంత్రి రజిని సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత లేకుండా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. బాలికలు, గర్భిణులు, బాలింతలకు 3 నెలల కోర్సుగా బీ12 మాత్రలను అందించగలిగితే సమస్యను నివారించవచ్చన్నారు. మాతా, శిశు మరణాల నివారణలో దేశంలోనే ఏపీ టాప్‌లో ఉందని పేర్కొన్నారు. సుస్థిరాభివృద్ధి సూచీల్లో ఇది ఎంతో కీలకమని తెలిపారు. ఇప్పటికే 99.66 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని.. ఇది శుభపరిణామమన్నారు. నూటికి నూరు శాతం కాన్పులు ఆస్పత్రుల్లోనే జరిగేలా చూడాలని ఆదేశించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం నివారణ కోసం వివిధ పథకాల అమలుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఈ ఫలాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్‌ల పంపిణీకి సంబంధించి త్వరలో విద్యా శాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. టీబీ రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఉన్నతాధికారులు ఎంటీ కృష్ణబాబు, జె.నివాస్, డాక్టర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

కన్నాను ఓడించడం గ్యారెంటీ

- ఆయన్ని టీడీపీలోకి తీసుకోవడం బాబుకు తప్ప ఎవరికీ ఇష్టంలేదు
- నన్ను, బాబును కన్నా ఎన్ని మాటలు అన్నారో
- పార్టీకి అవసరమంట.. నరసరావుపేటలో ఎన్ని ఓట్లు వచ్చాయో తెలియదా
- నేనిక చంద్రబాబు వద్దకు వెళ్లను
- పార్టీలో ఇన్నేళ్లు పనిచేశా.. నాకేం చేశారు? ఏమి ఇచ్చారు?
- ఏ స్టేట్‌మెంటూ ఇవ్వొద్దని అచ్చెన్నాయుడు ఫోన్‌చేసి చెప్పారు
- కుండబద్దలు కొట్టిన రాయపాటి సాంబశివరావు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి

'కన్నా లక్ష్మీనారాయణ జిల్లాలో ఎక్కడ పోటీచేసినా ఓడించడం గ్యారెంటీ. ఆయన్ని టీడీపీలోకి తీసుకోవడం చంద్రబాబుకు తప్ప ఎవరికీ ఇష్టంలేదు. కన్నాను టీడీపీలోకి తీసుకోవడం నాకే కాదు.. సీనియర్లందరూ సిగ్గేస్తుందని అంటున్నారు' అని టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలం పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ సోము వీర్రాజుకు ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించి ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. టీడీపీ, జనసేనలో చేరతారనే ఊహాగానాలకు తెరదించుతూ గురువారం ఆయన సైకిల్ ఎక్కనున్నారు. ఈ నేపథ్యంలో రాయపాటి సాంబశివరావు 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. 'నేను చాలా అసంతృప్తితో ఉన్నా. కన్నాను పార్టీలో చేర్చుకోవడం పెద్ద తెలివి తక్కువ పని. నన్ను, చంద్రబాబును కన్నా ఎన్నేసి మాటలు అన్నాడు. పందులు, కుక్కలు, నక్కలు అంటూ వ్యక్తిగతంగా, సామాజికవర్గాన్ని దుమ్మెత్తిపోశాడు. అలాంటి వ్యక్తిని దగ్గరకు తీసుకోవడం ఏమిటి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీకి అవసరమని చంద్రబాబు చెబుతున్నారు. అయినా ఆయన్ను చూసి ఏమిటి భయపడేది? అతనికి ఎన్ని ఓట్లు వస్తాయి. నేను గుంటూరు లోక్‌సభ స్థానానికి, ఆయన పెదకూరపాడు అసెంబ్లీకి పోటీచేసినప్పుడు నాలుగైదు వేల ఓట్లు మెజార్టీ నాకే వచ్చేవి. నరసరావుపేటలో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసినప్పుడు ఓట్లెన్ని వచ్చాయో అందరికీ తెలిసిందే' అంటూ ఎద్దేవాచేశారు.

ఏమాత్రం మంచి పద్ధతి కాదు

'పార్టీలో ఉన్న వారిని చంద్రబాబు దెబ్బతీయడం ఏమాత్రం సరికాదు. అందరి ముడ్డి కిందకు తెస్తున్నారు. అలా చేయడం తప్పు, అన్యాయం. ఇలా చేసుకుంటూ పోతే పార్టీలో ఎవరు నిలబడతారు? ఇలాగైతే నేనిక చంద్రబాబు వద్దకు వెళ్లను. ఎందుకు వెళ్లాలి? పార్టీలో మాకు టికెట్ ఇస్తామంటే తప్ప వెళ్లి కలిసేది లేదు. పార్టీలో ఇన్నేళ్లు పనిచేశా. నాకేం చేశారు? ఏమి ఇచ్చారు' అని ఆవేదన వ్యక్తంచేశారు.

నన్ను మాట్లాడవద్దన్నారు

'చంద్రబాబు ఫోన్ చేశారు. కన్నాను తీసుకుంటున్నాం. నీతో పర్సనల్‌గా మాట్లాడతానన్నారు. అదే విధంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఫోన్ చేసి సార్ హైదరాబాద్ వెళ్లారు. వచ్చాక మీతో మాట్లాడతారు. అప్పటివరకు కన్నా గురించి ఎవరితోనూ మాట్లాడవద్దు. స్టేట్‌మెంట్లు ఇవ్వవద్దు అని చెప్పారు. పార్టీలో కన్నా చేరుతున్నారని ఆఫీసు నుంచి ఎవరో ఫోన్‌చేశారు. నేను రావడంలేదన్నాను. నేను వెళ్లను కూడా' అని రాయపాటి చెప్పారు.

12 ఏళ్లు కోర్టులో కేసు నడిపారు

'కన్నా నాపై 2010లో పరువు నష్టం దావా వేశారు. 12 ఏళ్లు కోర్టులో కేసు నడిపారు. రెండుసార్లు కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది. గత ఏడాది నవంబరు రెండో తేదీ న్యాయమూర్తి ద్వారా రాజీ చేసుకున్నారు. టీడీపీలో చేరాలనుకునే రాజీ కుదుర్చుకున్నట్లు ఉంది. చంద్రబాబుపైనా అనేక కేసులు వేశారు. ఇవన్నీ అందరికీ తెలుసు. అయినా కన్నాను పార్టీలోకి తీసుకోవడమే విచిత్రం' అని రాయపాటి ఆవేదన వ్యక్తంచేశారు.

విజయసాయిరెడ్డికి సంసద్ రత్న అవార్డు

- ఆయన నేతృత్వంలోని రవాణా, పర్యాటక, సాంస్కృతిక స్టాండింగ్ కమిటీకి పురస్కారం
- మొత్తం 13 మంది ఎంపీలకు అవార్డులు
- టీకే రంగరాజన్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం
- అవార్డులకు ఎంపికైనవారికి ప్రధాని అభినందనలు



సాక్షి, న్యూఢిల్లీ: సంసద్ రత్న–2023 అవార్డుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి నేతృత్వంలోని రవాణా, పర్యాటక, సాంస్కృతిక కమిటీ (రాజ్యసభ) ఎంపికైంది. అలాగే బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా నేతృత్వంలోని ఫైనాన్స్ కమిటీ (లోక్‌సభ) కూడా అవార్డుకు నామినేట్ అయ్యింది. ఈ మేరకు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్‌మేఘ్వాల్ నేతృత్వంలోని జ్యూరీ కమిటీ నామినేట్ చేసింది. అదేవిధంగా సంసద్ రత్న–2023 పురస్కారాలకు ఎనిమిది మంది లోక్‌సభ ఎంపీలు, ఐదుగురు రాజ్యసభ ఎంపీలు ఎంపికయ్యారు. ఇక మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం పేరిట ఇచ్చే జీవితకాల సాఫల్య పురస్కారానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీకే రంగరాజన్‌ను జ్యూరీ కమిటీ నామినేట్ చేసింది. ఈ నేపథ్యంలో అవార్డులకు ఎంపికైన ఎంపీలు, స్టాండింగ్ కమిటీల చైర్మన్లను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. ''సంసద్ రత్న పురస్కారాలు అందుకోబోతున్న తోటి ఎంపీలకు నా అభినందనలు. వారు పార్లమెంట్ కార్యకలాపాలను సుసంపన్నం చేయాలని ఆకాంక్షిస్తున్నా'' అని ప్రధాని బుధవారం ట్వీట్ చేశారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి కూడా వారిని ట్విట్టర్ వేదికగా అభినందించారు.

దూసుకొచ్చిన మృత్యువు



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: నిశ్చితార్థానికి వెళ్లి ఆటోలో తిరిగి వస్తోన్న గిరిజన కుటుంబాలపై మృత్యువు లారీ రూపంలో దూసుకువచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో బుధవారం జరిగిన ఈ ఘటనలో ఐదుగురు మరణించారు. తీవ్ర గాయాలతో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిని మెరుగైన వైద్యం కోసం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన మరో ఐదుగురు పార్వతీపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం అంటివలసకి చెందిన 2 కుటుంబాల్లోని 12 మంది గిరిజనులు నిశ్చితార్థం కోసం అదే మండలంలోని తుమ్మలవలసకి వెళ్లారు. మధ్యాహ్న భోజనం తర్వాత తిరిగి సొంత గ్రామానికి ఆటోలో బయల్దేరారు. 20 నిమిషాల్లో ఇళ్లకు చేరతారనగా..చోళ్లపదం శివాలయం మలుపు వద్ద ఆటోను పార్వతీపురం నుంచి కూనేరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జయింది. ప్రయాణిస్తోన్న వారంతా ఎగిరి పడిపోయారు. ప్రమాదంలో ఊయక నరసమ్మ (54), ఊయక లక్ష్మి (48), మెల్లిక శారద(35), మెల్లిక అమ్మడమ్మ(80), ఊయక వెంకట్(55) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయాలైన మిగతా 8 మందిని పోలీసులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో తీసుకువెళ్లారు. వారిలో ఊయక రామస్వామి, ఊయక వెంకటేష్‌ల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యానికి విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, అదనపు ఎస్పీ దిలీప్‌కిరణ్‌లు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పార్వతీపురం ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించి బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని చెప్పారు.

నూతన పద్ధతిలో ఆర్మీ రిక్రూట్‌మెంట్

- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు, ప్రాథమిక పరీక్ష
- 16న నోటిఫికేషన్.. మార్చి 15 వరకు దరఖాస్తులు
- ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు విశాఖలో రిక్రూట్‌మెంట్
- ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ వినయ్‌కుమార్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న కల్నల్ వినయ్‌కుమార్

డాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఆర్మీలో వివిధ పోస్టులకు నియామకాలకు నూతన పద్ధతిని ప్రవేశపెట్టారు. అగ్నివీర్‌లో భాగంగా జూనియర్ కమిషన్ ఆఫీసర్స్ నుంచి ఇతర ర్యాంకుల అధికారుల నియామకాలకు మార్చి నుంచి నూతన పద్ధతిని అమలు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆర్మీ రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ వినయ్‌కుమార్ బుధవారం ఇక్కడ వివరించారు. ఆర్మీలో వివిధ పోస్టులకు ఈ నెల 16న నోటిఫికేషన్ విడుదలైందని, మార్చి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నూతన విధానం ప్రకారం తొలిసారిగా ఆన్‌లైన్ ద్వారా ఆర్మీలో వివిధ పోస్టులు/ర్యాంకులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అభ్యర్థులు రూ.250 ఫీజుతో పాటు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల స్క్రూటినీ అనంతరం ఆన్‌లైన్‌లోనే రాత పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్ష అడ్మిట్ కార్డులను 10 నుంచి 14 రోజుల్లో అభ్యర్థి చిరునామాకు పంపిస్తామన్నారు. ఆన్‌లైన్ టెస్ట్ దేశంలో 176 ప్రాంతాల్లో నిర్వహిస్తామని, అభ్యర్థి ఎంచుకున్న ప్రాంతానికి వెళ్లి పరీక్ష రాసుకోవచ్చని చెప్పారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. ఇందులో అర్హత సాధించిన వారిని వైద్య పరీక్షలకు పిలుస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ విశాఖపట్నంలో జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు www.oji ni ndi narm y.nic.i n వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు హెల్ప్‌డెస్క్ నెంబరు 7996157222 లో సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో రిక్రూట్‌మెంట్ మెడికల్ ఆఫీసర్ మేజర్ జీఎస్ రంద్వా తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం

14వ ఏట నుంచి డి.ఉమామహేశ్వరి హరికథ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. 'సంస్కృతం'లో హరికథ చెప్పగలిగే ఏకైక మహిళా భాగవతారిణి. తెలుగులో ఆమె చెప్పే హరికథలకు విశేష అభిమానులు ఉన్నారు. ప్రతిష్ఠాత్మక సంగీత్ నాటక్ అకాడెమీ పురస్కారాన్ని న్యూఢిల్లీలో నేడు రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్నారు. అక్కడి రబీంద్ర భవన్‌లో ఫిబ్రవరి 24న ప్రదర్శన ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే...

హరికథే ఆమె కథ

''మాది బందర్ (మచిలీపట్నం). మా నాన్న లాలాజీ రావు నాదస్వర విద్వాంసుడు. వేములవాడ దేవస్థానంలో 30 ఏళ్ల పాటు నాదస్వర వాదన చేశాడాయన. మేము వేములవాడలో ఉన్నా అవకాశం దొరికినప్పుడల్లా బందర్‌కు తీసుకెళ్లేవాడు. అక్కడ నేను హరికథలు వినేదాన్ని. మా చిన్నప్పుడు కోట సచ్చిదానంద శాస్త్రిలాంటి వారు 40 రోజుల పాటు మహాభారతం చెప్పేవారు. జనం విరగబడేవారు. సినిమాహాళ్ల యజమానులొచ్చి హరికథను ముగించమని, జనం సినిమాలకు రావడం లేదని బతిమిలాడేవారు. అలా హరికథ నా మనసులో ముద్ర వేసింది.

హరికథా గురుకులంలో...

తూ.గో.జిల్లా కపిలేశ్వరపురంలో జమీందారు సత్యనారాయణ గారు, వారి శ్రీమతి రాజరాజేశ్వరి గారు డాన్స్ స్కూల్ స్థాపించాలనుకున్నారు. కాని నటరాజ రామకృష్ణ గారు ఇది తెలిసి డాన్స్ స్కూల్స్ చాలా ఉన్నాయి హరికథ కళ అంతరించిపోతోంది... దాని కోసం స్కూల్ తెరువు అనంటే రాజావారు తన తండ్రి పేరున శ్రీ సర్వరాయ హరికథా గురుకులం స్థాపించారు. మా నాన్న ఇది తెలిసి నన్ను అక్కడ చేర్పించారు. 14 ఏళ్ల వయసులో అక్కడ చేరి ఆదిభట్ల నారాయణదాసు ఏ సంప్రదాయం హరికథకు స్థిరపరిచారో ఆ సంప్రదాయంలోనే నేర్చుకున్నాను. నాతో పాటు మరో 40 మంది అమ్మాయిలు హరికథను నేర్చుకున్నారు. హరికథ చెప్పాలంటే సంగీతం, సాహిత్యం, నృత్యం, సంస్కృతం, తెలుగు తెలిసి ఉండాలి. ఆటా పాటా మాట... వీటిని మేటిగా మేళవిస్తూ రక్తి కట్టేలా కథ చెప్పాలి. గురువుల దయవల్ల నేను నేర్చుకోగలిగాను. విజయనగరం సంస్కృత పాఠశాలలో నా తొలి ప్రదర్శన ఇచ్చాను.



సంస్కృతంలో హరికథ

తెలుగులో హరికథలు చాలామంది చెబుతారు. కాని అవి తెలుగువారికి మాత్రమే పరిమితం. దేశంలో వేద విద్యను సంస్కృతంలో అభ్యసిస్తున్న వారు, సంస్కృత స్కాలర్లు, టీచర్లు, ఆ భాష ప్రేమికులు చాలామంది ఉన్నారు. వారి కోసం సంస్కృతంలో హరికథలు చెప్తే బాగుండునని అనుకున్నాను. ఎస్.పి.హెచ్.కృష్ణమాచార్యులు గారు కాళిదాసు కావ్యాలను హరికథలుగా రాసి ఇచ్చారు. ఉజ్జయినిలో సంస్కృత పండితుల ఎదుట 'అభిజ్ఞాన శాకుంతలం' చెప్పడంతో నేను ఆ భాషలో చెప్పే తొలి మహిళను అయ్యాను. కుమార సంభవం, రఘువంశం, ఆది శంకరాచార్య, గీత గోవిందం, భక్త జయదేవ... వీటిని హరికథలుగా సంస్కృతంలో చెబుతున్నాను. 1993లో హార్వర్డ్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ వేదిక్ కాన్ఫరెన్స్ జరిగితే హాజరయ్యి సంస్కృతంలో హరికథ చెప్పాను. ప్రశంసలు పొందాను.

భక్తిమార్గం

కొందరు సినిమా పాటలను కలిపి హరికథలు చెబుతుంటారు. అది నా మార్గం కాదు. సరిగా హరికథ చెప్తే నేటికీ ప్రేక్షకులు ఎందరో వస్తున్నారు. నా దగ్గరకు వచ్చిన ఔత్సాహికులకు ఈ కళను నేర్పిస్తున్నాను. ఆదిభట్ల గారి మునిమనవరాళ్లకు నేర్పించాను. కాని ఈ కళ కోసం మరింత జరగాల్సి ఉంది.

భర్తతో కలిసి

మా ఆయన కళాకృష్ణ ప్రసిద్ధ నాట్యకారుడు. మాకు కొడుకు, కూతురు ఉన్నారు. మేమిద్దరం శక్తి ఉన్నంత కాలం మా కళను ప్రదర్శిస్తూ కొత్త తరాలకు నేర్పిస్తూ ఉండాలని నిశ్చయించుకున్నాం.''

బ్యూటిప్స్



ఏ కాలంలోనైనా జిడ్డు చర్మం బాగా ఇబ్బంది పెడుతుంటుంది. జిడ్డు పోగొట్టి ముఖం ఫ్రెష్‌గా ఉండడానికి ఎగ్, లెమన్ ఫేస్‌మాస్క్ బాగా పనిచేస్తుంది.

ఒక గుడ్డును తీసుకుని దానిలోని తెల్లసొనను ఒక గిన్నెలో వేసి దానికి స్పూను తాజా నిమ్మరసం చేర్చి బాగా కలపాలి. తరువాత ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. ఫేస్‌మాస్క్ ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగి తుడుచుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయడం వల్ల ముఖం మీద జిడ్డు, మొటిమలు తగ్గుతాయి.

టేబుల్ స్పూన్ తేనె, గుడ్డులోని తెల్లసొన కలిపి ముఖానికి ప్యాక్‌లా వేయాలి. పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. జిడ్డును తొలగించి, ముఖాన్ని కాంతివంతంగా మారుస్తుంది ఈ ప్యాక్.

సేవాపథం

ఆ ఊరికి ఆత్మబంధువులు

● మలావి డైరీ

ఉద్యోగం నిమిత్తం భార్య సుమితో కలిసి ఆఫ్రికాలోని మలావి దేశానికి వెళ్లాడు కేరళలోని మలప్పురంకు చెందిన అరుణ్ అశోకన్. అక్కడ ఒక గ్రామంలో శిథిలావస్థలో ఉన్న స్కూల్‌ను చూసి చలించిపోయాడు. ఆ తరువాత భార్యాభర్తలు ఇద్దరూ కలిసి స్కూల్ పునర్నిర్మాణానికి నడుం కట్టారు. తమ కలను సాకారం చేసుకున్నారు...



స్కూలు పిల్లలతో సుమి, అరుణ్ అశోకన్

మలావిలో ఒకరోజు...

తాను పనిచేస్తున్న ప్రదేశానికి చిసాలియా అనే గ్రామం మీదుగా కారులో వెళుతున్నాడు అరుణ్ అశోకన్. వర్షం మొదలైంది. తల మీద పుస్తకాలు, బ్యాగులు పెట్టుకొని స్కూల్ పిల్లలు గుంపులు, గుంపులుగా పరుగెడుతున్నారు.

'వర్షం పడుతున్నప్పుడు స్కూల్లో కూర్చోక ఇలా పరుగెడుతున్నారేమిటి!' అని డ్రైవర్‌ను అడిగాడు అరుణ్.

'అది పేరుకే స్కూలు. గదులు పాడైపోయాయి. పిల్లలందరూ ఆరుబయటే కూర్చుంటారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇలా ఇంటికి పరుగులు తీయాల్సిందే' అని చెప్పాడు డ్రైవర్.



అరుణ్‌కు మనసులో చాలా బాధగా అనిపించింది. ఇంటికి వెళ్లిన తరువాత తన బాధను భార్య సుమితో కలిసి పంచుకున్నాడు.

'బాధపడడం ఎందుకు? మనమే స్కూల్ కట్టిద్దాం' అన్నది సుమి.

నిజానికి ఈ యువదంపతులు సంపన్నులు కారు. అయితే వారు ఆ నిర్ణయం తీసుకునే ముందు 'మనం స్కూల్ కట్టించగలమా?' 'అంత డబ్బు మన దగ్గర ఉందా?' అని ఆలోచించలేదు.

'మనం స్కూల్ కట్టించాలి. అంతే!' అని గట్టిగా అనుకున్నారు. తమ సేవింగ్స్‌ను బయటికి తీశారు. స్కూల్ పునర్నిర్మాణంలో శ్రమదానం చేయడానికి ఊరివాళ్లను ఒప్పించారు.

తమ దగ్గర ఉన్న పొదుపు మొత్తాలతోనే పని కాదనే విషయం ఈ దంపతులకు అర్థమైంది. ఈ పరిస్థితులలో 'మలావి డైరీ' పేరుతో యూట్యూబ్ చానల్‌కు శ్రీకారం చుట్టింది సుమి. ఈ చానల్ ద్వారా వచ్చిన డబ్బు, తమ సేవింగ్స్‌తో లోకాస్ట్ కన్‌స్ట్రక్షన్ టెక్నిక్‌తో స్కూల్ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

స్కూలో ఆవరణలో తోట పెంచారు. లైబ్రరీ ఏర్పాటు చేశారు. ప్లేగ్రౌండ్ తయారుచేశారు.

స్కూల్ ప్రారంభోత్సవాన్ని ఒక పండగలా ఘనంగా జరుపుకున్నారు.

సుమీ, అరుణ్‌లు ఇప్పుడు చిసాలియా ఊరి వాళ్లకు ఆత్మబంధువులయ్యారు.

'స్కూల్‌ను పునర్నిర్మించాలనుకున్నాం. నిర్మించాం. ఇక సెలవ్' అనడం లేదు సుమి, అరుణ్ దంపతులు. పిల్లల చదువుల గురించి కూడా పట్టించుకుంటున్నారు. తమకు సమయం ఉన్నప్పుడల్లా క్లాస్‌రూమ్‌లో పిల్లలతో కలిసి సమావేశం అవుతున్నారు. నాలుగు మంచి విషయాలు చెబుతున్నారు.

'బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగాలు చేయాలి' 'పెద్ద చదువులు చదవడానికి పేదరికం ఎప్పుడూ అడ్డు కాదు'... మొదలైన మాటలను గట్టిగానే చెబుతున్నారు.

కావల్సినన్ని వనరులు సమకూరినప్పుడు కూర్చుని సేద తీరుదామనుకుంటారు చాలామంది. తమ చుట్టూ ఉన్న నలుగురికైనా వారి స్వశక్తిని నమ్ముకునేలా చేయూతనిద్దాం అనుకుంటారు అతి కొద్దిమంది. అలాంటివారిలో కొత్తమాసు కృష్ణవేణి ఒకరు. సికింద్రాబాద్‌లోని టెలికాం కాలనీ, కానాజీగూడలో ఉంటున్న ఈ గృహిణి తన ఇంటినే సేవాకేంద్రంగా మలిచి పదేళ్లుగా మహిళలకు ఉపాధి శిక్షణా కార్యక్రమాలను ఉచితంగా అందిస్తున్నారు.



టైలరింగ్‌లో శిక్షణనిస్తున్న కృష్ణవేణి

ఇల్లే సేవా కేంద్రం

మహిళలకు శిక్షణ ఇస్తూ బిజీగా ఉన్న కృష్ణవేణిని కలిసినప్పుడు, ఆమె సేవామార్గం వివరాలను ఇలా పంచుకున్నారు..

''పదిహేనేళ్ల క్రితం మావారు రంగారావు సత్యసాయి సేవాకార్యక్రమాలలో పాల్గొనేవారు. నేనూ ఆ కార్యక్రమాలకు వారి వెంట వెళ్లేదాన్ని. ఆ సమయంలోనే గ్రామాలలోని మహిళలకు స్వయం ఉపాధికి పనికి వచ్చే కార్యక్రమాలు చేస్తే బాగుంటుందనుకున్నాను. అప్పుడే మల్లాపూర్ గ్రామంలో మొట్ట మొదటిసారిగా నాకు వచ్చిన కుట్టు పనులను అక్కడి మహిళలకు నేర్పించి, వారికి ఆదాయ మార్గం చూపటం సంతృప్తినిచ్చింది.


పిల్లలకు ఫ్రీ ట్యూషన్ చెప్తున్న కృష్ణవేణి

ఇంటి వద్ద నుంచి..

సేవా కార్యక్రమాలు ఎలా చేయచ్చో ఆ అడుగులు ఎలాగూ నేర్పించాయి. ఇంట్లో మా వారికి చెప్పి పైన ఓ గదిని ఏర్పాటు చేశాను. ఇంట్లోనే ఉంటాను కాబట్టి మహిళలకు టైలరింగ్, సాయంకాలాలు పేద పిల్లలకు ట్యూషన్లు చెప్పేదాన్ని. ఇక్కడ ఒక్కచోటే సేవ చేస్తూ ఉంటే కాదు, మరికొందరికి ఉపాధిని అందిస్తే బాగుంటుందనే ఉద్దేశ్యంతో గ్రామాలకి వెళ్లడం ప్రారంభించాను. వెళ్లిన ఊళ్లో ముందుగా అక్కడ అనువైన స్థలం చూసుకొని, ఒక టీచర్‌ని ఏర్పాటు చేసి, నేర్చుకునేవారిని ఎంపిక చేసేదాన్ని. సాయిసంస్థ ద్వారానే రెండు నెలల పాటు 200 మందిని 10 బృందాలుగా చేసి, స్వయంగా శిక్షణ ఇచ్చాను. గృహిణిగా ఇంటి పనులు చేసుకుంటూ ఉండే నేను అలా ఒక్కో ఏడాది దాటుతూ సేవాకార్యక్రమాల్లో తీరిక లేకుండా అయిపోవడం ఎంతో సంతృప్తినిచ్చింది.

స్వచ్ఛంద సంస్థలతో కలిసి..

ఈ 10 ఏళ్లలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలోని 300 గ్రామాలలో దాదాపు పన్నెండు వేల మంది గ్రామీణ మహిళలకు కుట్టు మిషను, మెహెందీ, ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం వర్క్, పేపర్ వర్క్, ఫ్యాషన్ జ్యువెలరీ తయారీ, బ్యూటీషియన్ .. వంటి శిక్షణా కార్యక్రమాలను ఉచితంగా నిర్వహించాం. ఆ తర్వాత ఈ సేవామార్గంలో కొన్ని స్వచ్ఛంద సంస్థల వాళ్లు పరిచయమయ్యారు. అలా మేధా చారిటీ, అభయ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థలతోనూ కలిసి గ్రామీణ మహిళలకు ఎనిమిది వేల కుట్టుమిషన్లు, ఇతర ఉపాధులకు అవసరమయ్యే పనిముట్లను ఏర్పాటు చేశాం.

పిల్లలకు ఫ్రీ ట్యూషన్లు

కరోనా తర్వాత పిల్లలకు చదువులు బాగా తగ్గిపోయాయి. డల్‌గా ఉన్న స్టూడెంట్స్ మరీ వెనకబడిపోకుండా ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఫ్రీ ట్యూషన్స్ ఏర్పాటు చేశాం. ఇందుకు ప్రభుత్వ స్కూల్ విద్యార్థులనే ఎంచుకుంటాం.

ఉపాధికి దారులు

అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలలో తెలిసినవారి నుంచి ఇక్కడి మహిళలకు ఆర్డర్ మీద వర్క్స్ ఇప్పిస్తుంటాను. ఈ ఆర్డర్లు తెచ్చుకోవడానికి ఈ బృందంలోని వారి నుంచి కొందరిని నియమిస్తాను. అమెరికాలో, దూరప్రాంతాల్లో తెలిసినవారుంటే వారికి మావాళ్లు చేసిన వర్క్స్ ఫోన్ల ద్వారా చూపించి, ఆర్డర్స్ తెప్పిస్తుంటాం.

వారికి కొరియర్ ద్వారా పంపిస్తుంటాం. దీని ద్వారా ఈ మహిళలకు కొంత ఆదాయం లభిస్తుంది. కోర్సు తర్వాత వారి ఇంటి వద్దనే నేర్చుకున్న పనిని కొనసాగించేలా కూడా చూస్తున్నాం'' అని కృష్ణవేణి వివరించారు.


– నిర్మలారెడ్డి

డిజిటల్ కూడలిలో మహిళ

సైబర్ టాక్

వందన డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. ఇంటా బయట చురుగ్గా ఉండే వందన వారం రోజులుగా ఇంటి గడప దాటి కాలు బయట పెట్టలేకపోతోంది. కారణం, తన వ్యక్తిగత ఫొటోలు, వీడియో క్లిప్పింగ్స్ ఒక సైట్‌లో కనపడటం ఆమెను కలవరపరుస్తోంది. వ్యక్తిగత పరువుకు సంబంధించిన విషయాలు బయటకు రావడం ఆమెను తీవ్ర మనో వేదనకు గురిచేస్తోంది. ఈ విషయాలను ఇంట్లో వారితో పంచుకోలేక, స్నేహితులతో చెప్పలేక ఇబ్బంది పడుతూ ఎటూ తేల్చుకోలేక ఆత్మహత్యా ప్రయత్నం చేసింది. రకరకాల డిజిటల్ సమస్యలను ఎదుర్కొనే యువతుల సంఖ్య ఇటీవల విపరీతంగా పెరుగుతోంది.

ఇటీవల కాలంలో మహిళల అవకాశాలు ఇంటర్నెట్ ద్వారా విస్తృతమయ్యాయి. ఉపాధి అవకాశాలను పెంచుకోవడానికి, అదనపు ఆదాయాన్ని సంపాదించడానికి, జ్ఞానాన్ని, ఆర్థికవృద్ధిని, మరింత సమగ్రమైన డిజిటల్ ప్రపంచాన్ని సృష్టించడానికి వీలు కల్పిస్తుంది. అయితే, సైబర్ శాఖ ఆన్‌లైన్‌లో పెరుగుతున్న మహిళా ప్రయోజనాలనే కాదు, వారికి సమస్యగా మారే అంశాలను కూడా పరిశీలిస్తుంది. మహిళలు ఆన్‌లైన్‌లో తమ సురక్షిత ప్రయాణం సాగించడానికి డిజిటల్ భద్రత తెలుసుకోవడం అత్యవసరం.


ప్రతీకాత్మక చిత్రం

డిజిటల్ నేరాలలో ప్రధానమైనవి..

డాక్సింగ్ : ఇది ఒక వ్యక్తి లేదా సంస్థకు సంబంధించిన గతంలోని వ్యక్తిగత సమాచారాన్ని డిజిటల్ మాధ్యమం ద్వారా బహిర్గతం చేసే చర్య. మోసగాళ్లు సాధారణంగా పబ్లిక్‌గా అందుబాటులో ఉన్న డేటాబేస్‌లు, గత సోషల్ మీడియా పోస్టింగ్‌లు, సోషల్ ఇంజనీరింగ్ నుండి సమాచారాన్ని పొంది, ఆన్‌లైన్ షేమింగ్ లేదా దోపిడీకి దారితీయవచ్చు.

సైబర్‌స్టాకింగ్: ఇది ఎలక్ట్రానిక్ మార్గాలను ఉపయోగించి ఒక వ్యక్తిని పదేపదే ట్రాక్ చేయడం. ఉదాహరణకు: అసందర్భంగా ఫోన్ కాల్స్ చేయడం, వాయిస్ సందేశాలు లేదా మెసేజ్‌లు చేయడం, గూఢచర్యం లేదా సోషల్ మీడియా కార్యకలాపాలను పర్యవేక్షించడం లేదా ఇంటర్నెట్‌లో తగని సమాచారాన్ని పోస్ట్ చేస్తామని బెదిరించడం.. వంటి సైబర్‌స్టాకింగ్ శారీరక, మానసిక క్షోభకు దారితీయవచ్చు.

స్వాటింగ్: ఇది పోలీసులను రెచ్చగొట్టడానికి, మనల్ని మోసం చేయడానికి అత్యవసర ఫోన్ కాల్స్ చేయడం వంటి చర్య. ఇది సైబర్ దోపిడీకి ఒక రూపం. దీని ద్వారా వ్యక్తులు లైంగిక ప్రయోజనాలను పొందాలని చూస్తారు. లైంగిక వేధింపులు వ్యక్తిగత, సన్నిహిత ఫొటోల పంపిణీకి దారితీయవచ్చు.

రివెంజ్ పోర్న్: అసభ్యకరమైన చిత్రాలు లేదా వీడియోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి వేధిస్తారు. ఏ మాత్రం మన అనుమతి లేకుండా ఆన్‌లైన్‌లో షేర్ అవుతుంటాయి. ఇవి ఎక్కువగా బాధితురాలి మాజీ జీవిత భాగస్వామి లేదా బాయ్‌ఫ్రెండ్ ద్వారా జరిగేవి ఉంటాయి.

లైంగిక వేధింపులు: తెలియకనో లేక ఏదైనా భావోద్వేగ సమయంలోనో లైంగిక అనుకూల రిక్వెస్ట్‌లకు అనుమతి ఇస్తుంటారు. అంటే, ఫొటోలు, కంటెంట్, జోక్స్, మరొక స్త్రీ ద్వేషానికి సంబంధించినవి అయి ఉండవచ్చు. ఇవి ఒకరి ప్రతిష్ఠకు హాని కలిగించే వాస్తవాలు. ఉదాహరణకు.. 'దొంగ, అబద్ధాలకోరు లేదా అనైతిక ప్రవర్తన'.. వంటివి.

వంచన: మోసగాళ్లు మీలా నటిస్తూ నకిలీ ఖాతాను సృష్టిస్తారు. మీ సోషల్ మీడియా పరిచయాల నుండి డబ్బు అడుగుతారు, ఇది బాధితులను వేధించడానికి ఇతరులకు ప్రోత్సాహకంగా కూడా ఉపయోగపడుతుంది. ద్వేషపూరిత ప్రసంగాల ద్వారా రెచ్చగొట్టడం, జాతి విద్వేషాన్ని ప్రోత్సహించడం లేదా సమర్థించడం, రాజకీయ, కార్పొరేట్ లేదా పోటీదారుల పోటీలో పాల్గొనడం వంటివి ఉంటాయి.

సేఫ్టీ చిట్కాలు:

సమస్యలు వస్తాయని ఎవరూ తమ ప్రయోజనాలను వదులుకోరు. అయితే, బయట మన క్షేమం కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో, ఆన్‌లైన్ బజార్‌లోనూ అంతే భద్రంగా ఉండటం ముఖ్యం.

- HTTPS:// (ప్యాడ్‌లాక్ సింబల్) ఉన్న వెబ్‌సైట్‌లను మాత్రమే బ్రౌజ్ చేయండి.
- పెద్ద అక్షరాలు, సంఖ్యలు, ప్రత్యేక అక్షరాలను కలిగి ఉన్న సంక్లిష్ట పాస్‌వర్డ్‌ను ఉపయోగించండి.
- అన్ని సామాజిక, ఇ-మెయిల్, బ్యాంకింగ్ లాగిన్‌ల (2FA) కోసం రెండు-దశల ప్రమాణీకరణను పాటించండి.
- ఎస్సెమ్మెస్, వాట్సప్, సోషల్ మీడియా మెసెంజర్‌ల ద్వారా వచ్చిన చిన్న లింక్‌లను ఎప్పుడూ క్లిక్ చేయవద్దు.
- సామాజిక మాధ్యమాలలో ఫొటోలను చూస్తున్నప్పుడు లేదా అప్‌లోడ్ చేస్తున్నప్పుడు మీ లొకేషన్ స్టేటస్‌ను స్టాప్ చేయండి.
- ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ మెసెంజర్‌లను మాత్రమే ఉపయోగించండి.
- అన్ని సోషల్ మీడియా, మెసెంజర్, ఇ-మెయిల్ అప్లికేషన్‌ల కోసం ప్రైవసీ సెట్టింగ్స్‌ను సెట్ చేయండి.
- సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో (ఆర్థిక, లాగిన్ ఆధారాలు, సంస్థ, వ్యక్తిగత సమాచారం... వంటి) సెన్సిటివ్ సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.
- నిజమైన, తెలిసిన వ్యక్తులతో మాత్రమే కనెక్ట్ అవ్వండి. ప్రత్యామ్నాయంగా, గోప్యతా సెట్టింగ్‌లను ఉపయోగించి మీరు మీ ప్రొఫైల్‌లను లాక్ చేయడాన్ని ఎంచుకోవచ్చు.
- ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పరస్పర చర్యలలో సమ్మతిని ఒకే విధంగా పరిగణించాలి.
- మీ వెబ్‌క్యామ్‌ను ఎప్పుడూ ప్లగ్ ఇన్ చేసి ఉంచవద్దు.
- యాంటీ-వైరస్, యాంటీ-మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌లతో మీ స్మార్ట్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లను సురక్షితం చేయండి.
- ఇది సురక్షితమైన నెట్‌వర్క్ అని మీరు నిర్ధారించుకునే వరకు పబ్లిక్ వై ఫైని ఎప్పుడూ యాక్సెస్ చేయవద్దు.
- ప్రసిద్ధ మూలాధారాల నుండి మాత్రమే యాప్‌లను డౌన్‌లోడ్ చేయండి (ప్లే స్టోర్ లేదా యాపిల్ స్టోర్ వంటివి).

ఆన్‌లైన్‌లో మహిళా భద్రతకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చే సైట్స్..

https://securityinabox.org/en/
https://exposingtheinvisible.org/resources/#filter=.watching-out-yourself
https://ssd.eff.org/
https://hackblossom.org/cybersecurity/
https://www.accessn

మీరు సైబర్ క్రైమ్‌కు గురైతే జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ https://www.cybercrime.gov.in/కు లాగిన్ చేసి, ఫిర్యాదును ఫైల్ చేయండి. నేషనల్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కి ఫోన్ చేసి, సహాయం పొందవచ్చు.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

స్పోర్ట్స్



సెమీఫైనల్లో రోహన్ బోపన్న జోడీ

ఖతర్ ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. దోహాలో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 1–6, 6–4, 11–9తో భారత్‌కే చెందిన సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ జంటను ఓడించింది. 74 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న ద్వయం నాలుగు ఏస్‌లు సంధించి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. సాకేత్–యూకీలకు 12,750 డాలర్ల (రూ. 10 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 45 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

ఐపీఎల్ టోర్నీ మధ్యలోనే వెళ్లిపోతా: స్టోక్స్

ఐర్లాండ్‌తో జరిగే ఏకైక టెస్ట్, ఆస్ట్రేలియాతో జరిగే యాషెస్ సిరీస్ సన్నాహాల కోసం ఐపీఎల్ టి20 టోర్నీ మొత్తం మ్యాచ్‌లు ఆడబోనని ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ తెలిపాడు. మార్చి 31 నుంచి మే 28 వరకు ఐపీఎల్ జరుగుతుంది. ఐర్లాండ్‌తో ఏకైక టెస్ట్ జూన్ 1 నుంచి, యాషెస్ సిరీస్ జూన్ 16 నుంచి జరుగుతాయి. గత రెండు ఐపీఎల్ సీజన్‌లకు దూరంగా ఉన్న స్టోక్స్‌ను గత డిసెంబర్‌లో చెన్నై జట్టు రూ. 16 కోట్ల 25 లక్షలకు కొనుగోలు చేసింది.



ప్రతాప్ సింగ్‌కు స్వర్ణం



కైరో (ఈజిప్ట్): ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్ ఖాతాలో నాలుగో స్వర్ణ పతకం చేరింది. బుధవారం జరిగిన పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్ పసిడి పతకం సాధించాడు. ఫైనల్లో 22 ఏళ్ల ప్రతాప్ సింగ్ 16–6తో అలెగ్జాండర్ షిమిర్ల్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో షిమిర్ల్, ప్రతాప్ సింగ్ వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరారు. భారత్‌కే చెందిన అఖిల్ షెరాన్ ఏడో ర్యాంక్‌లో నిలిచాడు. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత షూటర్ రిథమ్ సాంగ్వాన్ రెండో ర్యాంకింగ్ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో నిలిచింది. భారత్‌కే చెందిన మను భాకర్, ఇషా సింగ్ క్వాలిఫయింగ్‌లో వరుసగా 32వ, 34వ స్థానాల్లో నిలిచారు.

యూపీ వారియర్స్ కెప్టెన్‌గా అలీసా హీలీ



లక్నో: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే యూపీ వారియర్స్ జట్టుకు ఆస్ట్రేలియా స్టార్ ప్లేయర్ అలీసా హీలీ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. యూపీ వారియర్స్ జట్టులో సభ్యురాలైన భారత ఆల్‌రౌండర్, ఉత్తరప్రదేశ్‌కే చెందిన దీప్తి శర్మను కాదని అనుభవజ్ఞురాలైన అలీసా హీలీకి సారథ్య బాధ్యతలు అప్పగించారు. వికెట్ కీపర్, ఓపెనర్ బ్యాటర్ అయిన 32 ఏళ్ల అలీసా ఇప్పటి వరకు 139 అంతర్జాతీయ టి20లు ఆడి 2,446 పరుగులు సాధించింది. ఇందులో ఒక సెంచరీ, 14 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఐదుసార్లు టి20 ప్రపంచకప్ టైటిల్ (2010, 2012, 2014, 2018, 2020) సాధించిన ఆస్ట్రేలియా జట్టులో సభ్యురాలిగా ఉన్న అలీసా గత ఏడాది న్యూజిలాండ్ వేదికగా వన్డే వరల్డ్‌కప్ నెగ్గిన ఆసీస్ జట్టులోనూ కీలకపాత్ర పోషించింది. తొలి డబ్ల్యూపీఎల్ మార్చి 4 నుంచి 26 వరకు ముంబైలో జరుగుతుంది.

ప్రతీకార పోరుకు సై...

ఆస్ట్రేలియా సొంతగడ్డపై గత మెగా ఈవెంట్ ఫైనల్లో మన 'ప్రపంచకప్' కలని కలగానే మిగిల్చింది. మళ్లీ బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో 'స్వర్ణ'వకాశాన్ని ఎగరేసుకుపోయింది. ఈ రెండు ఫైనల్స్‌లో ఓడిన భారత్ చివరకు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఇప్పుడు కంగారూ అమ్మాయిల్ని తుదిపోరుకు చేరకుండా చేసే అవకాశం సెమీస్ మ్యాచ్ ద్వారా భారత్‌కు లభించింది. హర్మన్‌ప్రీత్ సేన సమష్టిగా రాణించి ఆసీస్‌ను దెబ్బకొట్టాల్సిన తరుణం వచ్చేసింది. నిలకడగా రాణిస్తున్న ఆస్ట్రేలియాను భారత్ ఓడించి ఫైనల్ పోరుకు అర్హత సాధిస్తుందా లేక మరోసారి ఓటమి మూటగట్టుకుంటుందా వేచి చూడాలి.

- నేడు ఆస్ట్రేలియాతో భారత్ సెమీఫైనల్
- సాయంత్రం గం. 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



కేప్‌టౌన్: భారత అమ్మాయిల ఆట నాకౌట్‌కు చేరింది. ఇక్కడ రెండు మ్యాచ్‌లు గెలిస్తే ప్రపంచకప్ చేతికి అందుతుంది. ఇందులో మొదటి అడుగు వేసేందుకు భారత మహిళల జట్టు నేడు పటిష్టమైన డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో తొలి సెమీఫైనల్లో తలపడుతుంది. 'కంగారూ' జట్టు భారత్‌కెపుడూ మింగుడు పడని ప్రత్యర్థే! గత ప్రపంచకప్‌లోనే కాదు... తొలిసారి కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రవేశ పెట్టిన క్రికెట్‌లోనూ చాంపియన్ కాకుండా అడ్డుకుంది. ఆఖరి పోరులో భారత్‌ను పరాజితగా నిలిపిన ఆస్ట్రేలియా జట్టుపై ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్న హర్మన్‌ప్రీత్ సేనకు ఇదే సరైన సమయం. బ్యాటర్లంతా ఫామ్‌లో ఉండటం, బౌలింగ్ నిలకడగా ఉండటం జట్టు అవకాశాల్ని మెరుగు పరుస్తోంది. అయితే ఆసీస్ ఆషామాషీ జట్టు కాదు. ఈ పొట్టి మెగా ఈవెంట్ ఏడుసార్లు జరిగితే ఇందులో 'హ్యాట్రిక్' సహా ఐదుసార్లు (2010, 2012, 2014, 2018, 2020) గెలిచిన గట్టి ప్రత్యర్థి. ఇలాంటి జట్టును ఓడించాలంటే ఒక్క ఫామ్ ఉంటే సరిపోదు! సర్వశక్తులు ఒడ్డితేనే అనుకున్న ఫలితం సాధించవచ్చు. కచ్చితంగా ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబరిస్తేనే భారత్ ఆఖరి పోరుకు అర్హత సాధిస్తుంది. ఓపెనర్లు స్మృతి మంధాన, షఫాలీ వర్మ, జెమీమా తప్పకుండా బ్యాట్‌కు పని చెప్పాల్సిందే. మిడిలార్డర్‌ను హర్మన్, రిచా ఘోష్ నడిపిస్తే పరుగులు వేగంగా సాధించవచ్చు. బౌలింగ్‌లో రేణుక సింగ్ పదును చూపెట్టాలి. శిఖా పాండే, దీప్తి శర్మలు కూడా రాణించాలి.

అజేయంగా ఆస్ట్రేలియా

ఈ ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా అజేయంగా సాగుతోంది. గ్రూప్–1లో ఎదురేలేని జట్టుగా నిలిచి సెమీస్ చేరింది. పటిష్టమైన న్యూజిలాండ్‌ను చిత్తుగా ఓడించి మెగా ఈవెంట్‌లో శుభారంభం చేసిన కంగారూ సేన ఇప్పటివరకు అన్నీ ఆల్‌రౌండ్ ప్రదర్శనతోనే విజయాలు సాధించింది. దక్షిణాఫ్రికాతో ఆఖరి లీగ్ మ్యాచ్ ఆడని వికెట్ కీపర్ అలీసా హీలీ పూర్తి ఫిట్‌నెస్‌తో అందుబాటులోకి వచ్చింది. టాపార్డర్‌లో ఆమెతో పాటు బెత్ మూనీ, కెప్టెన్ మెగ్ లానింగ్ మెరుపులు మెరిపిస్తున్నారు. మిడిలార్డర్‌లో ఆష్లే గార్డ్‌నర్, ఎలీస్ పెర్రీ, గ్రేస్ హారిస్, తాలియా మెక్‌గ్రాత్‌లు కూడా బ్యాటింగ్‌లో సత్తా చాటుతుండటంతో ఏడో వరుస వరకు బ్యాటింగ్ ఆర్డర్‌కు ఢోకా లేదు. బౌలర్లలో మేగన్ షుట్, డార్సీ బ్రౌన్, అలానా కింగ్‌లు ప్రత్యర్థి బ్యాటర్లను హడలెత్తించగలరు.

30 అంతర్జాతీయ టి20ల్లో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు. ఇందులో భారత్ 6 మ్యాచ్‌ల్లో నెగ్గింది. ఆస్ట్రేలియా 22 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఒక మ్యాచ్ 'టై'కాగా... మరో మ్యాచ్ రద్దయింది. టి20 ప్రపంచకప్ చరిత్రలో ఈ రెండు జట్లు ఐదుసార్లు తలపడ్డాయి. రెండు మ్యాచ్‌ల్లో భారత్, మూడు మ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా విజయం సాధించాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ, రిచా ఘోష్, జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ, పూజ, శిఖా పాండే, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, రేణుక.

ఆస్ట్రేలియా: మెగ్ లానింగ్ (కెప్టెన్), బెత్ మూనీ, అలీసా హీలీ, ఎలీస్ పెర్రీ, ఆష్లే గార్డ్‌నర్, తాలియా మెక్‌గ్రాత్, గ్రేస్ హారిస్, జార్జియా, అలానా కింగ్, మేగన్ షుట్, డార్సీ బ్రౌన్.

రెండో సెమీస్‌లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా 'ఢీ'

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీలో సెమీఫైనల్ చేరాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు అదరగొట్టింది. గ్రూప్–1 చివరి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 10 వికెట్లతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. దాంతో గ్రూప్–1లో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక నాలుగు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాయి. అయితే మెరుగైన రన్‌రేట్‌తో దక్షిణాఫ్రికా (0.738) సెమీస్ చేరగా... న్యూజిలాండ్ (0.138), శ్రీలంక (–1.460) ఇంటిముఖం పట్టాయి. దక్షిణాఫ్రికాతో పోరులో మొదట బంగ్లాదేశ్ 6 వికెట్లకు 113 పరుగులు చేసింది. తర్వాత దక్షిణాఫ్రికా 17.5 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 117 పరుగులు చేసింది. ఓపెనర్లు వోల్వార్డ్ (66 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), తజ్మిన్ బ్రిట్స్ (50 నాటౌట్; 4 ఫోర్లు) అర్ధసెంచరీలతో అదరగొట్టారు. శుక్రవారం జరిగే రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా ఆడుతుంది.


బ్రిట్స్


వోల్వార్డ్

ప్రపంచ చెస్ చాంపియన్ కార్ల్‌సన్‌పై విదిత్ విజయం





చెన్నై: ప్రో చెస్ లీగ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతి గొప్ప ఫలితం సాధించాడు. ప్రపంచ నంబర్‌వన్, ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)పై విదిత్ గెలుపొందాడు. ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో ఇండియన్ యోగిస్ జట్టు తరఫున పోటీపడుతున్న విదిత్ బ్లిట్జ్ గేమ్‌లో 58 ఎత్తుల్లో కెనడా చెస్‌బ్రాస్ జట్టు తరఫున ఆడుతున్న కార్ల్‌సన్‌పై విజయం సాధించాడు. 16 జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీని లక్షా 50 వేల డాలర్ల ప్రైజ్‌మనీతో నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో కార్ల్‌సన్‌ను ఓడించిన నాలుగో భారత గ్రాండ్‌మాస్టర్ విదిత్ కావడం విశేషం. ప్రజ్ఞానంద, గుకేశ్, ఇరిగేశి అర్జున్ కూడా ఈ నార్వే దిగ్గజంపై వివిధ టోర్నీలలో గెలుపొందారు.

అండర్సన్... ఐదేళ్ల తర్వాత మళ్లీ 'టాప్'లోకి...



దుబాయ్: ఐసీసీ టెస్ట్ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ పేస్ బౌలర్ అండర్సన్ మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. చివరిసారి 2018లో అండర్సన్ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో అండర్సన్ ఏడు వికెట్లు పడగొట్టడంతో రెండు స్థానాలు ఎగబాకి 866 పాయింట్లతో అగ్రస్థానానికి చేరాడు. 1936 తర్వాత ఐసీసీ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్ సాధించిన పెద్ద వయస్కుడిగా అండర్సన్ (40 ఏళ్ల 207 రోజులు) గుర్తింపు పొందాడు. భారత స్పిన్నర్ అశ్విన్ 864 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో ఉన్నాడు.

స్వదేశానికి ఆసీస్ స్పిన్నర్ అగర్



న్యూఢిల్లీ: భారత పర్యటనలో ఉన్న ఆస్ట్రేలియా జట్టు ఎడంచేతి వాటం స్పిన్నర్ ఆష్టన్ అగర్ స్వదేశానికి వెళ్లిపోయాడు. భారత్‌తో జరిగే చివరి రెండు టెస్టుల్లో పాల్గొనే ఆస్ట్రేలియా తుది జట్టులో అతనికి స్థానం లభించే అవకాశం లేకపోవడంతో... దేశవాళీ మ్యాచ్‌లు ఆడేందుకు రమ్మన్నట్లు జాతీయ సెలక్టర్ టోనీ తెలిపారు.

సినిమా


● సల్మాన్ ఖాన్
● షాహిద్
● సోనమ్
● అమితాబ్, దీపికా
● టైగర్ ష్రాఫ్

విదేశీ కథలపై హిందీ దర్శక–నిర్మాతలు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. దాదాపు పది విదేశీ చిత్రాలు రీమేక్ రూపంలో హిందీ తెరపై కనిపించనున్నాయి. ఆ ఫారిన్ చిత్రాల్లోని కథలు ఇండియన్ ఆడియన్స్‌కు దగ్గరగా ఉండటంతో రీమేక్ చేస్తున్నారు. ఇక ఫారిన్ స్టోరీతో రీమేక్ అవుతున్న బాలీవుడ్ మూవీస్ గురించి తెలుసుకుందాం.

ఫారిన్ స్టోరీ.. బాలీవుడ్ మూవీ

స్పానిష్ స్పోర్ట్స్ అండ్ కామెడీ డ్రామా 'చాంపియన్స్' (2018) హిందీ రీమేక్‌ను నిర్మించే ఆలోచనలో ఉన్నట్లుగా ఆమిర్ ఖాన్ ఇటీవల ఓ సందర్భంలో పేర్కొన్న సంగతి గుర్తుండే ఉంటుంది. అయితే ఈ సినిమాలో సల్మాన్ ఖాన్ మెయిన్ లీడ్ రోల్ చేయనున్నారని తెలుస్తోంది. ఇటీవల ఈ సినిమా కోసం ఆమిర్, సల్మాన్‌లు కలిసి చర్చించుకున్నారు. ఈ చిత్రానికి ఆమిర్ నిర్మాతగా మాత్రమే వ్యవహరించాలనుకుంటున్నారట. ఒకవైపు ఈ రీమేక్ గురించి చర్చిస్తూనే మరోవైపు సౌత్ కొరియన్ డిటెక్టివ్ డ్రామా 'వెటరన్' (2015) హిందీ రీమేక్‌లో నటించేందుకు సల్మాన్ ఖాన్ ఆసక్తి చూపిస్తున్నారని టాక్. 'వెటరన్' హిందీ రీమేక్ హక్కులను బాలీవుడ్ దర్శక –నిర్మాత అతుల్ అగ్నిహోత్రి దక్కించుకున్నారు. ఇక అమెరికన్ కామెడీ డ్రామా 'ది ఇంటర్న్' (2015) హిందీ రీమేక్‌లో అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్ లీడ్ రోల్స్ చేయనున్నారు. ఈ రీమేక్‌కి అమిత్ శర్మ దర్శకత్వం వహించనున్నారు. అయితే ఈ సినిమా ప్రకటన ఎప్పుడో వచ్చినప్పటికీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ఈ సినిమా నుంచి దీపికా తప్పుకునే ఆలోచనలో ఉన్నారని, అందుకే షూటింగ్ ఆరంభించలేదని టాక్. కాగా, ఫ్రెంచ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ట్రాన్స్‌పోర్టర్' (2002) హిందీ రీమేక్ రైట్స్‌ను దక్కించుకున్నారు నిర్మాత విశాల్ రానా. ఇందులో హృతిక్ రోషన్, రణ్‌వీర్ సింగ్, టైగర్ ష్రాఫ్‌లలో ఎవరో ఒకరు నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. అలాగే అమెరికన్ సూపర్‌హిట్ యాక్షన్ ఫ్రాంచైజీ 'ర్యాంబో' రీమేక్‌లో టైగర్ ష్రాఫ్ హీరోగా నటించనున్నారని ప్రకటన వచ్చింది. ఇక షాహిద్ కపూర్ హీరోగా అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో 'బ్లడీ డాడీ' అనే సినిమా రూపొందుతోంది. ఇది ఫ్రెంచ్ ఫిల్మ్ 'స్లీప్‌లెస్ నైట్' (2011)కు రీమేక్ అనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. అదే విధంగా సౌత్ కొరియన్ క్రైమ్ థ్రిల్లర్ 'బ్లైండ్' (2011) హిందీ రీమేక్‌లో సోనమ్ కపూర్ లీడ్ రోల్ చేస్తున్నారు. అలాగే ఆస్కార్ విన్నింగ్ ఫిల్మ్ 'కోడ' (2021) రీమేక్‌ను దర్శకుడు విశాల్ బాల్ తెరకెక్కించనున్నారని, అమెరికన్ మార్షల్ ఆర్ట్స్ ఫిల్మ్ 'కిల్ బిల్' (2003) రీమేక్ అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రూపొందనుందనే వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఇలా విదేశీ చిత్రాల హిందీ రీమేక్ జాబితాలో మరికొన్ని కూడా ఉన్నాయి.

మనసును హైజాక్ చేసి...


● అఖిల్, సాక్షీ వైద్య

'మళ్లీ మళ్లీ నువ్వే ఎదురెదురొస్తే దట్స్ ఏ సైన్ అని మనసంటుందే.. నా లేటెస్ట్ మిషను నువ్వే.. సాధించాలనిపిస్తుందే...' అంటూ సాగుతుంది 'ఏజెంట్' చిత్రంలోని పాట. అఖిల్ హీరోగా సురేందర్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న స్పై యాక్షన్ ఫిల్మ్ 'ఏజెంట్'. ఇందులో సాక్షీ వైద్య హీరోయిన్. ఈ సినిమా నుంచి 'మళ్లీ మళ్లీ నువ్వే... మనసే హైజాక్ చేసి కొల్లగొట్టావు' అంటూ సాగే పాటను చిత్ర యూనిట్ బుధవారం విడుదల చేసింది. ఆదిత్యా అయ్యంగార్ సాహిత్యం అందించిన ఈ పాటను ఈ చిత్ర సంగీత దర్శకుడు హిప్‌హాప్ తమిళ పాడారు. అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్, సురేందర్‌రెడ్డి 2 సినిమాస్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్ సుంకర, దీపారెడ్డి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో 'ఏజెంట్' చిత్రం ఏప్రిల్ 28న విడుదల కానుంది.


● 'అల్లరి' నరేష్, మిర్నా, హరీష్ పెద్ది, నాగచైతన్య, సాహు గారపాటి, విజయ్ కనకమేడల

ఉగ్రం టీజర్ అదిరిపోయింది - నాగచైతన్య

''ఉగ్రం' సినిమా టీజర్ అదిరిపోయింది.. నెక్ట్స్ లెవల్‌లో ఉందనిపించింది. 'నాంది' తర్వాత నరేష్ మళ్లీ అలాంటి ఇంటెన్స్ రోల్ చేయడం ఆనందంగా ఉంది'' అని హీరో నాగచైతన్య అన్నారు. 'నాంది' వంటి సూపర్ హిట్ తర్వాత హీరో 'అల్లరి' నరేష్, డైరెక్టర్ విజయ్ కనకమేడల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ఉగ్రం'. సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్న ఈ చిత్రం టీజర్‌ని నాగచైతన్య రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నరేష్, విజయ్ కాంబినేషన్ ఒక బ్రాండ్‌లా ఉంది. సాహు, హరీష్ అద్భుతమైన నిర్మాతలు. నా కెరీర్‌లో 'మజిలీ' వంటి మంచి సినిమా ఇచ్చారు వారు. ఆ సినిమాలా 'ఉగ్రం' బ్లాక్ బస్టర్ కావాలి'' అన్నారు. నరేష్ మాట్లాడుతూ– ''ఒక నటుణ్ణి దర్శకుడు ఎంత నమ్మితే అన్ని మంచి విజయాలు వస్తాయి. మా నాన్నగారు (ఈవీవీ సత్యనారాయణ) నన్ను నమ్మినప్పుడు వరుస విజయాలు వచ్చాయి. క్రిష్‌గారు నన్ను నమ్మినప్పుడు 'గమ్యం', సముద్రఖని నమ్మినప్పుడు 'శంభో శివ శంభో' వంటి మంచి సినిమాలు వచ్చాయి. ఆ తర్వాత 'నాంది'తో విజయ్ నాకు కొత్త రూటు చూపించారు'' అన్నారు. ''నిజాయితీగా సినిమా తీస్తే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'నాంది' విజయం చూపించింది.. 'ఉగ్రం' కూడా అంతే నిజాయితీగా ఉంటుంది'' అన్నారు విజయ్ కనకమేడల.

మా టీమ్ సక్సెస్ సీక్రెట్ అదే - బన్నీ వాసు


● బన్నీ వాసు, కిరణ్, కశ్మీర, మురళీ కిషోర్

''వినరో భాగ్యము విష్ణు కథ' విషయంలో కొత్తవారి మీద చాలా ఎక్కువగా ఖర్చు పెట్టారా? అని కొందరు అడుగుతున్నారు. అల్లు అరవింద్‌గారి క్రమశిక్షణ వల్ల మా ఖర్చు హద్దుల్లో ఉంటుంది. అదే మా టీమ్ సక్సెస్ సీక్రెట్'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''నేను తీసిన అన్ని సినిమాల్లోకెల్లా త్వరగా బ్రేక్ ఈవెన్ అయిన చిత్రమిది. ఇప్పుడిప్పుడే 'కేజీఎఫ్, విక్రమ్' వంటి సినిమాల ఫార్మాట్లకు ప్రేక్షకులు అలవాటుపడుతున్నారు. కొత్త దర్శకులకు ధైర్యాన్ని ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా తీశాం'' అన్నారు. ''ఈ సినిమాతో మా అందరికీ గౌరవం వచ్చింది.. ఆదరించిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు కిరణ్ అబ్బవరం. ''మా చిత్రం కేవలం నంబర్ నైబర్ కాన్సెప్ట్ కోసం తీసింది కాదు. అమ్మ సెంటిమెంట్ కూడా ఉంది'' అన్నారు మురళీ కిషోర్ అబ్బూరు. నిర్మాత ఎస్‌కేఎన్, మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్ మాట్లాడారు.

ఆస్పత్రిలో ప్రభు



ప్రముఖ నటుడు ప్రభు అనారోగ్యం బారిన పడ్డారు. రెండు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయన చెన్నై కోడంబాక్కంలోని మెడ్‌వే ఆస్పత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో రాళ్లను తొలగించడానికి యురిట్రోస్ కోపీ అనే లేజర్ శస్త్ర చికిత్సను మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం ఆయన కోలుకున్నారని, రెండు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు పేర్కొన్నారు.

సాచి హిట్ కావాలి - ప్రభాస్


● ప్రభాస్, సత్యానంద్


''సాచి' సినిమా ట్రైలర్ బాగుంది. మహిళా సాధికారతకు సంబంధించిన చిత్రం ఇది. ఇలాంటి మంచి సినిమా హిట్ కావాలని కోరుకుంటున్నాను'' అని హీరో ప్రభాస్ అన్నారు. సంజన రెడ్డి, గీతిక రథన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సాచి'. సత్యానంద్ సమర్పణలో వివేక్ పోతగోని స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా మార్చి 3న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని ప్రభాస్ విడుదల చేశారు. వివేక్ పోతగోని మాట్లాడుతూ– ''బిందు అనే ఒక నాయీ బ్రాహ్మణ అమ్మాయి నిజ జీవిత గాథ ఇది. తెలంగాణ నాయీబ్రాహ్మణ అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్‌గారు మా చిత్రం ప్రివ్యూ చూసి, బాగుందని అభినందించారు. ఈ చిత్రం అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కేపీ భరద్వాజ్, నిర్మాణ సారథ్యం: ఉపేన్ నడిపల్లి, వివేక్ పోతగోని.

వినోదం.. సందేశం


● మణి సాయితేజ, 'దిల్' రాజు

మణి సాయితేజ, రేఖ నిరోషా జంటగా నటించిన చిత్రం 'మెకానిక్'. ముని సహేకర దర్శకత్వంలో ఎమ్. నాగ మునెయ్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను నిర్మాత 'దిల్' రాజు రిలీజ్ చేసి, చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పారు. ''ఓ బర్నింగ్ ప్రాబ్లమ్‌కు కమర్షియల్ ఎలిమెంట్స్ జోడించి, గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన చిత్రం ఇది. వినోదంతో పాటు సందేశం కూడా ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, సహనిర్మాతలు: కొండ్రాసి ఉపేందర్ – నందిపాటి శ్రీధర్ రెడ్డి.

స్పీకర్ ఆన్ చేసి మాట్లాడాలి


● హరీష్ శంకర్, నవీన్

నవీన్ నేని, ప్రణీత పట్నాయక్ ముఖ్య తారలుగా కెఎస్ హేమరాజ్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'రిచిగాడి పెళ్లి'. త్వరలో ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను లాంచ్ చేశారు దర్శకుడు హరీష్ శంకర్. 'ఏ ఫోన్‌కాల్ వచ్చినా స్పీకర్ ఆన్ చేసి మాట్లాడాలి అంతే..!', 'రిచిగాడి పెళ్లి' జీవితంలో మర్చిపోకూడదు' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''మానవ సంబంధాలకు అద్దం పట్టే కథతో 'రిచిగాడి పెళ్లి'ని రూపొందించాం'' అన్నారు హేమరాజ్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	928	59,745
నిఫ్టీ ▽	272	17,554

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తేది రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	11,538	△	45
డోజోన్స్	33,221	△	91
ఎఫ్‌టీఎస్ఈ 100	7,931	▽	47
డాక్స్	15,400	△	2
పాంఘై	3,291	▽	15
నికాయ్	27,104	▽	369

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) – ముంబై

బంగారం (24 క్యారెట్)	56,496	△	112
బంగారం (22 క్యారెట్)	56,270	△	112
వెండి (కేజీ)	65,986	△	216

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎనిఅంత	82.07	83.74
£	బ్రిటన్ పౌండ్	ఎనిఅంత	86.82	89.92
€	యూరో	ఎనిఅంత	98.80	102.15
¥	జపాన్ ఎన్ (100)	ఎనిఅంత	60.51	62.46
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎనిఅంత	55.55	57.92
S$	సింగపూర్ డాలర్	ఎనిఅంత	60.92	62.88
SAR	సౌదీ రియాల్	[illegible]	21.01	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.66	23.45
¥	చైనా యువాన్	[illegible]	10.89	12.97

అయిదు నెలల్లో అతిపెద్ద పతనం

- భౌగోళిక ఉద్రిక్తతలు, వడ్డీరేట్ల పెంపు ప్రభావం
- అన్ని రంగాల షేర్లలో అమ్మకాలే
- 61 వేల దిగువకు సెన్సెక్స్
- నెల కనిష్టానికి నిఫ్టీ

ముంబై: వడ్డీరేట్ల పెంపు, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో బుధవారం దలాల్ స్ట్రీట్ కుప్పకూలింది. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ బేర్ సంపూర్ణ ఆధిక్యతను ప్రదర్శించడంతో బెంచ్‌మార్క్ సూచీలు అయిదు నెలల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూశాయి. అన్ని రంగాల షేర్లలో అమ్మకాల సునామీ తలెత్తడంతో సెన్సెక్స్ 928 పాయింట్లు నష్టపోయి 59,745 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 272 పాయింట్లు క్షీణించి 17,554 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది వరుసగా నాలుగోరోజూ నష్టాల ముగింపు. సెన్సెక్స్ సూచీలో 30 షేర్లకు గానూ ఒక్క ఐటీసీ(0.41%) మాత్రమే లాభంతో ముగిసింది. నిఫ్టీ 50 ఇండెక్స్‌లో నాలుగు షేర్లు మాత్రమే నష్టాల నుంచి గట్టెక్కాయి. మార్కెట్లో అస్థిరతను సూచించే వీఐఎక్స్ ఇండెక్స్ ఏకంగా 11 శాతం పెరగడంతో మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ ఇండెక్సులు ఒకశాతానికి పైగా క్షీణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.580 కోట్ల షేర్లను అమ్మేశారు. డీఐఐలు రూ.372 కోట్ల షేర్లను కొన్నారు. అమెరికా స్టాక్ మార్కెట్లు మంగళవారం ఈ ఏడాదిలోనే అతి పెద్ద పతనాన్ని చవిచూశాయి. బుధవారం ఆసియా మార్కెట్లు రెండుశాతం, యూరప్ మార్కెట్లు అర శాతం నష్టపోయాయి.



4 రోజుల్లో రూ. 7 లక్షల కోట్ల నష్టం

గడచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1530 పాయింట్లు, నిఫ్టీ 462 పాయింట్ల చొప్పున క్షీణించాయి. సూచీలు మూడుశాతానికి పైగా కుదేలవడంతో స్టాక్ మార్కెట్లో దాదాపు రూ. 7 లక్షల కోట్లు నష్టం వాటిల్లింది. బుధవారం ఒక్కరోజే రూ.3.87 లక్షల కోట్ల సంపద హరించుకుపోయింది. దీనితో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.261 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఇంట్రాడే ట్రేడింగ్ ఇలా

ఉదయం సెన్సెక్స్ 281 పాయింట్ల పతనంతో 60391 వద్ద, నిఫ్టీ 72 పాయింట్ల నష్టంతో 17,755 వద్ద మొదలయ్యాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో బలహీనతల ప్రభావంతో తొలి నుంచీ ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపారు. ఒకదశలో సెన్సెక్స్ 992 పాయింట్లు క్షీణించి 59,681 వద్ద, నిఫ్టీ 297 పాయింట్లు నష్టపోయి 17,529 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని నమోదు చేశాయి.

నష్టాలు ఎందుకంటే...

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌లో పర్యటించిన కొన్ని గంటలకే అణు ఒప్పందం నుంచి రష్యా తప్పుకుంటుందని వ్లాదిమిర్ పుతిన్ ప్రకటనతో రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు చెలరేగాయి. ఫెడ్ మినిట్స్ వెల్లడికి ముందు అప్రమత్తత, వడ్డీ రేట్ల పెంపు భయాలు, బాండ్లపై రాబడులు పెరగడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి. దేశీయంగా ఆర్‌బీఐ మినిట్స్ వెల్లడి (మార్కెట్ ముగింపు తర్వాత), ఎఫ్అండ్ఓ ఎక్స్‌పైరీ ముగింపు(నేడు) నేపథ్యంలో ఇన్వెస్టర్లు జాగ్రత వహిస్తూ అమ్మకాలకు పాల్పడ్డారు. అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాల పరంపర ఒత్తిడిని మరింత పెంచింది. విదేశీ ఇన్వెస్టర్లు వరుసగా నాలుగోరోజూ అమ్మకాలు పాల్పడ్డారు. ఈ జాతీయ అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావాన్ని చూపాయి. ''గత మూడు ట్రేడింగ్ సెషన్లలో బేర్స్‌కు ఎదురొడ్డి నష్టాలను పరిమితం చేసిన బుల్స్ బుధవారం చేతులెత్తేశారు. కోవిడ్, అధిక ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు భయాల నుంచి మార్కెట్ రికవరీ అవుతున్న తరుణంలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రచ్ఛన్న యుద్ధం సెంటిమెంట్‌ను పూర్తిగా దెబ్బతీసింది. ప్రస్తుతానికి నిఫ్టీకి 17,500 వద్ద మద్దతు ఉంది. ఈ కీలక స్థాయిని కోల్పోతే మరో దఫా లాభాల స్వీకరణ జరిగే వీలుంది. దిగువ స్థాయిలో 17,350 వద్ద మరో మద్దతు ఉంది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెన్సెక్స్ కీలకమైన 60 వేల స్థాయిని కోల్పోయి మూడువారాల కనిష్టం వద్ద ముగిసింది. నిఫ్టీ 17,500 స్థాయికి చేరువలో నెల కనిష్టం వద్ద స్థిరపడింది.
- ఇండెక్స్‌లో అధిక వెయిటేజీ గల రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ద్వయం, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్ బ్యాంక్ షేర్లు 3 నుంచి 2శాతం నష్టపోయి సూచీల భారీ పతనానికి ప్రధాన కారణమయ్యాయి.
- వడ్డీరేట్ల పెంపు, ఆర్థిక మాంద్య భయాలతో రియల్టీ రంగ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. గోద్రేజ్ ప్రాపర్టీస్, డీఎల్ఎఫ్, మహీంద్రా లైఫ్‌స్పేస్ డెవలపర్స్ షేర్లు మూడు శాతం నష్టపోయాయి. శోభ, ఒబెరాయ్ రియల్టీ, ఇండియాబుల్స్ రియల్ ఎస్టేట్, ప్రెస్టేజ్ ఎస్టేట్స్ షేర్లు 1-2% చొప్పున పతనమయ్యాయి. మైండ్‌స్పేస్ రీట్, బ్రూక్‌ఫీల్డ్ రీట్ షేర్లు అరశాతం చొప్పున నష్టపోయాయి.

వడ్డీ రేట్ల డెరివేటివ్స్ వేళల పొడిగింపు

- సాయంత్రం 5 గంటల వరకు పెంచిన ఎన్ఎస్ఈ
- గురువారం నుంచి అమల్లోకి
- ఎక్స్‌పైరీ తేదీకి వర్తింపు



న్యూఢిల్లీ: వడ్డీ రేట్ల డెరివేటివ్స్ ట్రేడింగ్ వేళలను కాంట్రాక్టు ఎక్స్‌పైరీ తేదీల్లో సాయంత్రం 5 గం.ల వరకూ పొడిగించాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) నిర్ణయించింది. దీన్ని గురువారం నుంచి అమలు చేయనుంది. ప్రస్తుతం కాంట్రాక్టుల ట్రేడింగ్ సమయం ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 3.30 గం. వరకు ఉంటోంది. ఫిబ్రవరి నెలకు సంబంధించిన వడ్డీ రేట్ల డెరివేటివ్ కాంట్రాక్టుల ట్రేడింగ్ వేళలు ఫిబ్రవరి 23న (ఎక్స్‌పైరీ తేదీ) సాయంత్రం 5 గం. వరకు ఉంటాయని ఎన్ఎస్ఈ తెలిపింది. ఆ రోజున మిగతా వడ్డీ రేట్ల డెరివేటివ్ కాంట్రాక్టుల వేళల్లో మాత్రం మార్పులేమీ ఉండవని తెలిపింది. ఆయా కాంట్రాక్టుల ఎక్స్‌పైరీ తేదీల్లో మాత్రం సాయంత్రం 5 గం. వరకు ట్రేడింగ్ అందుబాటులో ఉంటుందని వివరించింది. ఈక్విటీ సెగ్మెంట్‌లో ట్రేడింగ్ వేళలను పొడిగించాలని ఎన్ఎస్ఈ యోచిస్తోందన్న వార్తల నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం దేశీ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ వేళలు ఉదయం 9.15 గం. నుంచి సాయంత్రం 3.30 గం. వరకు, కమోడిటీ డెరివేటివ్స్ సెగ్మెంట్ వేళలు ఉదయం 10 గం. నుంచి రాత్రి 11.55 గం. వరకు ఉంటున్నాయి.

రిస్కుల హెడ్జింగ్‌కు ఉపయోగపడుతుంది..

దేశీ స్టాక్ మార్కెట్ల ట్రేడింగ్ వేళలను పొడిగిస్తే .. క్రితం రోజు అంతర్జాతీయంగా చోటు చేసుకునే పరిణామాల వల్ల తలెత్తే రిస్కులను హెడ్జింగ్ చేసుకునేందుకు ఉపయోగపడగలదని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'అంతర్జాతీయంగా మార్కెట్లు ఒకదానికి మరొకటి మరింతగా అనుసంధానమవుతున్నాయి. అమెరికా, యూరప్ వంటి పెద్ద మార్కెట్లలో పరిణామాలకు మన స్టాక్ మార్కెట్లు స్పందిస్తున్నాయి. కాబట్టి ఆయా రిస్కులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ట్రేడింగ్ వేళల పెంపు ఉపయోగపడగలదు' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఈడీ ఎ. బాలకృష్ణన్ తెలిపారు. ఈక్విటీ సెగ్మెంట్‌లో వేళల పెంపుతో మార్కెట్ వర్గాలు, రిటైల్ ఇన్వెస్టర్లకూ ప్రయోజనం చేకూరగలదని వివరించారు. అంతర్జాతీయ అనిశ్చితుల రిస్కులను ఎదుర్కొనేందుకు ఈక్విటీ ఎఫ్అండ్ఓ, కరెన్సీ సెగ్మెంట్స్ ట్రేడింగ్ వేళలను పెంచడం చాలా అవసరమని ఫైయర్స్ సీఈవో తేజస్ ఖోడే చెప్పారు. దీన్ని వ్యతిరేకిస్తే మన క్యాపిటల్ మార్కెట్ల వృద్ధికి విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. ట్రేడింగ్ వేళల పెంపుతో అంతర్జాతీయ ట్రేడర్లకు దీటుగా దేశీ ట్రేడర్లకు కూడా సమాన అవకాశాలు లభించగలవని జిరోధా సహ వ్యవస్థాపకుడు నితిన్ కామత్ ట్వీట్ చేశారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2023	
విశాఖ	400-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	400-00
విజయవాడ	400-00
రిటైల్ ధర (డజను)	66.00
22-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	385-00
వరంగల్	387-00
రిటైల్ ధర	4.55

ప్రపంచ ఎకానమీలో భారత్ వెలుగులు

- ఐఎంఎఫ్ ఎండీ ప్రశంసలు
- 2023 ప్రపంచాభివృద్ధిలో దేశం వాటా 15 శాతమని అంచనా

వాషింగ్టన్: ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ''ప్రకాశవంతమైన ప్రాంతం'గా కొనసాగుతోందని అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) క్రిస్టాలినా జార్జివా అన్నారు. 2023లో ప్రపంచ వృద్ధిలో భారత్ వాటా 15 శాతంగా ఉంటుందని భారత్‌లో పర్యటించనున్న ఆమె అంచనా వేశారు. కరోనా మహమ్మారి సమస్య నుంచి ప్రపంచంలోని ఐదవ-అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను ''డిజిటలైజేషన్'' బయటపడవేయగలిగిందన్నారు. దీనికితోడు దేశం అనుసరిస్తున్న వివేకవంతమైన ఆర్థిక విధానం, వచ్చే ఆర్థిక సంవత్సరం (2022-23)లో మూలధన పెట్టుబడులను గణనీయంగా పెంచుతూ (33 శాతం పెంపుతో రూ.10 లక్షల కోట్లకు) బడ్జెట్‌లో తీసుకున్న కీలక నిర్ణయాలు, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతుండడం దేశ వృద్ధి వేగాన్ని కొనసాగించడంలో సహాయపడతాయని జార్జివా పేర్కొన్నారు. ఒక ఇంటర్వ్యూలో ఆమె ఈ మేరకు తెలిపిన అభిప్రాయాల్లో కొన్ని ముఖ్యాంశాలు...

- 2022-23లో భారత్ వృద్ధి రేటు 6.8 శాతంగా ఉండొచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ రేటు 6.1%గా ఉంటుందన్నది మా అభిప్రాయం. ఆయా గణాంకాలు దేశాన్ని ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఎకానమీగా నిలుపుతాయి.
- ప్రభుత్వ ఆదాయాలు-వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం ద్రవ్యలోటును 5.9 శాతానికి తగ్గించాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధి అభినందనీయం.
- భారత్ ఎకానమీ మిగతా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలాగా కాస్త నెమ్మదించినప్పటికీ, ప్రపంచ సగటు కంటే, భారత్ వృద్ధి వేగం ఎక్కువగా ఉంది. 2023లో ప్రపంచ వృద్ధిలో భారతదేశం వాటా దాదాపు 15 శాతంగా ఉంటుందని భావిస్తున్నాం.
- దేశాన్ని 'గ్రీన్ ఎకానమీ' వైపు మళ్లించడానికి, తద్వారా వృద్ధిని కొనసాగించడానికి పునరుత్పాదక ఇంధనాలతో సహా వివిధ విభాగాల్లో పెట్టుబడులు పెట్టడంపై భారతదేశం ఎంత శ్రద్ధ కనబరుస్తోందో నేను ప్రత్యేకంగా గమనించాను.



ధరలు పెంచిన వోల్వో



న్యూఢిల్లీ: వాహన తయారీ సంస్థ వోల్వో కార్ ఇండియా మైల్డ్ హైబ్రిడ్ మోడళ్లపై 2 శాతం వరకు ధర పెంచింది. ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీ సవరించిన నేపథ్యంలో పెరిగిన ముడిసరుకు వ్యయానికి అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీని ప్రకారం ఎక్స్‌సీ40, ఎక్స్‌సీ60, ఎస్90, ఎక్స్‌సీ90 వేరియంట్ల ధరలు అధికం కానున్నాయి. బెంగళూరు ప్లాంటులో ఈ మోడళ్లను కంపెనీ అసెంబుల్ చేస్తోంది.

భారతీయ యువతకు.. యూకే ఎర్రతివాచీ

జాబ్స్ అబ్రాడ్



» ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ప్రారంభం
» ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకూ దరఖాస్తులు
» బ్యాచిలర్ డిగ్రీ అర్హతగా దరఖాస్తుకు అవకాశం
» ఎంపికైతే రెండేళ్లపాటు యూకేలో కొలువుకు మార్గం

విదేశీ ఉద్యోగం..మన యువత స్వప్నం! డిగ్రీలు పూర్తవుతూనే విదేశీ విద్య, ఆ తర్వాత అక్కడే ఉద్యోగం కోసం అన్వేషిస్తుంటారు. ఇలాంటి యువతకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. అదే.. ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్!! భారత్, యూకే ప్రభుత్వాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం-ఈ కొత్త పథకం ఈ నెల 28 నుంచి అమల్లోకి రానుంది. ఈ నేపథ్యంలో..యూకే ప్రభుత్వ.. ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ఉద్దేశం, భారతీయ యువతకు ప్రయోజనాలు, అర్హత ప్రమాణాలపై ప్రత్యేక కథనం..

ఇండియా యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్ ఫస్ట్ బ్యాలెట్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు యూకే ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నెల 28న ప్రారంభం కానున్న బ్యాలెట్‌లో 2,400 వీసాలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొంది. మార్చి 2వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

అర్హతలు

భారతీయ పౌరుడై ఉండాలి. వయసు 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి. భారత్‌లోని గుర్తింపు పొందిన యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ,అంతకంటే ఎక్కువ అర్హతలు ఉన్న వారు దరఖాస్తుకు అర్హులు.

ఆన్‌లైన్‌లో బ్యాలెట్ ఎంట్రీ

తొలుత ఆన్‌లైన్ విధానంలో ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ బ్యాలెట్ దశకు దరఖాస్తు చేసుకోవాలి. పేరు, పుట్టినతేది, పాస్‌పోర్టు వివరాలు, పాస్‌పోర్ట్ స్కాన్ చేసిన కాపీ, ఫోన్ నెంబర్, ఈమెయిల్ ఐడీ తదితర వివరాలు ఇవ్వాలి. దీనికి ఉచితంగానే దరఖాస్తు చేసుకోవచ్చు. బ్యాలెట్ దశ దరఖాస్తు గడువు ముగిసిన రెండువారాల్లోపు ర్యాండమ్‌గా ఎంపిక చేసి.. విజేతలైన వారి ఈమెయిల్‌కు సమాచారం అందిస్తారు.

వీసాకు 30 రోజుల గడువు

- ప్రస్తుత ఫిబ్రవరి బ్యాలెట్ దశలో 2,400 వీసాలు అందుబాటులో ఉన్నాయి.
- బ్యాలెట్ దశలో ఎంపికైతే వీసాకు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారు. వీసాకు దరఖాస్తు చేసుకోవడానికి 30 రోజుల సమయం ఇస్తారు.
- బ్యాలెట్ దశలో ఎంపికై సంబంధిత అన్ని పత్రాలతో వీసాకు దరఖాస్తు చేసుకుంటే.. మూడు వారాల్లోపు వీసా మంజూరుపై నిర్ణయం వెలువడుతుంది. వీసా మంజూరైన వారు ఆరునెలల్లోపు యూకేకు వెళ్లాల్సి ఉంటుంది.
- ప్రస్తుత బ్యాలెట్‌లో ఎంపిక కాని వారు తదుపరి బ్యాలెట్(జూలై)కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది.

అవసరమైన పత్రాలు

వ్యాలిడ్ పాస్‌పోర్టు; విద్యార్హతల సర్టిఫికెట్లు; బ్యాంక్ అకౌంట్‌లో 2,530 పౌండ్లు ఉన్నట్లు చూపే పత్రం; టీబీ టెస్ట్ రిపోర్ట్, పోలీస్ క్లియరెన్స్ తదితర సర్టిఫికెట్‌లను వీసా దరఖాస్తు సమయంలో అందజేయాల్సి ఉంటుంది. • **ఫీజు వివరాలు:** దరఖాస్తు ఫీజు 259 పౌండ్లు, హెల్త్‌కేర్ సర్‌చార్జెస్ 940 పౌండ్లు చెల్లించాలి.

ప్రయోజనాలు ఇవే

- ఇండియా యంగ్ ప్రొఫెషనల్స్ స్కీమ్ ద్వారా వీసా పొందిన వారు గరిష్ఠంగా రెండేళ్లు మాత్రమే బ్రిటన్‌లో ఉద్యోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ సమయంలో వీరు చదువుకోవచ్చు. స్వయం ఉపాధి సైతం పొందొచ్చు. సొంతంగా కంపెనీ ప్రారంభించుకునే వీలుంది.
- వీసా అమల్లో ఉన్న కాలంలో ఎప్పుడైనా యూకేలో ప్రవేశించొచ్చు. తిరిగి స్వదేశానికి రావచ్చు. కావాలంటే మళ్లీ వెళ్లొచ్చు. అయితే వీసా రెండేళ్ల గడువు ముగిసాక పొడిగించుకునేందుకు అవకాశం ఉండదు.

సరళీకరణ బాట

బ్రిటన్ గత కొన్నేళ్లుగా భారతీయులకు స్టడీ, వర్క్ వీసాల విషయంలో సరళీకృత విధానాలను అనుసరిస్తోంది. గ్రాడ్యుయేట్ రూట్ వీసా, స్కేల్ అప్ వీసా వంటి పథకాలను ప్రారంభించింది. వీటి ప్రకారం-పోస్ట్ స్టడీ వర్క్ నిబంధనలను సడలించడం, కోర్సు పూర్తయి స్వదేశానికి వెళ్లిన తర్వాత రెండేళ్లలోపు తిరిగొచ్చి ఉద్యోగం కోసం అన్వేషించేందుకు అవకాశం కల్పించడం వంటి పలు చర్యలు తీసుకుంటోంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తులు ప్రారంభం: ఫిబ్రవరి 28, 2023
- దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 2, 2023
- వెబ్‌సైట్: https://www.gov.uk/india-young-professionals-scheme-visa

ఎంసెట్.. టాప్ స్కోర్ ఇలా!

ఇంజనీరింగ్.. ఇంటర్మీడియెట్ ఎంపీసీ చదువుతున్న లక్షల మంది విద్యార్థుల స్వప్నం! ఇందుకోసం ఇంటర్‌లో చేరిన తొలిరోజు నుంచే.. ఎంట్రెన్స్‌ల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తుంటారు. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు మొదలు.. రాష్ట్ర స్థాయిలో నిర్వహించే.. ఎంసెట్ వరకు అన్నింటికీ సిద్ధమవుతున్న పరిస్థితి! వీరంతా తమ ప్రిపరేషన్ మరింత ముమ్మరం చేయాల్సిన సమయం ఆసన్నమైంది. కారణం.. తెలంగాణ రాష్ట్రంలో.. ఎంసెట్-2023 ఇంజనీరింగ్ విభాగం పరీక్షను మే 7 నుంచి 11 వరకు నిర్వహించనున్నట్లు ప్రకటించడమే!! ఈ నేపథ్యంలో.. ఎంసెట్ పరీక్ష విధానం.. ఇందులో టాప్ స్కోర్ సాధించేందుకు మార్గాలు..

» టీఎస్ ఎంసెట్-2023 తేదీలు ఖరారు
» మే 7 నుంచి 11 వరకు ఇంజనీరింగ్ విభాగం పరీక్ష
» అన్వయ దృక్పథం, కాన్సెప్ట్‌లపై పట్టుతోనే విజయం

ఎంసెట్.. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులకు పరిచయం అక్కర్లేని పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో విజయం సాధించి.. రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీటు సొంతం చేసుకోవాలని లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతుంటారు. మే 7వ తేదీ నుంచి టీఎస్ ఎంసెట్ నిర్వహించనున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి ఇటీవల ప్రకటించింది. కాబట్టి ఇప్పటి నుంచి నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే.. మంచి ర్యాంకు సొంతం చేసుకునే అవకాశముంది.

మే 7 నుంచి 11 వరకు

టీఎస్ ఎంసెట్-2023.. ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను మే 7 నుంచి 11 వరకు ఆన్‌లైన్ విధానంలో అయిదు రోజులపాటు నిర్వహించనున్నారు. అంటే.. అభ్యర్థులకు దాదాపు రెండున్నర నెలల సమయం అందుబాటులో ఉంది. అయితే మార్చి 2 వరకు ప్రాక్టికల్ పరీక్షలు, ఆ తర్వాత మార్చి 16 నుంచి ఏప్రిల్ 4 వరకు బోర్డ్ వార్షిక పరీక్షలు జరగనున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకుంటే.. ఇంటర్ బోర్డ్ పరీక్షల తర్వాత ప్రిపరేషన్‌కు లభించే సమయం నెల రోజులు మాత్రమే. దీన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు ఇప్పటి నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.

ఎంసెట్ పరీక్ష ఇలా

ఎంసెట్ పరీక్ష మొత్తం 160 ప్రశ్నలు-160 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఆన్‌లైన్‌లో ఉంటుంది. ఇందులో ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 40, మ్యాథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు ఉంటాయి. అంటే.. మ్యాథమెటిక్స్‌కు ఎక్కువ వెయిటేజీ ఉంటుందని గుర్తించాలి. మ్యాథమెటిక్స్‌కు సంబంధించి మొదటి, ద్వితీయ సంవత్సరం సిలబస్‌లోని అన్ని టాపిక్స్‌పై పూర్తి పట్టు సాధించాలి.

70 శాతం సిలబస్

టీఎస్ ఎంసెట్-2023లో.. ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి 70 శాతం సిలబస్ నుంచే ప్రశ్నలుంటాయని తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది.ప్రస్తుతం ద్వితీయం సంవత్సరంలో ఉన్నవారు 2021-22లో ప్రథమ సంవత్సరం చదివారు. ఆ సమయంలో కోవిడ్ కారణంగా బోర్డ్ సిలబస్‌ను 70 శాతానికి కుదించిన విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇది విద్యార్థులకు ప్రిపరేషన్ పరంగా కొంత అనుకూలించే అంశంగా చెప్పొచ్చు. తొలగించిన 30 శాతం సిలబస్‌కు కొనసాగింపు ఉండే అంశాలను చదివే విషయంలో విద్యార్థులు కొంత ఇబ్బంది ఎదుర్కొనే ఆస్కారముంది. దీన్ని అధిగమించేందుకు తొలగించిన సిలబస్ అంశాలు, వాటికి కొనసాగింపుగా ఉన్న టాపిక్స్‌ను పరిశీలిస్తూ.. ప్రాథమిక భావనలు, సిద్ధాంతాలు, సూత్రాలపై అవగాహన పెంచుకోవాలని సబ్జెక్ట్ నిపుణులు సూచిస్తున్నారు.

బోర్డ్ పరీక్షలకు ప్రాధాన్యం

ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రస్తుతం తమ ప్రిపరేషన్‌ను పూర్తిగా ఇంటర్మీడియెట్ పరీక్షలకే కేటాయించాలనేది నిపుణుల సూచన. వాస్తవానికి ఎంసెట్ లక్ష్యంగా చేసుకున్న అభ్యర్థులు ఇప్పటికే తమ ప్రిపరేషన్‌ను పూర్తి చేసుకొని ఉంటారు. కాబట్టి ఎంసెట్ గురించి ఆందోళన చెందకుండా.. బోర్డ్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా కృషిచేయాలని సూచిస్తున్నారు.

వార్షిక పరీక్షల తర్వాత

బోర్డ్ పరీక్షలు పూర్తయ్యాక ఎంసెట్ ప్రిపరేషన్ కోసం పూర్తి సమయం కేటాయించాలి. వాస్తవానికి ఇప్పటికే ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. ఆ సమయాన్ని రివిజన్ కోసం వినియోగించుకునే విధంగా వ్యవహరించాలి. ప్రిపరేషన్ సమయంలో తాము రాసుకున్న సొంత నోట్స్,షార్ట్‌కట్స్‌ను అనుసరిస్తూ.. రివిజన్ సాగిస్తే సమయం ఆదా అవుతుంది.దీంతోపాటు ఎంసెట్ సిలబస్‌లో పేర్కొన్న అన్ని అంశాలను పూర్తి చేయడానికి ఆస్కారం ఉంటుంది.

కాన్సెప్ట్స్ ఆధారిత ప్రిపరేషన్

గత రెండు, మూడేళ్ల ఎంసెట్ ప్రశ్నల శైలిని గమనిస్తే.. అధిక శాతం ప్రశ్నలు అభ్యర్థులోని అప్లికేషన్ అప్రోచ్‌ను పరీక్షించే విధంగా ఉంటున్నాయి.కాబట్టి అభ్యర్థులు కాన్సెప్ట్స్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిపరేషన్ దశ నుంచే అప్లికేషన్ దృక్పథాన్ని అనుసరించాలి. ఫలితంగా ఎంసెట్‌లో మంచి మార్కులు సాధించే అవకాశం లభిస్తుంది.

సమయ పాలన

విద్యార్థులు ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత ప్రిపరేషన్ కోసం ప్రతిరోజు ప్రతి సబ్జెక్ట్‌కు మూడు గంటలు చొప్పున సమయం కేటాయించుకునేలా టైమ్ ప్లాన్ రూపొందించుకోవాలి. ఇలా ఒక్కో సబ్జెక్ట్‌కు నిర్దేశించుకున్న మూడు గంటల వ్యవధిలో మొదటి పదిహేను నిమిషాలను అంతకుముందు రోజు చదివిన అంశాల పునరావలోకనం కోసం కేటాయించాలి. ప్రిపరేషన్ సమయంలోనే ముఖ్యాంశాలతో షార్ట్ నోట్స్ రాసుకోవాలి. దీని వల్ల పరీక్షకు వారం రోజుల ముందు క్విక్ రివిజన్‌కు అవకాశం లభిస్తుంది.



టీఎస్ ఎంసెట్-2023

మోడల్ టెస్ట్‌లకు హాజరు

ఇంటర్మీడియెట్ పరీక్షల తర్వాత ఎంసెట్‌కు పూర్తి సమయం కేటాయించే అభ్యర్థులు.. ఆ సమయంలోనే మోడల్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లకు హాజరవ్వాలి. వీటి ఫలితాలను విశ్లేషించుకోవాలి. తద్వారా తమ సామర్థ్య స్థాయి, ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలపై స్పష్టత తెచ్చుకోవాలి. ఒకవేళ ఆయా అంశాలు క్లిష్టంగా ఉండి..ప్రస్తుత సమయంలో పట్టు సాధించలేమని భావిస్తే.. కనీసం ప్రాథమిక భావనల గురించి తెలుసుకోవాలి.

జేఈఈతో అనుసంధానం

ఎంసెట్‌కు హాజరయ్యే విద్యార్థుల్లో అధిక శాతం .. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్‌లకు కూడా సన్నద్ధమవుతుంటారు. ఇలాంటి అభ్యర్థులు జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షలతో ఎంసెట్ ప్రిపరేషన్‌ను అనుసంధానం చేసుకుంటూ చదవాలి. ఫలితంగా ఒకే సమయంలో మూడు పరీక్షలకు సన్నద్ధత లభిస్తుంది. జేఈఈ-మెయిన్-2023 సెషన్-2 పరీక్షలు.. ఏప్రిల్ 6 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఈ సెషన్‌కు హాజరయ్యే అభ్యర్థులు సీరియస్ ప్రిపరేషన్ సాగిస్తే.. అది ఎంసెట్‌లో టాప్ స్కోర్ సాధించేందుకు ఉపయోగపడుతుంది.

100కు పైగా సాధించేలా

టీఎస్ ఎంసెట్ అభ్యర్థులు 100కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలి. ఇంజనీరింగ్ కళాశాలలు, సీట్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటే.. 70 మార్కులు సాధించినా సీటు లభించే అవకాశం ఉంది. కాని బెస్ట్ కళాశాలల్లో సీటు సొంతం చేసుకోవాలంటే.. 100కు పైగా మార్కులు సాధించే ప్రయత్నం చేయాలి. అదే విధంగా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలు, టాప్-10 కళాశాలల్లో సీటు పొందాలంటే.. జనరల్ కేటగిరీ అభ్యర్థులు మరింత ఎక్కువగా కష్టపడాల్సి ఉంటుంది. ఎంసెట్ అభ్యర్థులు ప్రిపరేషన్ సమయంలో సిలబస్‌లోని అన్ని అంశాలపై పట్టు సాధించేలా వ్యవహరించాలి. అప్పుడే.. పరీక్షలో వీలైనన్ని ఎక్కువ ప్రశ్నలకు సమాధానం ఇచ్చే సంసిద్ధత లభిస్తుంది.

సబ్జెక్ట్‌ల వారీగా.. కీలక టాపిక్స్

మ్యాథమెటిక్స్

కోఆర్డినేట్ జామెట్రీ, డిఫరెన్షియల్ కాలిక్యులస్, ఇంటిగ్రల్ కాలిక్యులస్, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్. దీంతోపాటు 3-డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్; క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్; థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్;బైనామియల్ థీరమ్;లోకస్ అంశాలపై పూర్తి స్థాయి అవగాహన అవసరం.

ఫిజిక్స్

ఎలక్ట్రో డైనమిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మెకానిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఆప్టిక్స్, ఎస్‌హెచ్‌ఎం అండ్ వేవ్స్‌కు ప్రాధాన్యమివ్వాలి. అదే విధంగా సెంటర్ ఆఫ్ మాస్, మొమెంటమ్ అండ్ కొలిజన్; సింపుల్ హార్మోనిక్ మోషన్, వేవ్ మోషన్ అండ్ స్ట్రింగ్ వేవ్స్‌లో లోతైన అవగాహన ఏర్పరచుకుంటే.. మంచి మార్కులు సొంతం చేసుకునే అవకాశాలు మెరుగవుతాయి.

కెమిస్ట్రీ

కెమికల్ బాండింగ్, ఆల్కైల్ హలైడ్; ఆల్కహాల్ అండ్ ఈథర్, కార్బొనైల్ కాంపౌండ్స్, అటామిక్ స్ట్రక్చర్ అండ్ న్యూక్లియర్ కెమిస్ట్రీ, థర్మో కెమిస్ట్రీ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి-బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై పట్టు సాధించాలి.

టీఎస్ ఎంసెట్-2023.. ముఖ్య సమాచారం

- మే 7 నుంచి 11 వరకు ఎంసెట్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్).
- ఇంటర్మీడియెట్ ఎంపీసీ అర్హతతో పోటీ పడే అవకాశం.
- ద్వితీయ సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- మొదటి సంవత్సరంలో 70 శాతం సిలబస్ నుంచే ప్రశ్నలు.





Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk, Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.